సాహితి
గతి మారినప్పుడు పెరిగిన...
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-12-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 309 పేజీలు: 8 వెల: 6.50



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని ఘనంగా సన్మానిస్తున్న ఎన్డీయే ఎంపీలు

## ఇంటింటికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్

2లో

ప్రజా సమస్యలపై చర్చలో ఎంపీలంతా పాల్గొనాలి

ఎన్డీయె కూటమి ఎంపీల సమావేశంలో ప్రధాని మోడీ

నిబంధనలు జనజీవితాలకు భారం కాకూడదన్న పిఎం

# 'పూర్వోదయ'తో ఎపికి ఉషోదయం

**3 ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ**

**'సీమ'లో 20 లక్షల ఎకరాల్లో ఉద్యానసాగు**

**సాగునీరు, మౌలిక వసతులకు ప్రాధాన్యం**

**రూ. 5వేల కోట్లతో ప్రత్యేక గ్రామీణ రహదారులు: సిఎం చంద్రబాబు**



మంగళవారం సచివాలయంలో పూర్వోదయ పథకంపై సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులతో మూడు ప్రాంతాల అభివృద్ధికి సత్వరం ప్రతిపాదనలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ నిధులు సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యాన పంటల విస్తరణ, గ్రామీణ రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు వినియోగించేలా ప్రణాళికలు ఉండాలని సిఎం సూచించారు. సచివాలయంలో పూర్వోదయ, సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో మంగళవారం సిఎం సమీక్షించారు. ప్రకాశం సహా, రాయలసీమలోని 82 క్లస్టర్లలో ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి... 20 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలను విస్తరించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. పూర్వోదయ స్కీమ్‌లో భాగంగా రూ.40 వేల కోట్లు వివిధ ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందులో రూ.20 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు, మిగిలిన రూ.20 వేల కోట్లతో మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందని... అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలన్నారు.ఇందులో రూ.5 వేలకోట్లతో ప్రత్యేక గ్రామీణరహదారులు నిర్మించి.. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతో అనుసంధానం చేయాలని సిఎం సూచించారు. అలాగే, ప్రకాశం, రాయలసీమ పరిధిలో మొత్తం 23 మేజర్, మీడియం సాగునీటి ప్రాజె క్టులు, 1,021 చెరువులను పూర్తి చేయటంద్వారా ఉద్యాన పంటలకు నీరందించేలా కార్యాచరణ చేపట్టా లన్నారు.

**త్వరలో పోలవరం నల్లమల సాగర్ పనులు..**

రూ.58,700 కోట్లతో పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుల అనుసంధానం

>>2

## 8 మంది ఐఎఎస్‌లను కేటాయించిన కేంద్రం

**విజయవాడ, డిసెంబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం 2024 బ్యాచ్‌కు ఎంపికయిన 179 మంది ఐఎఎస్ అధికారుల్లో 8 మందిని ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ లేఖ రాసింది. రాష్ట్ర కేడర్‌కు కేటాయించినవారిలో బన్నా వెంకటేష్, ఎఆర్ పవన్ తేజ (ఆంధ్రప్రదేశ్), కె.ఆదిత్యశర్మ, చింతకింది శ్రవణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ), హరిఓం పాండియా (రాజస్థాన్), నమ్రతా అగర్వాల్ (హరియాణా), ప్రియ (ఢిల్లీ), సుయష్ కుమార్ (యుపి)లు ఉన్నారు. ఎపి స్వరాష్ట్రంగా ఉన్న చెన్నంరెడ్డి శివగణేష్రెడ్డిని ఎజిఎంయూటీ, పి.సురేష్ను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు.

# రెవెన్యూ సేవలు మరింత సులభతరం

**2027 డిసెంబరుకు భూముల సర్వే పూర్తి**

**రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల ఆటోమ్యుటేషన్: సిఎం చంద్రబాబు**

**విజయవాడ, డిసెంబరు 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రెవెన్యూ సేవలు మరింత సులభతరం కావాలని, చిక్కుముడులు లేకుండా చూడాలని అధికారులకు సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు సహా అన్నింటా రియల్ టైమ్‌లో ఆటమ్యుటేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటోమ్యూటేషన్ జరిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, రెవెన్యూశాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని స్పష్టంచేశారు. దీనిపై ప్రతీనెలా సమీక్షిస్తానని సిఎంవెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సిసిఎల్ఎ అధికారులు హాజరయ్యారు. పిజిఆర్ఎస్‌లో మ్యుటేషన్, పట్టాదారు పాస్

>>2

# ఎఐ టెక్నాలజీతో తిరుమల ప్రసాదం తనిఖీ

## - ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**విజయవాడ.డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో వెంకటేశ్వరస్వామి వారి భక్తులకు అన్నప్రసాదం తయారీలో వాడే దినుసులను జల్లెడ పట్టేందుకు ఎఐ టెక్నాలజీని వాడుతున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. బియ్యం, ఇతర దినుసుల్లో ఏ అన్యపదార్థం వచ్చినా ఎఐ టెక్నాలజీతో గుర్తించి యంత్రం వాటిని ఏరివేస్తుందనిచెప్పారు. తాము అధికారంలోకివచ్చాక లడ్డూ ప్రసాదంలో నాణ్యమైననెయ్యి, దినుసులు వాడుతున్నామని, అన్నప్రసాదంపై ఒక్క ఫిర్యాదు కూడా లేదని తెలిపారు. 'తిరుమలలో ఎన్టీఆర్ హయాంలో గొప్ప ఆశయంతో భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభించారు. వైఎస్సార్సీ ప్రభుత్వం దాన్ని భ్రష్టుపట్టించింది. భక్తులకు నాసిరకం భోజనం పెట్టారు. పాల సేకరణే చేయని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టిచ్చి దోచుకున్నారు' అని సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో చంద్రబాబు ధ్వజమెత్తారు. వేంకటేశ్వరస్వామి ఎంతో మహిమగల దేవుడని, ఒక జైన మతస్థుడు స్వామిపై భక్తితో 122 కిలోల బంగారం కానుకగా సమర్పించారని సిఎం తెలిపారు. ఇటీవల జైన

>>2




Visakhapatnam: Varun Motor - Siripuram: 9966739777, Pendurthi: 7799224440 Gajuwaka: 7799122258, Muralinagar: 9052267733 | Jayabheri Automotives Maddilapalem : 8008333557, Gopalapatnam :7780636899 | Srikakulam: Varun Motor : 8886521999 | Vizianagaram: Jayabheri Automotives : 8886662205 | Rajahmundry: SB Motor(Auto nagar) : 9885173738 | Varun Motors(Hukumpeta) : 8886616717 | Kakinada: SB Motor : 8886661920.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.




మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో హ్యాండీక్రాఫ్ట్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## 'పూర్వోదయ'తో ఎపికి ఉషోదయం

>> పైనా చర్చించారు. దీంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కొత్తగా 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని అధికారులు అన్నారు. మరో 6 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 60 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. అలాగే పారిశ్రామిక అవసరాల కోసం 20 టిఎంసిల నీటిని కేటాయించే వీలుందన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే పనులు మొదలు పెట్టాలని సిఎం ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టిఎంసిల గోదావరి వరద జలాలను బొల్లాపల్లి, నల్లమల సాగర్‌లకు... అలాగే, నాగార్జున సాగర్ నుంచి 50 టీఎంసీల కృష్ణా వరద జలాలను బొల్లాపల్లికి తరలించే యోచన చేయాలని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు. ఉత్తరాంధ్రలో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం రూ.5 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు ఆయిల్ పామ్‌కు, ఇతర ఉద్యాన పంటలకు అనుకూలమని.. ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ జిల్లాల్లో నేచురల్, ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించాలని సిఎం సూచించారు. రూ.169కోట్లతో వంశధార, నాగావళి, చంపావతినదుల అనుసంధానం చేపట్టేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. హిరమండలం రిజర్వాయర్, నారాయణపురం ఆనకట్టను అనుసంధానించటం ద్వారా 5 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిచ్చేందుకు వీలుంటుంది. సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



మంగళవారం గురుగ్రామ్‌లో హర్యానా గవర్నమెంట్ డాక్టర్ల సమ్మెతో సివిల్ హాస్పిటల్ వద్ద క్యూ కట్టిన రోగులు

# ఇంటింటికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** దేశం ఇప్పుడు పూర్తి స్థాయి 'సంస్కరణ ఎక్స్‌ప్రెస్' దశలో ఉందని, ఇక్కడ సంస్కరణలు వేగంగా, స్పష్టమైన ఉద్దేశ్యంతో జరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. మంగళవారం పార్లమెంట్ సెంట్రల్ హాలులో నిర్వహించిన ఎన్‌డిఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, క్లోజ్డ్ రోడ్ సమావేశానికి ఎన్‌డిఎ ఎంపీలందరూ పాల్గొన్నారు. ఎంపిలనుద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రభుత్వ సంస్కరణలు పూర్తిగా పౌర కేంద్రీకృతమైనవని, ఆర్థికంగాలేదా ఆదాయంపై దృష్టి సారించినవని పేర్కొన్నారు. సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలపై చర్చలో ఎంపీలు చురుకుగా పాలుపంచుకోవాలని, తద్వారా సంస్కరణ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఇంటికి చేరుకోగలదన్నారు. అలాగే 30-40 పేజీల దరఖాస్తులు, అనవసరమైన కాగితపు పనిని పూర్తిగాతొలగించాలని తాను కోరుకుంటున్నానని, పౌరుల తలుపుల వద్ద సేవలను అందించాలని, అలాగే పదేపదే డేటా సమర్పణలను తొలగించాలని ప్రధాని మోడీ సూచించారు. చట్టాలు, నియమ నిబంధనలు అనేవి జన జీవితాలను సులభతరం చేసేలా ఉండేలా తప్ప, వారిపై భారంగా మారకూడదని మంత్రులకు ప్రధాని హితవు పలికారు.

**ఇండిగో సంక్షోభంపైనా..**

కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి రాకుండా చూడాలని ఎంపీలు, మంత్రులకు ప్రధాని సూచించారు. మంచి నియమ నిబంధనలు అనేవి వ్యవస్థలను మెరుగుపర్చేలా ఉండాలే తప్ప, ప్రజలను వేధించేలా ఉండకూడదని ఎన్‌డిఎ కూటమి ఎంపిల సమావేశంలో ప్రధానమంత్రి మోడీ ఈమేరకు సందేశాన్ని ఇచ్చారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అనవసరంగా సాధారణ పౌరులకు ఇబ్బందిని, అసౌకర్యాన్ని కలిగించే చట్టాలు కానీ, నియమ నిబంధనలు కానీ లేకుండా చూడాలని కేంద్ర మంత్రులకు ప్రధాని సూచించారని తెలిపారు. ప్రభుత్వ రూల్స్ వల్ల ప్రజలకు సౌకర్యం కలగాలని ప్రధాని మోడీ పేర్కొన్నట్లు కిరణ్ రిజిజు తెలిపారు.

**ప్రధాని మోడీకి ఘనసన్మానం**

ఇటీవల బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ భారీ విజయం సాధించిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీని ఎన్‌డిఎ ఎంపీల సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, ఎన్‌డిఎ మిత్రపక్షాల నేతలు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఉద్యోగులతో నేడు డి సిఎం పవన్ భేటీ

**విజయవాడ, డిసెంబరు 9, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్యోగులతో నేరుగా చర్చించేందుకు సిద్ధమయ్యారు. బుధవారం మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో 'మాటామంతీ' కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామ స్థాయిలో అవినీతికి తావులేని, పారదర్శకమైన పాలన అందించేందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఈ సమావేశంలో ఆయన కోరనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ శాఖలో సుమారు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, గ్రామీణాభివృద్ధి శాఖలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం పదోన్నతులు, వేతనాల పెంపుతో పాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నూతన సంవత్సర కానుకగా సంక్రాంతి నాటికి ఈ ప్రయోజనాలను వారికి అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న ఈ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## లారీ ఓనర్ల సమ్మె వాయిదా

**విజయవాడ,డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** పాతవాహనాలు 13 యేళ్ల దాటిన వాటికి భారీగా ఫీజులు పెంచిన నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రినుంచి సమ్మెకు దిగాలనుకున్న లారీ యాజమానులు వెనక్కితగ్గారు. ఈ విషయంలో సమయం ఇవ్వాలని ప్రభుత్వం కోరడంతో లారీ యాజమానుల సంఘం సమ్మె వాయిదా. వేయాలని నిర్ణయించింది, ఈ విషయంలో ..4రోజుల్లో ఫిట్‌నెస్ ఛార్జీలు రివైజ్ చేస్తామన్న రవాణా శాఖ కమిషనర్ మాటను గౌరవించి ఈనిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది.

## 'అటల్ సందేశ్... మోడీ సుపరిపాలన' యాత్రను విజయవంతం చేద్దాం

### బిజెపి నిర్వహిస్తున్న ఈ యాత్రలో ఎన్డీయే పక్షాల నేతలు, మంత్రులు,ఎంఎల్‌ఎలు పాల్గొనాలని సిఎం చంద్రబాబు ఆదేశం

**విజయవాడ,డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** వాజ్‌పేయి స్ఫూర్తిని యువతలోనింపేలా 'అటల్ సందేశ్... మోడీ సుపరిపాలన' యాత్ర తలపెట్టిన బిజెపి కార్యవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఎన్డీయే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సిఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు చేపట్టే 'అటల్ సందేశ్ మోడీ సుపరిపాలన' యాత్రలో పాల్గొనాలని నేతలకు పిలుపునిచ్చారు. రాజకీయ భీష్మునిగా భావించే అటల్ జీ శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషమన్నారు. దేశంలో సుపరిపాలనకు వాజ్‌పేయి నాంది పలికారని... ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాదిని వేశాయని గుర్తుచేశారు. వాజ్ పేయి అజాతశత్రువని, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని అన్నారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్ పేయి.. కష్టంతో ఎదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9సార్లు లోక్‌సభకు, 2సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోందని సిఎం వెల్లడించారు. 18 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని.. 1998లో పోఖ్రాన్-2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తిని చాటారని కొనియాడారు. కార్గిల్ యుద్ధంతో శత్రువుకు తిరుగులేని సమాధానం ఇచ్చారన్నారు. వాజ్ పేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశ దశదిశ మార్చిందన్నారు. తనకు వ్యక్తిగతంగా కూడా ఆయనతో అనుబంధం ఉందని.. రాష్ట్రాభివృద్ధిలో ఆయన నాడు ఎంతో సహాయం చేశారని తెలిపారు. రాష్ట్రం కోసం ఏది అడిగినా కాదనేవారు కాదన్నారు.

# ఎఐ టెక్నాలజీతో తిరుమల ప్రసాదం తనిఖీ

>> మతస్థుడైన ఒక భక్తుడు తనను కలిసినప్పుడు ఆయన అనుభవం చెప్పారన్నారు. ఆయన తన వ్యాపారంలో కొంత వాటాను విక్రయించడంతో రూ.5 వేల కోట్లు వచ్చిందని, ఆయన స్వామివారికి 122 కిలోల బంగారం ఇస్తానని మొక్కుకున్నట్లు తెలిపారన్నారు. మొక్కు తీర్చేందుకు తిరుమల వెళ్లి అధికారుల్ని కలిస్తే శ్రీవారికి రోజూ 121కిలోల బరువైన ఆభరణాలు అలంకరిస్తామని వారు మాటల సందర్భంలో ఆయనకు చెప్పారన్నారు. 122 కిలోల బంగారం కానుకగా సమర్పించాలని ఆ స్వామివారే తనకు సందేశం పంపినట్లుగా ఆ భక్తుడు భావించారన్నారు. స్వామివారికి ఎంత మహత్యం లేకపోతే ఒక భక్తుడు 122 కిలోల బంగారం ఇస్తారని, స్వామివారిని దర్శించుకునేందుకు రోజూ లక్షమంది ఎందుకు వస్తారని. ఆయనపై భక్తుల నమ్మకం అలాంటిదని చంద్రబాబు అన్నారు. అంత మహిమగల దేవుడితో వైఎస్సార్సీ నాయకులు ఆడుకోవడంకరెక్టా?అని చంద్రబాబు అన్నారు తిరుమల శ్రీవారి పరకామణిలో రూ.70 వేలు కొట్టేసినవ్యక్తి ప్రాయశ్చిత్తంగా స్వామివారికి రూ.14 కోట్లు రాసిచ్చాడని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ చెప్పడం నమ్మశక్యంగా ఉందా? కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి పరకామణిలోనే దొంగతనం చేసిన వ్యక్తిని సమర్థిస్తున్నవారు రాజకీయాల్లో ఉండేందుకుఅర్హులా?వాళ్లతో రాజకీయం చేయాలంటే ఎంత బాధగా ఉంటుందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

## మద్యం కేసు నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా

**విజయవాడ,డిసెంబరు9,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. ఈ నెల 11న తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై గత వారంలోనే హైకోర్టు ఇరుపక్షాలను రాతపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశించింది. సోమవారం సిఐడి సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కెసిరెడ్డి తరపున న్యాయవాది యుగంధర్ రెడ్డి హాజరయ్యారు. కోర్టు ఆదేశాల మేరకు రాతపూర్వక వాదనలను సమర్పిస్తామన్న వారి హామీలను హైకోర్టు రికార్డు చేసింది. తీర్పును ఈ నెల 11న చెబుతామని వెల్లడించింది.

# ప్రతి జిల్లాలో మాక్ అసెంబ్లీకి చర్యలు

### అమరావతి బాలోత్సవంలో మంత్రి దుర్గేష్

**విజయవాడ,డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మాక్ అసెంబ్లీ జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో జరిగిన 'అమరావతి బాలోత్సవం'లో సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన, వక్తృత్వ, నృత్య, నాట్య, డ్రాయింగ్ పోటీలను స్వయంగా పరిశీలించారు. కాంతార, భరతమాత, రాణి రుద్రమదేవి, రైతు వేషంలోని చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వేలాది మంది విద్యార్థులతో అమరావతి బాలోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించిన నిర్వాహకులను మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'అనే నినాదంతో ఈ యేడాది అమరావతి బాలోత్సవం.. 8వ పిల్లల పండుగ నిర్వహించడం శుభ పరిణామమన్నారు.నేటి నుంచి 9 నుండి 11వ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ అమరావతి బాలోత్సవం విజయవంతం అవ్వాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. పిల్లల అభిరుచులు తెలుసుకొని తదనుగుణంగా ఉపాధ్యాయులు సైతం తమ బోధనా శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ విద్యార్థులను ఒకచోట చేర్చి వారి మధ్య ఆట పాటలు నిర్వహించడం, బృంద చర్చలు నిర్వహించడం వల్ల వారిలో స్నేహభావం, ఐకమత్యం, సమానత్వ విలువలు మెరుగుపడుతాయన్నారు. ప్రతి విద్యార్థికి చదువులతో పాటు కళలు, క్రీడలు, ఇతర అంశాల్లో ప్రావీణ్యం ఉంటుందని, తల్లిదండ్రులు తమ ఇష్టాలను పిల్లలపై రుద్దకుండా వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు.పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం బయట పడుతుందని తెలిపారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. విద్యార్థులే ఈ దేశ భవిష్యత్తుకు పునాది అని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అంతరి దుర్గేష్ అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, విజన్‌తో ముందుకు వెళ్తేనే అద్భుతాలుసృష్టించగలమని, ఈక్రమంలో విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పిడిఎఫ్ మాజీ ఎంఎల్సి కె.ఎస్.లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీకార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం, చక్కెరతోపాటు రాగులు, గోధుమ పిండి

### జనవరి 1 నుంచి చౌక డిపోలద్వారా పంపిణి

**విజయవాడ,డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం కార్డుదారులకు ఇప్పుడిస్తున్న రైస్, పంచదారతో పాటు జనవరి 1 నుంచి రాగులు, గోధుమ పిండి కూడా అందించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ రెండు సరకులను నవంబరునుంచే కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఇస్తున్నామని, జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ అంగీకరించారని చెప్పారు.ఈ మేరకు మంత్రి కార్యాలయం విడుదలచేసిన ప్రకటనలో రాష్ట్రంలో ప్రస్తుతం ఎఫ్‌సిఐకు కేవలం 7 కోట్ల 87 లక్షల మెట్రిక్ టన్నుల స్టోరేజ్ సామర్థం మాత్రమే ఉందని మనోహర్ అన్నారు.అదనంగా 3 లక్షల 87 వేల (3.87 లక్షల) మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉన్న విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నిన్న డిల్లీలో కలిసిన సందర్భంగా..దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా, పిపిపి మోడ్‌లో సైలోస్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ప్రకటించారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉండటంతో, వీలైనంత త్వరలో పిపిపి మోడ్‌లో ఆధునిక సైలోస్ ఏర్పాటు చేసేందుకు విధివిధానాలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో తరచూ ఎదురయ్యే నిర్విరామ వర్షాలతో రైతులు పడుతున్న ఇబ్బందులు చర్చలో వచ్చినప్పుడు, డ్రైయర్లు, రైస్ మిల్స్, సమగ్ర నిల్వ సదుపాయాలతోకూడిన ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ల రూపంలో సైలోస్ ఏర్పాటు చేస్తే పూర్తి స్థాయి సహకారం అందిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# రెవెన్యూ సేవలు మరింత సులభతరం

>> పుస్తకాలకు సంబంధించి 1,97,915 ఫిర్యాదులు వచ్చాయని సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ల్యాండ్ నేచర్, క్లాసిఫికేషన్ సంబంధిత వివాదాల దరఖాస్తులు 1,00,835, రీసర్వే అనంతరం భూమి తగ్గిందని వచ్చిన పీజీఆర్‌ఎస్ దరఖాస్తులు 1,00,295, జాయింట్ ఎల్‌పీఎంలపై 2,40,479 ఫిర్యాదులు నమోదైనట్టు వివరించారు.

**రీసర్వే పురోగతిపై ప్రతీ నెలా నివేదిక**

ప్రస్తుతం 6,693 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, ఇంకా 10,123 గ్రామాల్లో చేయాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే 2027 డిసెంబరు నాటికి రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ప్రతీ నెలా రీసర్వే పురోగతిపై నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. జాయింట్ లాండ్ పార్సెల్ మ్యాప్స్ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, భూమి వివరాలు డేటా బేస్ ఆన్‌లైన్‌లో ఉంటే ఇసి జారీ చేయడం సులభమవుతుందని సిఎం అన్నారు. అలాగే 22ఏ జాబితా నుంచి తొలగించాలని వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సిఎం సూచించారు. 22ఏ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్ లాంటి పటిష్ట వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భూముల వివరాలు అన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచితే వివాదాలు తలెత్తవని సూచించారు. డిస్ప్యూటెడ్ ల్యాండ్స్‌గా పరిగణించడం, వాటిని తొలగించడం వంటి అధికారం ఇన్నాళ్లూ జాయింట్ కలెక్టర్‌కు ఉండగా... ఇకపై డిస్ప్యూటెడ్ ల్యాండ్స్ పరిష్కరించే అధికారం ఆర్డీవోలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. చుక్కల భూములను 22ఏ జాబితా నుంచి తొలిగించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. 1999 వరకూ ప్రాథమిక సహకార సంఘాల వద్ద తాకట్టు పెట్టిన అసైన్డ్ భూములు కూడా 22ఏ జాబితా నుంచి తొలిగించాలన్నారు. బంజరు భూములు 1954కంటే ముందు సేల్ డీడ్స్ రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్‌ను 22ఏ నుంచి తొలగించాలని చెప్పారు.

**రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యం**

మున్సిపల్ పరిధిలో ఉన్న అసైన్డ్ భూములు మంత్రుల కమిటీ సిఫార్సు మేరకు 250 చదరపు గజాల లోపు స్థలాల్ని 50 శాతం బేస్ వాల్యూతో రెగ్యులరైజ్ చేయండి. అలాగే ఆక్వా కల్చర్ చేస్తున్న అసైన్డ్ భూముల్ని సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలి. అలాగే...10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రం వెంటనే పొందేలా కార్యాచరణ రూపొందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానించిన సమాచారం ద్వారా ఆదాయ ధృవపత్రం ఇవ్వాలి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా పెట్టుకున్నాం. మార్కెట్ విలువలతో భూమి విలువలు అప్ గ్రేడ్ చేయండి, అని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

10-12-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
షష్ఠి మ.1.52
మఖ, రా.2.47, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : ఉ.11.10-12.51
దు.ఉ.11.39-12.24
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** పండితులు, ప్రముఖులను కలుస్తారు. ఆర్థిక లావాదేవీలు అంతంత మాత్రంగా వుంటాయి. పాతమిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు.

**వృషభం:** చేపట్టి పనులు కొన్ని పూర్తి కాగలవు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. విజయ బాటలో పయనిస్తున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తాయి.

**మిథునం:** సహోద్యోగులతో అకారణంగా విరోధాలు ఏర్పడవచ్చు. క్రయ విక్రయాలలో కొంత మెలకువ అవసరం. వస్త్ర లాభం.

**కర్కాటకం :** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**సింహం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. మీ శక్తి సామర్థ్యాలు వెలుగులోనికి రాగలవు. స్థిరాస్తి విలువ పెరుగుతుంది

**కన్య:** కుటుంబ సమస్యలు పరిష్కారం కాగలవు. వృత్తి, ఉద్యోగాలలో సానుకూలమైన మార్పులు ఉంటాయి. గృహ నిర్మాణ యత్నాలు సాగిస్తారు.

**తుల:** షేర్లు, భూములు క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు అందుతాయి. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ధనలాభం కలదు.

**వృశ్చికం:** రాజకీయ, సాంకేతిక రంగాలలోని వారికి అనుకూలంగా వుంటుంది. స్థలాలు కొనుగోలు చేస్తారు. వాహనయోగం.

**ధనుస్సు:** సమాధానం లేని, పరిష్కారం కాని విషయాలలో నిబ్బరతతో వ్యవహరించి ప్రతిష్ఠను కాపాడుకుంటారు.ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** ముక్కుసూటితనం కన్నా లౌక్యంగా వ్యవహరించడం వలన గొప్ప కార్యక్రమాలను సులువుగా సాధిస్తారు.స్థిరాస్తి విలువ పెరుగుతుంది.

**కుంభం:** చాలామందికి మీ నుండి మౌనమే సమాధాన మౌతుంది. సోదరుల నుండి ధనలాభం. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు.

**మీనం :** మంచితనంతో సమయస్ఫూర్తితో అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూర్చుకుంటారు. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అఖండ-2 రిలీజ్‌కు రెడీ

### 12న విడుదలచేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడి

**హైదరాబాద్, డిసెంబరు 9:** నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 చిత్రం విడుదలకు మార్గం సులువయింది. కొత్త విడుదల తేదీని కూడా నిర్మాణసంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. ఈనెల 12వ తేదీ ఈ సినిమా విడుదలవుతుందని తెలిపింది. బాలకృష్ణ ప్రధానపాత్రలో బోయపాటిశ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఐదున విడుదలకావాల్సి ఉండగా చివరినిమిషంలో వాయిదా పడింది. మద్రాస్ హైకోర్టు స్టేవిధించడంతో నిర్మాతలసంఘం రంగప్రవేశంచేసి ఫైనాన్షియర్స్, నిర్మాతలమధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించడంతో హైకోర్టు స్టేను సడలించి సినిమా విడుదలకు అనుమతించింది. దీనితో 12వ తేదీ సినిమాను విడుదలచేస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రంనిర్మించారు. బాలయ చిన్నకుమార్తె తేజస్విని సహనిర్మాతగా వ్యవహరించారు.

# పాలిటెక్నిక్ విద్యార్థినిపై ర్యాపిడో డ్రైవర్ అత్యాచారం

### - నిందితుడిపై పోక్సో కేసు నమోదు

**తిరుపతి, డిసెంబరు 9, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో మరో ర్యాపిడో డ్రైవర్ పాలిటెక్నిక్ విద్యార్థినిపై అత్యాచారం చేశాడు. విద్యార్థిని హాస్టల్ మారే ప్రయత్నంలో ర్యాపిడో ఆటో బుక్‌చేసుకుంది. ఈ క్రమంలో పరిచయమైన నిందితుడు, ఆటోడ్రైవర్ సాయికుమార్‌తో ఆమెకు పరిచయమైంది. విద్యార్థిని ఫోన్ నంబర్ తీసుకున్న సాయికుమార్ తరచూ ఫోన్‌చేసి నమ్మకంగా మాట్లాడేవాడు. ఏదైనా అవసరం వచ్చినా తనకు చెప్పమని నమ్మించాడు. నిజమేనని నమ్మిన విద్యార్థినికి దారుణ ఘటన చవిచూసింది. సహాయం పేరుతో పరిచయం పెంచుకుని తన గదికి తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాధితురాలు భయాందోళన చెందింది. చేసేదిలేక తన స్నేహితురాలి సహాయంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలిపిరి పోలీసులు నిందితుడు సాయికుమార్‌ను అరెస్ట్ చేశారు.

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు

**పుత్తూరు (నగరి), డిసెంబరు 9 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా నగరి మండలం వికెఆర్ పురం సమీపం జాతీయ రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ పోటులో పనిచేసే సంతానం(39), శంకర్ సుబ్రమణి(50), చెన్నై మేడంబాకంకు చెందిన ప్రైవేటు ఉద్యోగి అరుణ్‌కుమార్ (40) మృతి చెందారు. తమిళ్‌సెల్వి (36), మదన్(40), యశ్వంత్(11) అనే వారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుచానూరులో నివాసం ఉన్న సంతానం, శంకర్ సుబ్రమణి పద్మావతి అమ్మవారి ఆలయ పోటులో పనిచేస్తున్నారు. ప్రతి మంగళవారం తిరుత్తణికి వెళ్లి సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని వస్తుంటారు. ఇలా వారు తిరుత్తణికి కారులో బయలుదేరగా చెన్నైకి చెందిన అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో పాటు తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి కారులో బయలుదేరారు. ఈ రెండు కార్లు వికెఆర్ పురం వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక వైద్య చికిత్స అందించి ఉన్నత వైద్యసేవల నిమిత్తం చెన్నై తాంబరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ తుషార్‌డూడీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### లైంగిక వేధింపుల కేసు:

# జాతీయ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్లు అరెస్ట్

**తిరుపతి,డిసెంబరు 9, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బిఎడ్ మొదటిసంవత్సరం విద్యార్థిని(27)పై లైంగిక వేధింపుల కేసులో తిరుపతి పోలీసులు బాధ్యులైన ఇద్దరు ప్రొఫెసర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై సిఎం చంద్రబాబునాయుడు, హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్వయంగా తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు రంగంలోకి దిగి చర్యలకు ఉపక్రమించారు.ఈ నేపథ్యంలో తిరుపతి సిఐ మురళీమోహన్, ఇద్దరు మహిళ ఎస్‌ఐలను ఒడిశాకు పంపారు. మంగళవారం ఉదయంనుండి బాధిత విద్యార్థిని పూర్తిస్థాయిలో విచారణ చేసి వీడియోరికార్డు చేశారు. బాధితురాలి ఫిర్యాదు, వెల్లడించిన ఆధారాలతో సాయంత్రానికి తిరుపతిలో వెస్ట్ పోలీసులు బాధ్యులైన ఇద్దరు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్లు ఆచార్య లక్ష్మణ్‌కుమార్, ఆచార్య శేఖర్‌రెడ్డిలను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే తిరుపతి పోలీసులు 75(1), 77, 79, 351(2), రెడ్‌విత్ 3(5) బిఎన్‌ఎస్ ప్రకారం 183/2025 కేసు నమోదుచేశారు. ఈ కేసు దర్యాప్తుచేసి ముద్దాయిలుగా ఉన్న ఆ ఇద్దరు ప్రొఫెసర్లను మంగళవారం అరెస్ట్ చేశారు. విద్యార్థినులు, మహిళల భద్రతలో రాజీలేదని, మహిళల భద్రతకు తిరుపతి పోలీసులు కట్టుబడిఉంటారని తెలిపారు.

# పరకామణి కేసులో మళ్లీ హైకోర్టు మెట్టెక్కిన సిఐడి!






## - లోక్‌అదాలత్‌లో రాజీ వ్యవహారంపై అదనపు నివేదిక అందజేత

**తిరుమల,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 92 అమెరికన్ డాలర్ల చోరీ కేసు వ్యవహారంలో కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సిఐడి అధికారులు అదనపు నివేదికను హైకోర్టుకు ఇచ్చింది. మరో రెండు సెట్ల సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యూడీషియల్‌కు సమర్పించాలని సిఐడిని హైకోర్టు ఆదేశించడంతో లోక్‌అదాలత్ అవార్డ్ ఎంతవరకు చట్టబద్ధత ఉందనేది తేల్చేందుకు విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలన నిమిత్తం నివేదికలు వారి ముందు ఉంచాలని రిజిస్ట్రీకి న్యాయస్థానం స్పష్టంచేసింది. అదనపు నివేదికను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయ నుంది కాగా ఈ కేసు విచారణ (నేడు)బుధవారంకు వాయిదా వేసింది. దీంతో పరకామణి చోరీ కేసులో మళ్ళీ కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో నివేదికను హైకోర్టుకు సమర్పించడంతో నేడు ఏం జరగనుందనేది. తదుపరి ఆదేశాలు ఎలా ఉండబోతాయనేది హాట్‌టాఫిక్‌గా మారింది. ఇప్పటికే 2023 ఏప్రిల్ 29వతేదీ పరకామణి విధుల్లో ఉన్న గుమస్తా రవికుమార్ 92అమెరికన్ డాలర్లు అపహరించి విజిలెన్స్‌కు పట్టుబడిన విషయం విదితమే. ఈ కేసులో తదుపరి తిరుమల పోలీసులు చట్టప్రకారం వ్యవహారించకపోవడం, కోర్టుకుచేరినా రాజీచేయడం అంతా పెద్ద తతంగమనేది ఆరోపణలు. 92అమెరికన్ డాలర్లు చోరీచేస్తే 14కోట్ల రూపాయలు ఆస్తులు టిటిడికి గిఫ్ట్‌డీడ్‌గా ఇవ్వడంవెనుక మతలబే దాగివుందనేది కూడా వెల్లువెత్తిన విమర్శలు. అయితే ఇటీవల నిందితుడు రవికుమార్ చోరీకి సంబంధించి, చేసిన పెద్ద తప్పిదంపై మహాపాపంగా అభివర్ణిం చాడు. అంతేగాక ఈ వ్యవహారంలో ఎవరికీ ఎలాంటి పైసా కూడా ఇవ్వలేదనేది ఆయన వీడియోరూపంలో వెల్లడించాడు. తొలిసారి దొంగతనం చేశానంటూ కూడా పేర్కొనడం విశేషం. మరీ ఇప్పటికే ఈ చోరీ కేసు వ్యవహారంలోమాజీ టిటిడి ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఇఒఎవి ధర్మారెడ్డి, మాజీ సివిఎస్‌ఒ నరసింహ కిశోర్, మాజీ విజిఒ గిరిధర్, ఏవిఎస్‌ఒలను పూర్తి వివరాలతో లోతుగా విచారణ చేపట్టి రికార్డు చేశారు. ఈ నివేదికలు ఇప్పటికే హైకోర్టుకు అందజేశారు. మరీ నేడు ఎలాంటి తీర్పు,ఆదేశాలు న్యాయస్థానం వెలువడిస్తుం దనేది మాత్రం టిటిడిలో ఉత్కంఠగా మారింది. కాగా ఇప్పటికే ఈకేసులో సమగ్రంగా నవంబర్ 6వతేదీ నుండి 26రోజులపాటు సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్ మరికొందరు అధికారుల బృందం అన్ని కోణాల్లో 40మందివరకు సాక్షులను, అధికారులను, మాజీ ఛైర్మన్‌లను, ఫిర్యాదిదారులను,నిందితుడ్ని పలు కోణాల్లో విచారణ చేసి రాబట్టిన వివరాలను రికార్డుచేసి 156పేజీల నివేదికలను ఈనెల 2వతేదీ న్యాయమూర్తి ముందు ఉంచిన విషయం విదితమే. పలువురినివిచారణ చేసింది. భక్తులు కానుకలుగా సమర్పించి లెక్కించే పరకామణిభవనం నుండి అమెరికన్ డాలర్లు చోరీ కేసులో లోక్‌అదాలత్‌తో రాజీ కుదుర్చుకోవడం చిన్నవిషయమేమీ కాదని హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక వాఖ్యలు చేసింది.

# తిరుమల సమాచారం

## భక్తుల అభిప్రాయాలకు గౌరవం

### - క్యూఆర్‌కోడ్‌తో మొబైల్‌స్కాన్ చేసి చెప్పొచ్చు




**తిరుమల,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** రోజూ లక్షమందివరకు వస్తున్న భక్తులకు సేవలను మరింత మెరుగుపరచడానికి ఉద్దేశించి విలువైన అభిప్రాయాలను భక్తుల నుండే టిటిడి సేకరిస్తోంది. వివిధ రకాల అభిప్రాయసేకరణ సర్వేలను టిటిడి ప్రారంబించింది. శ్రీవారిసేవకులు ఆలయం ముందు, ఆలయంపరిసరాల్లో, అన్నప్రసాదం కాంప్లెక్స్,లడ్డూకాంప్లెక్స్, సిఆర్‌ఒ తదితర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరించి మరింత మెరుగైనసేవలందించేందుకు సిఎం చంద్రబాబునాయుడు పిలుపుమేరకు టిటిడి ఐవిఆర్‌ఎస్,వాట్సాప్,శ్రీవారిసేవకులద్వారా భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరిస్తోంది. టిటిడి సాంకేతికంగా నిఘా పెట్టింది. తిరుమలలో వసతి సౌకర్యం ఎలా ఉంది...స్వామివారి దర్శనం బాగా జరిగిందా అనే ప్రశ్నలు శ్రీవారిసేవకులు భక్తులను అడిగి వారినుండి అభిప్రాయం సేకరిస్తున్నారు. ఈ ఫీడ్‌బ్యాక్‌ను టిటిడి ఐటి విభాగానికి చేరవేస్తే ఏదేని తీవ్ర సమస్యలు ఉంటే అక్కడ నుండి అధికారులకు అందుతుంది. క్షేత్రస్థాయిలో ఇఒ,అదనపు ఇఒ చేపట్టాల్సిన మార్పులు, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కార్యాచరణ అమలుచేస్తారు. కొండకు చేరుకున్న భక్తులు తొలుత వసతి కోసం, ఆ తరువాత స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో నిరీక్షించే సమయంలో ఎదురయ్యే సమస్యలు, సౌలభ్యంగా ఉన్న సేవలు విధానం ప్రశ్నల రూపంలో శ్రీవారిసేవకులకు తెలియజేసే వీలుకలిగింది. లడ్డూప్రసాదాల నాణ్యత,రుచి, తరిగొండవెంగమాంబ అన్నప్రసాదంలో అన్నప్రసాదాలు వడ్డన, ఇంకా మార్పులు తదితర అంశాలపై సూచనలు,సలహాలు తీసుకుంటూన్నారు. భక్తులు కూడా నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కలిగింది. ఐవిఆర్‌ఎస్, వాట్సాప్, ఈ సర్వే ,శ్రీవారిసేవకులద్వారా అభిప్రాయ సేకరణ తీసుకోవడమేగాక 17అంశాలపై భక్తులు తమ అభిప్రాయాలు చెప్పడానికి వీలుగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ కోసం ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోడ్‌యాప్‌ను తిరుమలకొండపై ప్రధాన కూడళ్ళలో, వసతికల్పన విచారణ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేశారు. భక్తులు ఈ విధానంలో అభిప్రాయాలు, ఫిర్యాదులు,సలహాలు ఇస్తే టిటిడి ఉద్యోగులు, అధికారుల్లో బాధ్యతను పెంపొందించే విధంగా మారింది. ఇలా ప్రతిరోజూ తిరుమలకు వచ్చిన భక్తుల ద్వారా అభిప్రాయాలు తీసుకుని ఏ విభాగంలోనైనా లోటుపాట్లు,మార్పులు చేపట్టే విషయంలో చర్యలు తీసుకునే వెసలూబాటు కలిగింది.

## ప్రజలందరూ సంతోషంగాఉండాలి : ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ప్రముఖులు కోరుకున్నారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు బావున్నాయని తెలిపారు. మంగళవారం ఉదయం ఆర్టీసి ఛైర్మన్ కొనకళ్ళ సత్యనారాయణ, ఎంఎల్ఎ రమేశ్‌బాబు, తమిళ నటుడు విక్రమ్‌ప్రభు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైకుంఠ ఏకాదశి, ద్వాదశిన రద్దీ నియంత్రణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి :ఎస్పీ సుబ్బరాయుడు



**తిరుమల,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న 30,31తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అన్నిచోట్ల క్యూలైన్ల నిర్వహణ, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలనితిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. ముఖ్యంగా వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు, క్యూలైన్లు, అన్నప్రసాదాల వితరణ, లడ్డూకౌంటర్ల వద్ద భద్రతపై టిటిడి విజిలెన్స్‌తో కలసి సమీక్షించారు. మంగళవారం సాయంత్రం అన్నమయ్యభవనంలో ఆయన సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమన్వయంగా వ్యవహరించాలన్నారు. వాహనాల పార్కింగ్ , భక్తులను అనుమతించే విషయాలపై సివిఎస్‌ఒ మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్‌తో కలసి పరిశీలించారు.

# విద్యుత్ సమస్యపై రైతుల ఆగ్రహం

## కర్నూలు, గుంటూరు జాతీయ రహదారిపై నిరసన

**ఆత్మకూరు డిసెంబర్ 9 ప్రభాతవార్త;** మండల పరిధిలోని కరివేన గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. రైతులకు విద్యుత్‌ను సమయానికి ఇవ్వకపోవడంతో పాటు తరచూ నిలిపివేయడం రైతులను, గ్రామస్తులను తీవ్రస్థాయిలో ఆందోళనకు గురిచేసింది. నేషనల్ హైవే ఎన్‌హెచ్ 340ది పై మంగళవారం గ్రామస్తులు రైతులతో కలిసి నేషనల్ హైవే రోడ్డుపై బైఠాయిస్తూ వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. నేషనల్ హైవేపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైతులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల గురించి తెలుసుకునేందుకు ఎప్పుడైనా కార్యాలయానికి వెళితే సిబ్బంది అందుబాటులో లేకపోవడం సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడం తమకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు విద్యుత్ కీలకమైందని ఇలా అనిశ్చితంగా విద్యుత్ నిలిపివేయడం వల్ల నష్టాలు ఎదురవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆకస్మిక నిరసనతో హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గ్రామంలో సిబ్బంది అందుబాటును నిర్ధారించాలని రైతులు డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విషయాన్ని ఆత్మకూరు అర్బన్ సీఐ రాము వెంటనే అక్కడికి చేరుకొని విద్యుత్ శాఖ అధికారులతో సీఐ తమ చరవాణి ద్వారా రైతుల ముందు మాట్లాడడంతో సమస్య సర్దుమనిగింది గ్రామ రైతులు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నిరసన చేపట్టడం దాదాపు గంటసేపు భారీ ట్రాఫిక్ జామ్ తో విద్యార్థినీలు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులు రోడ్డుపైనే సమయం కోసం ఎదురుచూస్తూ అక్కడే నిలిచిపోయారు సిఐ రాము జోక్యంతో వెంటనే ట్రాఫిక్ జామ్ నియంత్రణ చేసి ఉద్యోగులకు విద్యార్థులకు రైతులకు ఊరట కల్పించారు ఏవైనా సమస్యలు ఉంటే రైతులు ప్రజలు ఆ సంబంధించిన కార్యాలయాల వద్ద అధికారులకు వినతి పత్రం అందించే విధంగా ప్రజలు ముందుండాలని సిఐ రాము తెలిపారు.

# భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

## రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్




**సచివాలయం,డిసెంబర్ 09,ప్రభాతవార్త :** ఎటువంటి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీరి ్చదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ,స్టాంపులు,రిజిస్ట్రేషన్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూశాఖపై సమీక్షా సమావేశం జరిగిందని, ఈ సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. కృత్రిమ మేధ సహకారంతో రెవెన్యూశాఖలో జీరో ఎర్రర్ ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఏడాదిన్నర కాలంలో 7,600గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. రీ సర్వే 2.0ను 2027జనవరి నాటికి పూర్తిచేయాలని నిర్ణ ్ణయించామన్నారు. గతంలో ఆటో మ్యూటేషన్ లో చాలా ఇబ్బందులు తలెత్తేవని కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో 1.74లక్షల ఆటో మ్యూటేషన్ నమోదైనట్లు తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో ఆటోమ్యూటేషన్ జరిగి ఆయా డాక్యుమెంట్స్ రిజిస్టర్ పోస్టులో సదరు భూ యజమానికి చేరే విధంగా కార్యాచరణ రూపకల్ప చేశామన్నారు. ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని 26జిల్లాల్లో ఖాళీగా ఉన్న జేసి పోస్టులను వారం రోజుల్లో భర్తి చేయనున్నామన్నారు. ఫ్రీహోల్డ్ భూములు రాష్ట్ ్టంలో 36లక్షల ఎకరాలు ఉండాలని, అయితే నేడు లెక్కలోకి వస్తుంది కేవం 11లక్షల ఎకరాలు మాత్రమే అని అన్నారు. కుల ధృవీకరణ పత్రాలు ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నామన్నారు. 2.77కోట్ల కులధృవీకరణ పత్రాలు ఇప్పటి వరకు జారీ చేయడం జరిగిందన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 86శాతం పరిష్కరించామని, మిగిలిన 14శాతం త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి గురువారం రాష్ట్ ్టంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తున్నామన్నారు. ఈనాం భూముల పరిష్కారానికి రెవెన్యూ,ఎండోమెంట్ శాఖలు సమన్వయంతో పనిచేసి 45రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. భూ యజమానులందరూ జాయింట్ ఎల్పీఎమ్‌లను వెంటనే సబ్ డివిజన్ చేయించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 2లక్షల జాయింట్ ఎల్పీఎమ్ఎస్‌లు ఉన్నాయని, వారిలో అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

# సంస్కృత వర్సిటీలో కీచక పర్వంపై మహిళా కమిషన్ సీరియస్

### - తిరుపతి ఎస్పీతో మాట్లాడిన కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

### - ఐసిసి కమిటీ నివేదికపై క్షేత్రస్థాయి పరిశీలనకు కమిషన్ మెంబర్ కు ఆదేశాలు



**విజయవాడ,డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:**భ తిరుపతి సంస్కృత వర్సిటీలో కీచక పర్వం.. విద్యార్థినిపై ఇద్దరు ప్రొఫెసర్ల అఘాయిత్య ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ గా స్పందించింది. ఈమేరకు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ఈ విషయం పూర్వాపరాలను తిరుపతి జిల్లా ఎస్పీతో మంగళవారం మాట్లాడి తెలుసుకున్నారు. బీఈడీ చదువుతున్న విద్యార్థినిపై ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికదాడికి పాల్పడగా, మరో ప్రొఫెసర్ ఆ దృశ్యాలను వీడియో తీసి వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దాడిలో బాధితురాలు గర్భం దాల్చడంతో విషయం బయటపడింది. వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష ్మణకుమార్ కొంతకాలంగా మొదటి సంవత్సరం విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడుతూ ఏకాంతంగా ఉన్న దృశ్యాలను మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్‌రెడ్డి తన ఫోన్‌లో చిత్రీకరించారని.. అనంతరం ఆ వీడియోను చూపించి, బాధితురాలిని బ్లాక్‌మెయిల్ చేస్తూ లైంగికంగా వేధించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వెలుగులోకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కేసు ప్రాథమిక దర్యాప్తు వివరాలపై ఇప్పటికే తిరుపతి జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలిచ్చారు. తాజాగా ఆమె ఎస్పీతో మాట్లాడి ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి నేరానికి పాల్పడిన కీచకులపై కఠిన చర్యలు చేపట్టాలని.. కేసులో ఉన్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. బాధితురాలు పది రోజుల క్రితమే వర్సిటీ వీసీ కృష్ణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందించడంపై చేపట్టిన చర్యలను, వర్సిటీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక పంపాలని మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగంకు చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆదేశాలిచ్చారు.

# విద్యార్థిని లైంగిక వేధింపుల కేసులో బాధితురాలిని విచారణ చేసిన పోలీసులు

**తిరుపతి,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆచార్య లక్ష్మణ్‌కుమార్ మొదటి సంవత్సరం విద్యార్థినిపై పలుమార్లు లైంగికంగా వేధించినట్లు తిరుపతి పోలీసులు వివరాలు సేకరించారు. విద్యార్థినిపై ప్రొఫెసర్ లైంగిక వేధింపులతో మరో ప్రొఫెసర్ శేఖర్‌రెడ్డివద్ద ఆధారాలు ఉన్నాయని లైంగికంగా వేధించడంతో విద్యార్థిని ఒడిశాకు వెళ్ళిపోయిన విషయం విదితమే. ఆలస్యంగావెలుగుచూసిన ఈ ఘటనతో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి ఈ ఘటనపై వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రప్రభుత్వం కూడా తీవ్రంగా పరిగణించడంతో హోంమంత్రి అనిత ఆరా తీశారు. తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో ఇద్దరు మహిళ ఎస్ఐలున్న ఓ బృందాన్ని ఒడిశాకు పంపి జార్స్వపూర్‌లోని బాధిత విద్యార్థిని కలిశారు. మంగళవారం విద్యార్థినితో మాట్లాడిన పోలీసులకు షాక్‌తగిలేలా ఆశ్చర్యం కలిగించే విషయాలు వెల్లడించిందని తెలిసింది. యువతి నుండి పోలీసులు వీడియో స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. వాంగ్మూలంలో కీలక విషయాలు వెల్లడించిన బాధితురాలు. ఆచార్య లక్ష్మణ్‌కుమార్ పలు మార్లు లైంగికంగా వేధించినట్లు విద్యార్థిని వెల్లడించింది. ఆచార్య శేఖర్‌రెడ్డివద్ద ఇద్దరి వీడియో ఉందని మరింతగా లైంగికంగా వేధించాడని బాధితురాలు తెలిపింది. అయితే ప్రొఫెసర్ శేఖర్‌రెడ్డి తనతో ఎప్పుడూ మాట్లాడలేదని విద్యార్థిని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చిందని తెలిసింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా తిరుపతిలో పోలీసులు ఆ ఇద్దరు ప్రొఫెసర్లను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం సీరియస్ కావడంతో పోలీసులు తీవ్రంగా స్పందించారు.

# డిసిఎం పవన్‌కల్యాణ్‌పై మార్ఫింగ్ ఫోటోలు

## - వైసిపి పై జనసేననేతల ఫిర్యాదు



**తిరుపతి,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** దేశరాజకీయాల్లో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయనపై వైసిపి పేటిఎం బ్యాచ్ ఫోటోలు మార్ఫింగ్ చేసి వైరల్‌చేయడాన్ని జనసేనపార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హుందాతనంతో రాజకీయాలు చేస్తున్న పవన్‌కళ్యాణ్‌పై వైసిపి పేటిఎం బ్యాచ్ ఆర్థిక నేరస్థుడు జగన్ డిసిఎం పవన్ మొక్కినట్లు ఫోటోలు వైరల్‌చేయడం దారుణమన్నారు. అయితే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తిరుపతి ఏఎస్పీ రవిమనోహరచారికి కిరణ్‌రాయల్ బృందంఫిర్యాదుచేసింది. మేము మార్ఫింగ్ ఫోటోలు పోస్ట్‌చేయడం మొదలెడితే కొన్ని కాపురాలు కూలిపోతాయని కిరణ్ హెచ్చరించారు. ఇష్టానుసారంగా పోస్టులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. వైసిపి సోషల్‌మీడియా హద్దుదాటుతోందని తెలిపారు.

# కల్తీనెయ్యిపై బోర్డుకు చెప్పినా వినిపించుకోలేదు!

## - కొనుగోళ్ల కమిటీ నిర్ణయంతోనే నిరంతరంగా సరఫరా

**తిరుపతి,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యిసరఫరా జరుగుతోందని గతంలోనే టిటిడి బోర్డు పెద్దలకు, కొనుగోళ్ళకమిటీకి తెలిపినా పట్టించుకోలేదని, నిరంతరంగా సరఫరా చేశారని మాజీ జిఎం సుబ్రమణ్యం, కాంట్రాక్టర్ అజయ్‌సుగంధి వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. కల్తీనెయ్యిపై మైసర్ ల్యాబ్‌నివేదికలు అందినా బోర్డు పెద్దగా స్పందించలేదనేది సమాచారం ఇవ్వడం సిట్ అధికారులను విస్మయానికి గురిచేసింది. కల్తీనెయ్యి గురించి గత మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డివరకే పరిమితం చేశారనేది ఇప్పుడు కస్టడీలో నిందితులు వెల్లడించడం విశేషం. 2022లోనే నెయ్యిసరఫరా చేసిన బోలేబాబాడెయిరీ, ఆర్గానిక్ డెయిరీ,ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌డెయిరీల నెయ్యిశాంపిల్స్‌ల్యాబ్‌కు పంపినా కల్తీనెయ్యి ఆగలేదని సమాచారం ఇవ్వడం సంచలనంగా మారింది. అజయ్‌కుమార్‌సుగంధ్ కల్తీనెయ్యిపై తనకేమీ తెలియదనే సమాచారం ఇచ్చారనేది తెలిసింది. మరీ మాజీ జిఎం సుబ్రమణ్యం మాత్రం మొత్తంవిషయాలు బోర్డుకు తెలుసని, అధికారులు కేవలం నిమిత్తమాత్రులమేననేది వెల్లడించినట్లు సమాచారం. మరీ ఈ ఇద్దరు నిందితులు కస్టడీ విచారణ అనంతరం సాయంత్రం ఈస్టుపోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 12వతేదీ వరకు వీరి విచారణ చేసిన తరువాత మళ్ళీ మాజీలను పిలిచి అరెస్ట్‌చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు చర్చ మొదలైంది. మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఏ చిన్నఅప్పన్నను కస్టడీలో విచారణ చేసి కీలక విషయాలు రాబట్టిన విషయం విదితమే.

# ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్ - కారు స్వాధీనం

**తిరుపతి,డిసెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం నుండి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న కారును అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. కారులో ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్‌చేసి ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ జె.కులశేఖర్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ డిఎస్పీ ఎండి షరీఫ్ ,ఆర్ఐ సాయిగిరధర్, సిబ్బందిమామండూరు వద్ద తనిఖీల్లో అక్రమరవాణ బయటపడింది. ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్‌చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

# ప్రపంచ తెలుగు మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుకు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆహ్వానం



**విజయవాడ,డిసెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యాన వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావును పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆహ్వానించారు. విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో వి శ్రీనివాసరావును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మాతృభాష, తెలుగు సంస్కృతి. ఆచారాలు, తెలుగు ప్రజల సంఘటిత జీవనం తదితరంశాలు కీలకం మూడు రోజుల పాటు ప్రపంచ మహాసభలో ప్రస్తావించడం జరుగుతుందని వివరించారు. తెలుగునెలపై జరిగిన చారిత్రక ఘట్టాలు, ఉద్యమాలు ఇతరంశాలను సభలో చర్చించడం జరుగుతుందన్నారు. స మకాలీనంశాలపై కవిత్వం, గేయం, గజల్ తదితర ప్రక్రియల్లో కవులు, రచయితలు భావవ్యక్తికరణ చేస్తారని తెలిపారు. గుంటూరులోని అమరావతి శ్రీ సత్యసాయి స్పిర్చువల్ సిటీ ప్రాంగణంలోజరిగే కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరు కావాలని కోరారు.

# భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పనిసరి

## - గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి - జిల్లాలోని పలు స్టేషన్లను తనిఖీ చేసిన ఐజి



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** నగరంలోని వేదాయపాలెం, నెల్లూరు రూరల్‌తో పాటు పొదలకూరు రాపూరు పోలీసు స్టేషన్‌లను గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా యస్.పి. అజిత వేజెండ్లతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌ల మ్యాప్‌లను పరిశీలిస్తూ, స్టేషన్స్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా ఐజి మాట్లాడి, వారి సమస్యను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదపూర్వకంగా పలకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విని, పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్, ల్యాండ్ గ్రాబర్స్‌పై నిరంతరం నిఘా ఉంచాలని, వారి కదలికలపై ఇంటెలిజెన్స్ సేకరించి, లా అండ్ ఆర్డర్‌కు హాని కలిగించే ప్రయత్నాలు ఉంటే వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజా సేవించే వారు, అమ్మే వారిపై కఠినంగా కేసులు నమోదు చేసి నెట్‌వర్క్‌ను పూర్తిగా నిరోధించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్‌లను గురించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులతో పాటు పట్టణ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రేవ్ క్రైమ్స్, ప్రాపర్టీ ఆఫెన్స్ కేసులపై వేగవంతంగా విచారణ జరపాలని ఆదేశించారు. దొంగతనం కేసుల్లో కోల్పోయిన సొత్తును త్వరగా రికవరీ చేసి బాధితులకు తిరిగి అందించాలని, రికవరీ రేటు పెరగాలని, దొంగల గ్యాంగ్స్‌పై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా మహిళలను, వ్యాపారులను, సెలబ్రిటీలను బ్లాక్‌మెయిల్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని, స్టేషన్ సిబ్బంది యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని వారి గ్రీవెన్స్‌ను అడిగి, వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు.

**MUNICIPAL ADMINISTRATION DEPARTMENT**
**NANDIKOTKUR MUNICIPALITY**
Nandikotkur Municipality, Old Bus stand, Nandikotkur,
Telephone No. 08513-280312., e-mail id: mc.nandikotkur@cdma.gov.in

**E-PROCUREMENT NOTICE**

E-Tender:
Tender Notification No.
1. Tender Notice No. 05/15th F.C/UPHC/Engg/NDKTR/2025. Dt: 09/12/2025 of Nandikotkur Municipality (2nd Call). **Name of the grant:** 15th F.C. **No. of works:** 01 No. of Work (2nd Call). **Tender Document download Start Date:** Date: 10.12.2025 Time:11:00 A.M. **Tender Document download end date and time:** Date: 29.12.2025 Time: 3:00 P.M. **Last date and time of receipt of Bids :** Date: 29.12.2025 Time: 4:00 P.M. **Date & Time for opening of Technical Bid :** Date: 29.12.2025 Time: 5:00 P.M. E-Tender Website: https://tender.apeprocurement.gov.in. E-Mail ID for Clarifications/Communication: mc.nandikotkur@cdma.gov.in. **Note:** Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued. **Contact:** No's: 8333903567, 8333903566. Further details can be seen @e-procurement market place at **www.apeprocurement.gov.in.**

Sd/-(S.Baby), Commissioner Nandikotkur Municipality.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Rayapudi, Amaravati-522 237, Andhra Pradesh State.

**E PROCUREMENT SHORT TENDER NOTICE**

APCRDA invites tenders for the following works.

| S.No | NIT Number | Name of the Work |
| --- | --- | --- |
| 1 | 33/MAU61-USI0HB (HEEW)/10/ 2025-HB/2ndCall Dt:09.12.2025 | "Providing Technical Services for carrying out the Operation & Maintenance of Electrical Sub Station (ESS), HT/LT Panels, Associated equipment, DG Sets, Water Treatment Plant (WTP) & Sewerage Treatment Plant (STP) for period of 24 months for AP High Court buildings at Nelapadu, Amaravati" – **Estimated Amount: Rs.62,20,000/-** |
| 2 | MAU61-ADMN0SD (VI)/39/2025-IFR1 Dt:09.12.2025 | "Providing approach road with Granular material (GSB) to CITD, L&T, HPCL, BPCL, GAIL Sites at Nidamarru Village in Amaravathi Capital City - **Estimate Cost Rs. 62.00 Lakhs** |

The bids can be downloaded on AP e-procurement portal from **11.12.2025 to 18.12.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bids **18.12.2025 up to 15.00 Hrs,** Technical bid opening **18.12.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Amaravati

వార్త


స్నేహం నిదానంగా వికసిస్తుంది. నెమ్మదిగా వర్ధిల్లుతుంది. ఒకరినొకరు అర్థం చేసుకోవడం వల్ల త్యాగం చేసుకోవడం వల్ల విస్తరిస్తుంది.

-సిసిరో

# కీచకులను అణచలేమా?

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే ఎంతో గొప్పగా చెప్పుకుంటుంటాం. కానీ సమాజంలో పూజనీయులైన మహిళల రక్షణ విషయంలో చెప్పుకోదగిన గౌరవ మర్యాదలతో ప్రవర్తించలేకపోతున్నాం. మహిళా రక్షణ విషయంలో ఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు నివారించేందుకు పటిష్టమైన, కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పాలక పెద్దలు చెప్తూనే ఉంటారు. మరొకపక్క మహిళా సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి పథకాల మీద పథకాలు ప్రవేశపెడుతున్నట్లు ప్రచారం పెద్దఎత్తునే జరుగుతున్నది. ఈ ప్రభుత్వం, ఆ ప్రభుత్వం అని కాదు ఎవరు అధికారంలో ఉన్నా ఈ కార్యక్రమాలుజరుగుతూనే ఉన్నాయి.కానీ ఆచరణకు వచ్చేసరికి అవి అంతగా అమలుకు నోచుకోవడం లేదేమోననిపిస్తున్నది. చట్టసభల్లో మహిళా బిల్లు ఏనాడో అటకెక్కించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలకులు ఎంతగా చెప్తున్నారో ఆ చట్టం తమను ఏమీ చేయలేదనే దీమాతో మహిళలపై నేరాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి.వాస్తవంగా చదువు సంధ్యలు పెరిగేకొద్దీ విజ్ఞానం ఆర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పురావాలి. సభ్యత, సంస్కారం మరింత పెరగాలి. దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నామేమోననిపిస్తున్నది. తాజాగా నిన్న సోమవారం పట్టపగలు ఒక ప్రేమోన్మాది పిచ్చెక్కినట్లు యువతి ఇంటికే వెళ్లి తల్లిదండ్రులు చూస్తుండగానే కత్తితో గొంతు కోసి హత్యచేశాడు. సికింద్రాబాద్ నడిబొడ్డులోని వారాసిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో బతుకు తెరువు కోసం నగరానికి వచ్చి జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన ఒక యువతిని వారి దూరపు బంధువుగా చెప్పుకుంటున్న యువకుడు తనను పెళ్లి చేసుకోవాలని బలవంత పెట్టాడు. అయితే ముందుగా ఆమె నిరాకరించకపోయినా ఆ తర్వాత అతని ప్రవర్తన, అలవాట్లను తెలుసుకొని పెళ్లికితిరస్కరించింది. దీంతో కక్షపూనిన ఆ యువకుడు సోమవారం ఉదయం ఇంటికి వచ్చి ఆ యువతిపై దాడి చేశాడు. ఆ సమయంలో యువతి తల్లిదండ్రులు, మరో చెల్లి కూడా అక్కడే ఉంది. తనతోపాటు తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి, అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆ తల్లిదండ్రులు కళ్లముందు జరిగిన ఆ సంఘటనతో నిశ్చేష్టులైపోయారు. కళ్లముందే బిడ్డను చంపడంతో కన్నీరు మున్నీరయ్యారు. ఇక నిర్మల్‌లో ఒక టీస్టాల్ నడుపుకుంటున్న మహిళలపై ఒక కిరాతకుడు దారుణంగా కత్తితో పొడిచి చంపాడు. సోమవారం ఉదయం అందరు చూ స్తుండగానే కత్తితో టీస్టాల్ వద్దకు వచ్చి ఆమెను నేరుగా విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆ మహిళ కుప్పకూలిపోగా అక్కడున్న స్థానికులు భయంతో పారిపోయారు. అయితే యువతి చనిపోయే వరకు ఆ రాక్షసుడు అక్కడే కూర్చొని అదే టీస్టాల్‌లో టీ తాగుతూ కాలం గడిపాడు. పోలీసులు వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. పోలీసులన్నా,చట్టాలన్నా భయం సన్న గిల్లిపోతున్నది. ఇక అత్యాచారాల గురించి చెప్పక్కర్లేదు. మొన్న తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో ఒక విద్యార్థినిపై అత్యాచారం జరిగిన సంఘటన విస్తుపోయేలా చేస్తున్నది. అందులో కొందరు అధ్యాపకుల పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ యువతి తనకు జరిగిన దారుణాన్ని గూర్చి ఫిర్యాదు చేసిమౌనంగా తన రాష్ట్రానికి వెళ్లిపోయింది. ఈ విషయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికిపోవడంతో స్పందించి దర్యాప్తునకు ఆదేశించారు. ఆ జిల్లా ఎస్పిని ప్రత్యేకంగా ఈ కేసు దర్యాప్తులో శ్రద్ధ తీసుకోవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ప్రత్యేక టీమ్‌లను ఆ యువతి స్వరాష్ట్రానికి పంపి వివరాలు సేక రిస్తున్నట్లు పోలీసు ఉన్నతవర్గాలు చెబుతున్నాయి. మరొక పక్క ఆ రాష్ట్ర హోంమంత్రి దీనిపై మాట్లాడుతూఎలాంటి పరిస్థితుల్లోనూ అందుకు కారకులైన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులు, పాలకులు స్పందించడం, ఆ తర్వాత మరచిపోవడం సాధారణమైపోతున్నది. అందుకే కేసులన్నా, చట్టాలన్నా నేరస్తుల్లో భయం, గౌరవం క్రమేణా సన్నగిల్లుతున్నాయి. ఇలాఎందరో మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. బయటకు చెప్పుకోలేక అటు పోలీసు స్టేషన్ గడప ఎక్కలేక తమలో తాము కృంగిపోతూ ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు తరుచుగా చోటుచేసుకుంటున్నాయి. తాము పోతే పిల్లలకు దిక్కు ఉండరనే భయాందోళనతో పిల్లలను కూడా చంపి ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి.దీనికితోడు కుల, మత, వర్గాలకు అతీతంగా సమాజాన్ని తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతుంటే మరొకపక్క మూర్తీభవించిన మూఢ నమ్మకాలు, కుల వ్యవస్థపై ఉన్న భ్రమలతో నేటికీ కన్న తల్లిదండ్రులు హత్యలకు పాల్పడుతున్నారు. తమ ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నయువతీ యువకులు ఎందరో ఉన్నారు. ఇక ఇలా ప్రేమవివాహం పేరుతో జరుగుతున్న మోసాలు అన్నీఇన్నీ కావు. అత్యాచారాలు, బలత్కారాలు, వెంటపడి వేధించే కీచకులు పెచ్చరిల్లిపోతున్నారు. అలాని పాలకులు ఏం చేయడంలేదని చెప్పడం లేదు. నిర్భయ చట్టంతో వీటిని కొంతవరకైనా నియంత్రించవచ్చని ఆశించారు.కానీ అది నిరాశే అయింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలుచేసి చేతులు దులుపుకోకుండా ఆచరణకు త్రికరణ శుద్ధిగా ప్రయత్నించాలి. శిక్షల నుంచి తప్పించుకోలేమనే భయం నేరస్తుల్లో కలిగించాలి. అప్పుడే ఈ పశుప్రవృత్తికి కొంతవరకైనా పగ్గాలు వేయగలుగుతారు.

తనకు నచ్చిన పనిని పెద్ద మూర్ఖుడు కూడా చేయగలడు. కానీ ప్రతి పనిని తమ అభిరుచికి అనుగుణంగా మలచుకొని చేయగలిగేవారు వివేకవంతులు.



స్వామి వివేకానంద

జీవితంలో విజయం సాధించాలి అనుకుంటే మెట్లవైపు చూస్తూ ఉండక, వాటివైపు పయనం సాగించాలి.



తిరువళ్లువర్

# కర్షకుల కష్టాలు తీరేదెప్పుడు?

**దేశ వ్యాప్తంగా రైతులకు ఉచిత విద్యుత్ అందించాలి. అన్ని రాజకీయ పార్టీలు ఉచిత విద్యుత్ విషయంలో స్పష్టతనివ్వాలి. రైతులను ఇబ్బంది పెట్టబోమని ప్రస్తుత ప్రభుత్వాలు చట్ట బద్ధమైన హామీఇవ్వాలి. ప్రతిపక్ష పార్టీలు కూడా రైతు సమస్యల విషయంలో తమ నిర్ణయాలను స్పష్టం చేయాలి. ఉద్యోగుల కిస్తున్న సదుపాయాలను రైతులకు కూడా వర్తింపచేయాలి. రైతుల జీవితాలకు భద్రతకల్పించాలి. మూడెకరాలలోపు వ్యవసాయ భూములుగల రైతులకు పెన్షన్ సదుపాయం కలుగచేయాలి. వ్యవసాయం నిలదొక్కుకోవడానికి ఎం.ఎస్. స్వామినాథన్ సిఫా ర్సులను,సూచనలను అమలు చేయాలి.మనదేశంలో అనేక పంటలు పండుతున్నాయి. పండించిన పంటలకు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇతరరంగాల మాదిరిగా వ్యవసాయం చేసే రైతులకు స్వేచ్ఛలేదు. ధరలు నిర్ణయించుకునే హక్కులేదు.ఇలాంటి పరిస్థితులు మారాలి. వ్యవసాయం పట్ల మక్కువ చూపే యువతను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.**



సుంకవల్లి సత్తిరాజు

సర్వీసు రంగం భారత దేశస్థూల జాతీయోత్పత్తిలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నది. సర్వీసు రంగంవాటా భారత దేశ జిడిపిలో 54.9శాతంగా ఉంటే, వ్యవసాయ రంగం వాటా 14.4 శాతంగాను,పారిశ్రామికరంగం వాటా 30.7శాతంగాను ఉంది.అయితే భారతదేశం ఈనాటికీ ప్రధానంగా వ్యవసాయరంగం మీదే ఆధారపడి ఉంది. వ్యవసాయ అదాయం తక్కువగా ఉన్నప్పటికీ వ్యవసాయం మీదే ఈనాటికీ అధిక శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు.ఈ విషయాన్ని దృష్టిలోఉంచుకుని ప్రభుత్వాలు భవిష్య అవసరాలు, ఆహార భద్రతను పరిగణలోకి తీసుకుని, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలి.వ్యవసాయ మంటే నష్టాలకు నెలవుగా, అప్పుల కొలిమిలా భావించే పరిస్థితులు పోవాలి. వ్యవసాయరంగంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి.ప్రతీ సంవత్సరం పెరుగుతున్నవ్యవసాయ ఖర్చులు రైతులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఎరువులు, పురుగు మందుల ధరల పెరుగుదలకు అంతం లేకుండా పోయింది. పెట్టుబడులకు,రాబడికి మధ్య హస్తిమశకాంతమంత వ్యత్యాసముంది. తిండి పెట్టే రైతన్న తిండిలేక అలమటిస్తున్నాడు రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలులభించడం లేదు. పండించిన పంటలను అమ్ముకోవడానికి ఎన్నో నిబంధనలు అడ్డొస్తున్నాయి. ఒక్కోసారి కొనే నాథుడే లేక పంటలు కారుచౌకగా అమ్ముకోవడం జరుగుతున్నది. వాతావరణంమీద ఆధారపడి నిరంతరం ఆందోళనతో జీవించే అన్నదాతల కష్టాలను అవగతం చేసుకోవడంలో దాదాపుగా అన్ని ప్రభుత్వాలు విఫలమైనాయి. రైతుల జీవితాలుఅప్పుల కుప్పలుగా మారిపోతున్నాయి. బ్యాంకు అప్పులు, ప్రైవేటు అప్పులు తీర్చలేక రైతులు దిగాలు పడుతున్నారు. అధిక వడ్డీలకు బయట అప్పులు తెచ్చి వాటిని తీర్చలేక, వత్తిళ్ళు భరించలేక, అవమానాలు సహించలేక పంట చేలో చల్లే పురుగు మందులతో జీవితాలను ముగిస్తున్నారు. రైతులపై అప్పుల భారం విపరీతంగా పెరిగిపోయింది. రైతులకు జరుగుతున్న అన్యాయం అంతా ఇంతా కాదు.అన్నదాతల జీవితాలు విషాదాంతంగా ముగియడానికి కారణమేమిటి? ఇందుకు బాధ్యులెవరు? వ్యవసాయ రంగంపై ఎందుకింత నిర్లక్ష్యం? ఎందుకింత వివక్ష? వ్యవసాయరంగం లేకపోతే పెరుగుతున్న జనాభాకు ఆహారం ఎక్కడ నుంచిలభిస్తుంది? ప్రపంచంలో సంభవించిన ఆర్థిక మాంద్యం ప్రభావం వలన చాలా దేశాల్లో ప్రజలకు తినడానికి తిండిలేక ఆకలి చావులు సంభవిస్తున్నాయి.చమురు ధరలు కూడా వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి.అరకొరగా ఉపయోగించే యంత్ర పరికరాలు కూడా ఇంధన ధరలు భరించలేక, రైతులకు భారంగా తయారైనాయి. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు చేపట్టాలని, యాంత్రీకరణ ముమ్మరం చేయాలనే సలహాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇవి కేవలం ఉచిత సలహాలు మాత్రమే. ప్రస్తుతం వినియోగిస్తున్న ట్రాక్టర్లు, వరికోత యంత్రాల ఖర్చులకే కుదేలైపోతున్నపరిస్థితుల నేపథ్యంలో రైతులకు వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ తలకు మించిన భారం కాగలదు.దీనిపై విస్తృత మేథోమధనం జరగాలి. ప్రపంచం 2020 సంవత్సరం నుండి ఆర్థికంగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. కోవిడ్ విలయతాండవం ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఆర్థికంగా అనేక రంగాలు కుదేలైపోయాయి. కరోనా సంక్షోభం నుండి కుదుట పడి ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో రష్యా,ఉక్రెయిన్ల మధ్య సంవత్సరాల తరబడి కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాలను ఆర్థికంగా అధః పాతాళానికి దిగజార్చింది.ఇరుదేశాల ఆయుధ పోరాటం,సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల బ్రతుకులను ఛిద్రం చేసింది.భారత దేశానికి చిరకాల మిత్ర దేశమైన రష్యా ఇబ్బడి ముబ్బడిగా చమురును సరఫరా చేయడాన్ని అమెరికా అధ్యక్షుడుడోనాల్డ్ ట్రంప్ జీర్ణించుకోలేక భారత్‌పై ప్రతీకార సుంకాలను పెంచుతూ, రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని హెచ్చరిస్తున్నది. ఇటీవల పుతిన్ భారత్ సందర్శన సందర్భంగా ఇరు దేశాల మధ్యగల చిరకాల సుహృద్భావ వాతావరణాన్ని మరింతగా పెంచారు.రష్యా నుండి భారత్‌కు చౌకగాచమురు లభిస్తున్న నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం తక్కువ ధరకు ఇంధనాన్ని విక్రయించి, వ్యవసాయరంగం ఇంధన అవసరాలను తీర్చాలి. ప్రపంచంలోని పలుదేశాలు ఆకలి కేకలతో అలమటిస్తున్నాయి.ప్రపంచ జనాభా ఆకలి తీర్చగల శక్తి కేవలం వ్యవసాయ రంగానికే ఉందన్న వాస్తవాన్ని గ్రహించాలి. వ్యవసాయ రంగం ప్రాధాన్యతను గుర్తించాలి. రైతుల కోసం అనేక పథకాలు ప్రకటించారు.ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘాల్లో వినూత్నమైన మార్పులకు శ్రీకారంచుట్టారు. సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టారు. వై.ఎస్.ఆర్ కూడా రైతుల శ్రేయస్సుకు పాటుపడ్డారు. ఉచిత విద్యుత్ అందించారు. కరెంటు కష్టాలతో సతమతమవుతున్న రైతాంగానికి చంద్రబాబు హయాంలోని విభజిత ఆంధ్రప్రదేశ్‌ను కరెంటు కష్టాల నుండి గట్టెక్కించిన మాట వాస్తవం. తెలంగాణ కూడా కరెంటు కష్టాలను కొంతవరకు అధిగమించిన సంగతిని విస్మరించలేం.అయితే రైతాంగ సమస్యలను పూర్తిగా పరిష్కరించడం ఎవరికీ సాధ్యం కాలేదు. వ్యవసాయ రంగమంటే నష్టాలకు,కష్టాలకు నిలయమన్న అభిప్రాయం ప్రబలిపోయింది. పండించే పంటలు చేతికొచ్చే వరకు



గ్యారంటీ లేదు. పంటలకు గిట్టుబాటు ధర లేదు. స్వంత భూములున్న రైతులే అప్పుల ఊబిలో కూరుకుపోతున్న నేపథ్యంలో ఇక కౌలు రైతుల పరిస్థితి చెప్పనక్కరలేదు. 'అమ్మబోతే అడవి కొనబోతే కొరివి' అన్న చందంగా తయారైన పరిస్థితుల్లో రైతాంగం ఇక వ్యవసాయం చేసే స్థితిలో లేదు. ఇప్పటికే హలాలను వదిలేసి, పొలాలను అమ్ముకుని నగరాలకు వలస పోయి, ఏదో ఒక వ్యాపారంతో భద్రంగా జీవిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకుని, కాడెద్దులను వదిలేస్తున్న రైతు కుటుంబాలను చూస్తున్నాం. అనేక ఉపాధి రంగాలు ముందుకు దూసుకు వస్తున్నాయి. అయితే వెన్నెముక లాంటి వ్యవసాయం అంపశయ్య మీద పడితే మిగిలిన రంగాలు మనగలుగునా? ప్రజల క్షుద్బాధను తీర్చే ఆహారం లేకపోతే ఇక మిగిలిన రంగాలు ఆహార సమస్యను తీర్చగలవా? ప్రపంచం సమీప భవిష్యత్తులో ఆహార కొరతను ఎదుర్కొనే అవకాశముంది. యూరప్ దేశాల్లో ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం వలన ఆహార కొరత ఏర్పడింది.ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అయినప్పటికీ భారత్ ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా ఆవిర్భవించింది.భారత్ తలసరి ఆదాయం కొన్ని దేశాలతో పోల్చిచూస్తే చాలాతక్కువనే చెప్పాలి. ఈ పరిస్థితులు మారాలి. ప్రజల తలసరి ఆదాయమే నిజమైన అభివృద్ధికి కొలమానం. వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారి బ్రతుకులు బాగుపడాలి. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా ప్రజలు ఆకలిబాధలు అనుభవిస్తున్నారు. ప్రభుత్వాలిచ్చే సబ్సిడీ ఆహార పదార్థాల కోసం ఎదురు చూస్తున్నారు. పంటలు పండిస్తున్న రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.మార్కెట్లో మాత్రం ఆహారధాన్యాల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఒక దానికొకటి పొంతన లేని పరిస్థితుల మధ్య దగా పడుతూ దిక్కుతోచని రైతులు రుణ మాఫీల కోసం ప్రభుత్వాలను అర్థిస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల మీద, మార్కెట్ మీద ఆధారబడి బ్రతుకీడ్చుతున్న అన్నదాతల విషయంలో ప్రపంచమంతా ఏకం కావాలి. నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ఆహారకొరతను అధిగమించాలి. దేశ వ్యాప్తంగా రైతులకు ఉచిత విద్యుత్ అందించాలి. అన్ని రాజకీయ పార్టీలు ఉచిత విద్యుత్ విషయంలో స్పష్టతనివ్వాలి. రైతులను ఇబ్బంది పెట్టబోమని ప్రస్తుత ప్రభుత్వాలు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి. ప్రతిపక్ష పార్టీలు కూడా రైతు సమస్యల విషయంలో తమ నిర్ణయాలను స్పష్టం చేయాలి. ఉద్యోగుల కిస్తున్న సదుపాయాలను రైతులకు కూడా వర్తింపచేయాలి. రైతుల జీవితాలకు భద్రత కల్పించాలి. మూడెకరాల లోపు వ్యవసాయ భూములు గల రైతులకు పెన్షన్ సదుపాయం కలుగ చేయాలి. వ్యవసాయ రంగం నిలదొక్కుకోవడానికి ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సులను,సూచనలను అమలు చేయాలి. మనదేశంలో అనేక పంటలు పండుతున్నాయి. అయితే పండించిన పంటలకు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇతర రంగాల మాదిరిగా వ్యవసాయం చేసే రైతులకు స్వేచ్ఛ లేదు.ధరలు నిర్ణయించుకునే హక్కులేదు. ఇలాంటి పరిస్థితులు మారాలి. వ్యవసాయం పట్ల మక్కువ చూపే

# పేరొకరిది, పెత్తనం మరొకరిది

కందుకూరి రాకేష్

దాదాపు రెండు దశాబ్దాలుగా స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ, 'మీసాల రాయుళ్ల' పెత్తనం కొనసాగుతూనే ఉండటం ప్రజాస్వామ్యవ్యవస్థకు ఆందోళన కలిగించే విషయం. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో, ఈ రిజర్వేషన్ల ఆంతర్యం నెరవేరుతుందా లేదా అనేది మరోసారి చర్చనీయాంశమైంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి(3) (పంచాయతీలకు) 243టి(3) (మున్సిపాలిటీలకు) మహిళలకు కనీసం మూడింట ఒక వంతు (1/3) స్థానాలను రిజర్వ్ చేయాలని నిర్దేశిస్తున్నాయి. ఈ కనీస నిబంధనను దాటుకొని, తెలంగాణ రాష్ట్రం 2015లో జీహెచ్ఎంసీలో మొదలుపెట్టి,గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏకంగా 50శాతంరిజర్వేషన్లను కల్పించడం ఒక ప్రగతిశీల నిర్ణయం. 2006లోనే బీహార్ ఈచారిత్రక చట్టాన్ని తీసుకొచ్చింది. మహిళలను కేవలం అభ్యర్థులుగా కాకుండా, నిర్ణయాధికారులుగా మార్చే ఉద్దేశంతో ఈ రిజర్వేషన్లు అమలయ్యాయి. కానీ, క్షేత్రస్థాయి వాస్తవాలు వేరేలా ఉన్నాయి. ఒక దశాబ్దం కిందటి వరకు స్థానిక సంస్థల్లో గెలిచిన మహిళా ప్రజాప్రతినిధులు కేవలం 'స్టాంప్ వేసే బొమ్మల' లాగా మారిపోయారు. కార్యాలయ రికార్డులపై సంతకాలు చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యేవారు.అభివృద్ధిపనులు, నిధుల కేటాయింపు,అధికారిక సమావేశాలు అన్నింటా వారి భర్త,కుమారుడు లేదా కుటుంబ సభ్యులే అధికారాన్ని చెలాయించేవారు.ఈ 'మీసాల రాయుళ్లు' అధికారిక కార్యక్రమాలలో ముందు వరుసలో కూర్చుని, సర్పంచ్/ఛైర్‌పర్సన్‌ల తరపున ఆదేశాలు జారీ చేయడం సర్వసాధారణ దృశ్యంగా మారింది. మహిళల ఆత్మగౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను అనేక సందర్భాల్లో అణిచివేసిన ఈ పరిస్థితిని సమాజం చూస్తూనేఉంది. ఇప్పటికీ, 50శాతం రిజర్వేషన్లు అమలులోకి వచ్చినా, ఆ స్థానాల్లో పోటీ చేసే వారిలో అధిక శాతం మంది తమ కుటుంబ సభ్యుల రాజకీయ వారసత్వాన్ని లేదా అధికారాన్ని నిలబెట్టడానికి నిలబడే వారే తప్ప, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే మహిళా నాయకులు ఇంకా తక్కువగానే కనిపిస్తున్నారు.నేటి ఆధునిక, విద్యావంతమైన సమాజంలో ఈ పరిస్థితి మారాలి. మహిళా రిజర్వేషన్ విజయవంతం కావాలంటే, మహిళలు కేవలం కోటాకు పరిమితం కాకుండా,స్వశక్తితో ఎదగాలి. ప్రస్తుత, గత రాజకీయ పరిస్థితులు, స్థానిక పాలన చట్టాలు, ప్రభుత్వ పథకాలు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి.కొన్నింటిలో ఇంటి సభ్యుల సలహాలు తీసుకోవడం సరైందే అయినప్పటికీ, పరిపాలనా పరమైన నిర్ణయాలు, పనుల అమలు విషయంలో స్వతంత్రంగా వ్యవహరించడం అలవర్చుకోవాలి. ఝాన్సీ లక్ష్మీబాయివంటి వనితల నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకొని, భయం లేకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రజాసేవకు కంకణం కట్టుకోవాలి. చివరిగా, రాజకీయాలు కేవలం పురుషులకోసం అనే పాత నమ్మకాన్ని తొలగించే బాధ్యత పౌరులందరిపై ఉంది. మహిళలను రాజకీయాల వైపు ఆకర్షించి, రేపటి భారతదేశ అభివృద్ధిలో వారి పాత్ర కీలకమవ్వడానికి సమాజం

# ప్రజావాక్కు



## హెచ్చరిక గంట

భారతదేశంలోఅత్యంత పెద్దప్రైవేట్ విమానయాన సంస్థగా ఎదిగిన ఇండిగో ఇటీవల ఎదుర్కొంటున్న సంక్షోభం దేశ విమానయాన రంగానికే ఒక హెచ్చరిక గంటగా మారింది.ప్రయాణికుల సంఖ్యపెరుగుతున్న దశలో ఈ సంస్థలో ఏర్పడిన అంతర్గత సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు, సిబ్బంది కొరత, విమానాల నిర్వహణలో జాప్యం వంటి అంశాలు కలిసిఅనేకసేవలపై ప్రభావం చూపుతున్నాయి.ఇటీవలి వారాల్లో అనేక విమానాలు ఆలస్యంగా నడవడం,కొన్నిరద్దుకావడం,ప్రయాణికులుగంటల తరబడి విమానాశ్రయాల్లో ఇరుక్కుపోవడం వంటి ఘటనలు సంభవించాయి.ఇలాంటి పరిస్థితులు ప్రయాణికుల్లో ఆగ్రహాన్ని, అనిశ్చితిని పెంచుతున్నాయి. ముఖ్యంగా పండుగ సీజన్ నేపథ్యంలో ఈ జాప్యాలు మరింత ఇబ్బందులు సృష్టించాయి. ప్రయాణికుల హక్కులను రక్షించేందుకు డీజీసీఏ జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితివచ్చింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ఎన్నికల ఫ్రాడ్

సంక్షేమం అభివృద్ధితో భారత్ వికసిస్తోందని ప్రజలందరు సంతోషపడుతూ సంబరాలు చేసుకుంటున్నారని దేశంలో సమస్యలేవీ లేకుండా చేసామని ఈ కారణంతోనే కేంద్రంలోను అత్యధిక రాష్ట్రాలలోను తమపార్టీ ఎన్నికల్లో గెలుస్తూ అధికారంలోకి వస్తోందని బిజెపి నాయకులు తరచు చెబుతుంటారు.ఆమాటేనిజమైతే అభివృద్ధి, సంక్షేమం, రెండుకళ్లుగా భావించి తమ పాలనలో ఉన్న రాష్ట్రాలను అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చేసి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించినప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు ఎలా ఓడిపోయారు.

- శాస్త్రి, హైదరాబాద్

## చట్టాల్లో రాజకీయ జోక్యం

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలు రాజకీయజోక్యం. అధికారుల జోక్యం వలన నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి. ఎస్సీ ఎస్టీల భూములు, వికలాంగుల భూములు ఆక్రమించిన వారిపై దాడులు, దౌర్జన్యాలు చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద కేసు నమోదు చేయాలి. ఎస్సీ ఎస్టీల, వికలాంగులైనవారి దరఖాస్తుదారులకు న్యాయం జరగడం లేదు. క్షేత్రస్థాయిలో భూములవద్దకు వెళ్లి విచా

## ప్రజల్లో అవగాహన అవసరం

భారతదేశంలో ఇటీవలి సంవత్సరాలలో బస్సు ప్రమాదాలు గణనీయంగాపెరుగుతున్నాయి.ప్రజలరవాణా అవసరాల కోసం బస్సు ప్రయాణాలు పెరగడంవలన రహదారులపై వాహనాల సంఖ్య అధికమవుతోంది. అయితే,సరైన రహదారి ప్రమాణాలు లోపించడం,డ్రైవర్లలోఅవగాహనకొరవడటం, బస్సు నిర్వహణ లోపాలు వంటి కారణాల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అతివేగం, డ్రైవర్ల అలసట, మోతాదు మించిన ప్రయాణికుల రద్దీకూడా ఈ ప్రమాదాలకు దోహదపడుతున్నాయి. ప్రతిరోజూ ఎందరో ప్రయాణికులు బస్సు ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటూ, తమ ప్రియమైనవారిని వదిలిపెట్టి ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రభుత్వాలు బస్సు ప్రమాదాల నివారణ కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. అటు బస్సు కంపెనీలు కూడా సరికొత్త మోడల్ వాహనాలను సురక్షితంగా రవాణా చేసేందుకు ముందుకు వస్తున్నాయి.కానీ, వీటికి అదనంగా ప్రజలలో అవగాహన పెంచాలి.

- డా: సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మన ప్రధానులు ఉన్నారుగా..

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం హైద్రాబాదులో కొన్ని రోడ్లకు నూతనంగా కొత్త పేర్లు పెడతామని వార్త. అందులో రతన్ టాటా ఆమోద యోగ్యమై. భారత్‌కు సుంకాలు తదితర ఆంక్షలు పెడుతున్న ప్రజాదరణకు దూరమయిన అమెరికా అధ్యక్షుడైన డోనాల్డ్‌ట్రంప్ పేరు పెట్టాలనుకోవడం సమంజసం కాదు. మన దేశానికి కీర్తిప్రతిష్టలు తెచ్చిన అనేకమంది ఉండగా ఇతర దేశస్తుల పేర్లు పెట్టడం బాగనిపించటం లేదు. భారత పూర్వ అధ్యక్షులైన రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, నీలం సంజీవరెడ్డి, అబ్దుల్ కలాం ఉన్నారుగా. ప్రస్తుత ప్రధాని, పేరెన్నికగన్న నరేంద్ర మోడీ గారిని కూడా ప్రభుత్వ పట్టికలో తీసుకుంటే బాగుంటుంది.

- ఎస్. విజయ శేషు, కొత్తగూడెం

## సరైన తీర్పు ఇచ్చారు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో బిఆర్‌ఎస్‌కి సత్సంబంధాలు లేవు. తెలంగాణ రాష్ట్రంలో ఆ పార్టీ అదికారంలో లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న బి.ఆర్.ఎస్ ఉప ఎన్నికలో గెలిచినా ప్రయోజనం ఉండేది కాదు. జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి కూడా నిలిచిపోయి ఉండేది. అందుకే జూబ్లీహిల్స్ ప్రజలు బి.ఆర్.ఎస్‌కి ఓటు వేయకుండా తమ విజ్ఞతను ప్రదర్శించారు.

- మిథునం, హైదరాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# సుస్థిర పర్యావరణమే మనకు రక్ష

డా. ఎ. భాగ్యరాజ్

ఇరవైఒకటో శతాబ్దంలో మానవ హక్కుల భావన విస్తరించి, జీవన ప్రమాణం, ఆరోగ్యం, భద్రత, అభివృద్ధి, స్వేచ్ఛలతోపాటు, శుద్ధి,ఆరోగ్యకరమైన, సుస్థిర పర్యావరణం కూడా ఒక మౌలిక మానవ హక్కుగా అంతర్జాతీయ స్థాయిలో అంగీకరించబడింది. పర్యావరణం కేవలం ప్రకృతికి సంబంధించిన అంశం కాదు, అది మనిషి గౌరవంగా జీవించే హక్కుని నిర్వచించే ముఖ్యమైన ఆధారం.వాయు కాలుష్యం నుండి వాతావరణ మార్పులు, నీటి సంక్షోభం నుండిఅటవీ విధ్వంసం వరకూ ప్రతిపర్యావరణ సమస్య మానవ హక్కులను లోతుగా దెబ్బతీస్తోంది. ప్రతి డిసెంబర్ 10న ప్రపంచం మానవ హక్కుల దినోత్సవాన్ని పాటిస్తుంది. ఈ సంవత్సరం థీమ్ 'మన రోజువారీ అవసరాలు' అనే నినాదంతో పనిచేస్తోంది.ఐక్యరాజ్యసమితి 1948లో ప్రకటించిన యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ డిక్లరేషన్ (యూడిహెచ్ఆర్)ప్రపంచ ప్రజలకు సమాన హక్కులను హామీ చేస్తూమానవ నాగరికతను కొత్త దశలోకి నడిపింది. ప్రజల జీవితాలను ప్రభావితం చేసేపర్యావరణ సమస్యలు పెరుగుతున్నకొద్దీ, ప్రజలు పర్యావరణ పరిరక్షణను ఒక న్యాయపరమైన, రాజ్యాంగపరమైన హక్కుగా భావిస్తున్నారు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ సమస్యలు మరింత క్లిష్టంగా మారాయి. అందుకే, మానవ హక్కులు పర్యావరణ సమస్యల మధ్య సంబంధం నేటి సమాజంలో అత్యంత ప్రముఖమైన చర్చగా మారింది. వేగంగా మారుతున్న ప్రపంచ రాజకీయాలు, పెరుగుతున్న అసమానతలు, సాంకేతిక యుగంతెచ్చిన కొత్త ప్రమాదాలు ఇవన్నీ కలిపి మానవ హక్కుల పరిరక్షణను మరింత సవాలుగా మార్చుతున్నాయి. పర్యావరణం ఒక మానవ హక్కు'పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన,స్థిరమైన పర్యావరణం సార్వత్రిక మానవ హక్కు.' ఐక్యరాజ్యసమితి 2022లో స్పష్టం చేసింది. శ్వాసించడానికి శుద్ధమైన గాలి, తాగడానికి సురక్షితమైన నీరు, కాలుష్యం రహిత నేల,జీవ వైవిధ్యం పరిరక్షణ, పర్యావరణ ప్రమాదాల నుండి రక్షణ, వాతావరణ మార్పులకు అనుకూలించే సామర్థ్యం మొదలైనవి ప్రధానమైనది.ఇవే గనుక లేకపోతే, మానవుల అస్తిత్వం, ఆరోగ్యం, జీవనోపాధి అన్నీ ప్రమాదంలో పడతాయి. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 జీవించే హక్కుని హామీ పర్యావరణం జీవించే హక్కులో భాగం"అని పలు తీర్పుల్లో పేర్కొంది. ఉదాహరణకు ఢిల్లీలో వాయుకాలుష్యం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి.ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో కర్మాగార కాలుష్యం వల్ల క్రమంగా కాన్సర్ కేసులు పెరుగుతున్నాయి.2025లో విశాఖ, హైదరాబాద్ వాయు నాణ్యత ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా, కలుషితంగా ఉన్నట్లు కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సి.పి.సి.బి) నివేదికలు చెబుతున్నాయి.భారతదేశంలో 70శాతం




నీటి వనరులు కాలుష్యం గురవుతున్నాయని నీతి ఆయోగ్ హెచ్చరించింది.నీటి కాలుష్యం, అందరికి అందుబాటులోకి లేకపోవడం ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసేలా ప్రభావితం చేస్తోంది. ప్రపంచ దేశాల ఒప్పందాలు,మానవ హక్కులు1972లో స్టాక్హోమ్ డిక్లరేషన్లో పర్యావరణం, మానవ హక్కుల మధ్య సంబంధం, 1992 రియో డిక్లరేషన్లో సుస్థిర అభివృద్ధిని సాధించడం, 2015 పారిస్ క్లైమేట్ ఒప్పందం ప్రకారం ప్రపంచ ఉష్ణోగ్రత నియంత్రణ చేయడం, 2021-2022 ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ ప్రకారం పర్యావరణం మౌలిక హక్కు అని వెల్లడించింది. భారతదేశంలోని అత్యంత వాయు కాలుష్య నగరాల్లో ఢిల్లీ, నోయిడా, గజియాబాద్, హైదరాబాదు, విశాఖపట్నం, నాగ్పూర్ ప్రధానమైన స్థానంలో ఉన్నాయి. చిన్నారుల ఊపిరితిత్తుల అభివృద్ధి దెబ్బతింటోంది, వృద్ధుల ఆరోగ్యం మరింత క్షీణిస్తోంది, పేద వర్గాలపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. యమునా, గంగా, గోదావరి, కృష్ణా నదులు పరిశ్రమల వ్యర్థాలతో తీవ్రమైన కాలుష్యానికి గురవుతున్నాయి. పలు పర్యావరణ సంస్థలు ప్రకారం, మున్సిపల్ మురుగునీరు శుద్ధి లేకుండానే చాలా ప్రాంతాల్లో నదుల్లో కలుస్తోంది. అటవీ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్నారు. వీటి వలన గిరిజన సమాజాలు అత్యంత ప్రభావితమవుతున్నాయి. భూములు కోల్పోవడం, సంస్కృతి, జీవనోపాధి నష్టం, శబ్దకాలుష్యం, భూగర్భ జలాల తగ్గడం జరుగుతోంది.పర్యావరణ సమస్యలు ఎల్లప్పుడూ అసమానతలను పెంచుతాయి. పర్యావరణ ప్రయోజనాలు అందరికి సమానంగా లభించాలి.పర్యావరణ భారాలు ఒకవర్గం మీదపడకూడదు.ఇది సామాజిక న్యాయం పర్యావరణ పరిరక్షణ కలయిక. పర్యావరణ చట్టాలను కఠినంగ అమలు చేయడం, కాలుష్య కారక పరిశ్రమలపై కఠిన జరిమానాలు విధించడం, కచ్చితమైన పర్యావణాన్నిఅంచనా వేయడం, ప్రజల అవగాహన పెంచడం, పాఠశాలల్లో పర్యావరణ విద్య, స్థానిక స్థాయిలో పర్యావరణ కమిటీలు వేయడం, సుస్థిర అభివృద్ధి మోడల్, పునరుత్పాదక విద్యుత్, రసాయన రహిత వ్యవసాయం, జల సంరక్షణ వంటి వాటిపై మరింత పరిశోధన పెరిగి కాలుష్యరహిత, రీసైక్లింగ్ని పెంచాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను పర్యావరణ ప్రాజెక్టులకు వినియోగించడం పెంచాలి. ఇవన్నీకూడా పర్యావరణ పరిరక్షణలో తీసుకోవాల్సిన చర్యలు.పర్యావరణ పరిరక్షణ ప్రకృతిపై ప్రేమ మాత్రమే కాదు మానవ హక్కుల సంరక్షణ కూడా భాగమే. మనిషి ఆరోగ్యం, జీవితం,జీవనోపాధి అన్నీ పర్యావరణంతో బలంగా అనుసంధానమై ఉన్నాయి. పర్యావరణం నాశనం అవుతుంటే, మానవ హక్కులు కూడా కూలిపోతాయి.అందుకే పర్యావరణ పరిరక్షణనుప్రభుత్వాలు, కోర్టులు,సంస్థలు మాత్రమే కాకుండా, ప్రతిపౌరుడు తనబాధ్యతగా తీసుకోవాలి. పర్యావణాన్ని కాపాడుకోవటం, రక్షించడం,బలోపేతం చేయడం పౌరుడిగా ప్రతిఒక్కరిబాధ్యత. సుస్థిర పర్యావరణం లేకుండా, సుస్థిరమానవ హక్కులు అసాధ్యం.ఈనిజాన్ని గుర్తించి, పర్యావరణం మానవ హక్కుల పరిరక్షణ కోసం సమాజం మొత్తంకలిసి ముందుకు రావలసిన సమయం ఇది. కాబట్టి

## ఈసారి భారత్‌పై మరింత
# వేగంగా దాడిచేస్తాం!
## పాక్ సిడిఎఫ్ ఆసిమ్ మునీర్



**ఇస్లామాబాద్, డిసెంబరు 9:** పాకిస్థాన్ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్)గా నియమితులైన ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, బాధ్యతలు చేపట్టిన వెంటనే భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో భారత్ దూకుడుగా వ్యవహరిస్తే, పాకిస్తాన్ స్పందన మరింత వేగంగా, తీవ్రంగా, బలంగా ఉంటుందని స్పష్టం చేశారు. భారత్ ఎలాంటి భ్రమల్లోను ఉండకూడదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గౌరవ వందనం స్వీకరించిన అనంతరం అధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కొత్తగా ఏర్పాటు చేసిన డిఫెన్స్ ఫోర్సెస్ హెడ్‌క్వార్టర్స్ ఒక చారిత్రాత్మక నిర్ణయమని మునీర్ అభివర్ణించారు. ఆర్మీ, వైమానిక, నౌకాదళాల ఏకీకృత వ్యవస్థ ద్వారా బహుళ క్షేత్రాల్లో కార్యకలాపాలను మెరుగుపరచడమే దీని లక్ష్యమని వివరించారు. మారుతున్న, పెరుగుతున్న ముప్పులను ఎదుర్కోవాలంటే త్రివిధ దళాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ హెడ్‌క్వార్టర్స్ త్రివిధ దళాల కార్యకలాపాలను సమన్వయం చేస్తుందని, ఉన్నత స్థాయి నాయకత్వం మధ్య సమన్వయంతో పనిచేస్తూనే ఆయా దళాలు తమ స్వయంప్రతిపత్తిని, సంస్థాగత నిర్మాణాన్ని కొనసాగిస్తాయని తెలిపారు. ఆధునిక యుద్ధ తంత్రం స్వరూపం మారిపోయిందని మునీర్ అన్నారు. యుద్ధాలు ఇప్పుడు సైబర్‌స్పేస్, ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పెక్ట్రమ్, అంతరిక్షం, ఇన్ఫర్మేషన్ ఆపరేషన్స్, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాలకు విస్తరించాయని, వీటికి అనుగుణంగా సాయుధ దళాలు మారాల్సి ఉందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ప్రజలు, సైన్యం చూపిన పోరాటపటిమ భవిష్యత్ ఘర్షణలకు ఒక కేస్ స్టడీ అని ఆయన ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం చేతిలో పాకిస్థాన్ భద్రతా దళాలు భారీ నష్టాలను చవిచూసిన తర్వాత మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా లభించింది. ఆరు దశాబ్దాల తర్వాత ఈ హోదా పొందిన రెండో వ్యక్తిగా ఆయన నిలిచారు. పాకిస్థాన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ (సవరణ) బిల్లులు 2025కు అధ్యక్షుడు జర్దారీ ఆమోదం తెలిపిన తర్వాత ఈ సీడీఎఫ్ పోస్టును సృష్టించారు. ప్రస్తుతం ఆయన ఆర్మీ చీఫ్‌గా తన ఐదేళ్ల పదవీకాలంతో పాటు సీడీఎఫ్ పదవిలోనూ కొనసాగుతారు.

## ప్రయాణికుల మనసు దోచుకున్న ఇండిగో పైలట్!



**కోయంబత్తూరు, డిసెంబరు 9:** దేశవ్యాప్తంగా ఇండిగో విమానాలు భారీగా రద్దవుతూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ, ఆ సంస్థకు చెందిన ఓ పైలట్ చూపిన చొరవ అందరి మనసులను గెలుచుకుంది. విమానంలో ప్రయాణికులకు తమిళంలో క్షమాపణ చెబుతూ ఆయన ఓ వీడియోను పోస్ట్ చేశాడు. ఇండిగో పైలట్ కెప్టెన్ ప్రదీప్ కృష్ణన్ తాను నడుపుతున్న విమానంలో ప్రయాణికుల వద్దకు వచ్చి ఆలస్యానికి క్షమాపణలు తెలిపారు. మీకు కలిగిన అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండి. తదుపరి సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీకు అందిస్తామని ఆయన తమిళంలో వినమ్రంగా చెప్పారు. ఆయన నిజాయతీకి ముగ్ధులైన ప్రయాణికులు చప్పట్లతో అభినందనలు తెలిపారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన కెప్టెన్ ప్రదీప్, ఒక భావోద్వేగపూరిత క్యాప్షన్ కూడా జతచేశారు. నన్ను క్షమించండి. విమానం ఆలస్యం కారణంగా ముఖ్యమైన పనులు కోల్పోతే ఎంత బాధ ఉంటుందో నాకు తెలుసు. మేమేమీ సమ్మె చేయడం లేదు. పైలట్లుగా మేం మా వంతు కృషి చేస్తున్నాం. మేం కూడా మా ఇళ్లకు వెళ్లాలనుకుంటున్నామని పేర్కొన్నారు. కోయంబత్తూర్‌కు వెళ్తున్న తన విమానం కూడా ఆలస్యమైందని, ప్రయాణికులు ఎంతో ఓపికగా సహకరించారని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో విమానాశ్రయాల్లోని తమ గ్రౌండ్ స్టాఫ్‌తో దయతో మెలగాలని ఆయన ప్రయాణికులను కోరారు. ఈ పోస్ట్‌పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

క్లిష్ట సమయంలో పైలట్ చూపిన మానవత్వం, వినయం అభినందనీయమని కామెంట్లు చేస్తున్నారు. కొత్త పైలట్ విశ్రాంతి నిబంధనల కారణంగా సిబ్బంది కొరత ఏర్పడటంతో ఇండిగోలో సంక్షోభం ఏడో రోజుకు చేరింది. సోమవారం 150కి పైగా, ఆదివారం 650కి పైగా విమానాలను సంస్థ రద్దు చేసిన విషయం తెలిసిందే.

## సోనియా గాంధీకి ప్రధానిమోడీ జన్మదిన శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్, సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఈరోజు తన జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోనియా గాంధీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 1946 డిసెంబర్ 9న ఇటలీలో జన్మించిన సోనియా, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారు. రాజీవ్ మరణానంతరం ఆమె భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా అత్యధిక కాలం పనిచేసిన వ్యక్తిగా ఆమె రికార్డు సృష్టించారు. 1998లో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆమె, తన నాయకత్వ పటిమతో పార్టీకి కొత్త ఊపిరి పోశారు. ఆమె సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ వరుసగా రెండుసార్లు (2004, 2009) కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఒకానొక దశలో దేశంలోని 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఆమె విదేశీ మూలాల అంశంపై శరద్ పవార్, పి.ఎ. సంగ్మా వంటి నేతల నుంచి వ్యతిరేకత ఎదురైనప్పటికీ, పార్టీ శ్రేణుల మద్దతుతో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

## కట్టుకున్న భర్తే కాలయముడు
### పోలీసులకు ఫిర్యాదుచేసిన మహిళా కానిస్టేబుల్

**ఫిలిబిత్, డిసెంబరు 9:** ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన వెలుగుచూసింది. కట్టుకున్న భర్తే ఓ మహిళా కానిస్టేబుల్ పాలిట కాలయముడయ్యాడు. అదనపు కట్నం కింద ఎస్‌యూవీ కారు తీసుకురాలేదన్న కారణంతో భర్త, అతడి కుటుంబ సభ్యులు ఏడుగురు కలిసి ఆమెను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేశారు. ఈ క్రమంలో బలవంతంగా శానిటైజర్ తాగించి, లైంగికంగా వేధించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పిలిభిత్‌లో పనిచేస్తున్న 27 ఏళ్ల మహిళా కానిస్టేబుల్‌కు, గౌతమ్ బుద్ధ నగర్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌తో 2023 జనవరి 26న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో బాధితురాలి తండ్రి రూ. 50 లక్షలు ఖర్చు చేసి కారు, నగలతో పాటు ఇతర బహుమతులు ఇచ్చారు. అయినా అత్తింటివారు ఎస్‌యూవీ కారు కోసం వేధించడం మొదలుపెట్టారు. ఈ వేధింపులు శ్రుతిమించడంతో బాధితురాలు ఆదివారం రాత్రి బిసల్‌పూర్ కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త, అత్తమామలు, ఇద్దరు బావలు, వారి భార్యలపై కేసు నమోదు చేయాలని కోరింది. పోలీసులు నిందితులపై వరకట్న వేధింపులు, దాడి సహా పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫిర్యాదులో బాధితురాలు పలు షాకింగ్ విషయాలు వెల్లడించింది. తన భర్త అన్న (బావ) అక్టోబర్ 5న తుపాకీతో బెదిరించి అత్యాచారం చేశాడని, ఈ ఘటనపై ఇప్పటికే మీరట్‌లోని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని పేర్కొంది.



# ఓటు చోరీ కంటే దేశ వ్యతిరేక చర్య వేరేలేదు

### - ఎన్నికల కమిషన్‌ను కేంద్రం కబ్జా చేసింది- ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం చెలాయిస్తోంది : ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపణలు - లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ నేత - ఇవిఎంలు వద్దు, బ్యాలెట్ పేపరే ముద్దు: అఖిలేష్ యాదవ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** 'ఓటు చోరీ' కంటే పెద్ద దేశ వ్యతిరేక చర్య మరొకటి లేదు, 2024 లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బిజెపి, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓటు చోరీకి పాల్పడ్డారని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. లోక్‌సభలో మంగళవారం ఎన్నికల సంస్కరణలపై చర్చను రాహుల్ గాంధీ ప్రారంభిస్తూ బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. రాహుల్‌గాంధీ ఆవేశంతో ఊగిపోతూ, బిజెపి, ఆర్ఎస్ఎస్, ఇసిపై ఆరోపణలు గుప్పించారు. "హర్యానా ఓటర్ల జాబితాలలో ఒక బ్రెజిలియన్ మహిళ 22సార్లు కనిపించింది. మరో మహిళ పేరు 200సార్లు కనిపించింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని పదేపదే చెప్పినప్పటికీ ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదు, తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. లక్షలాది మంది నకిలీ ఓటర్లు ఎందుకు ఉన్నారో ఇసి చెప్పడం లేదు. ఈ ప్రశ్నలకు ఇసి దగ్గర సమాధానాలు లేవు. బీహార్‌లో ఎస్ఐఆర్ తర్వాత 1.2 లక్షల మంది నకిలీ ఓటర్లు ఎందుకు ఉన్నారు? దీన్ని బట్టి చూస్తే, ఇసి-బిజెపి కుమ్మక్కయ్యారని అర్థమవుతోంది. ఇసి ఎలా పూర్తిగా విరుద్ధమైన పనులు చేస్తున్నదో సాక్ష్యాధారాలతో చూపించాను. ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారు? ఆ ప్యానెల్‌లో ఏకైక రాజకీయేతర సభ్యుడు ఆయన. అంటే ప్రధాన న్యాయమూర్తిపై నమ్మకం లేదా?" అంటూ రాహుల్‌గాంధీ ఎన్‌డిఏ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పోలింగ్ తర్వాత 45 రోజులకు సిసి ఫుటేజీ ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఓట్ల చోరీకి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య నాశనం కోసం ఇసిని బీజేపీ వాడుకుంటోందని, పథకం ప్రకారమే ఇసి ఎంపిక ప్యానల్ నుంచి సిజెఐను తొలగించారని వివరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, అతని సహాయకులకు పదవిలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలకు చట్టపరమైన రోగనిరోధకశక్తిని ఇచ్చే చట్టంపై కూడా రాహుల్ బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. చింతించకండి, తాము అధికారంలోకి వచ్చి దానిని తిరిగి మారుస్తాం, మీ దుష్టపన్నాగాన్ని కనుగొంటాం అంటూ ఎన్నికల కమిషన్‌పై పరోక్షంగా హెచ్చరికలు చేశారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రానికి మూడు ప్రశ్నలు వేశారు. ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా? సర్ ప్రక్రియపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో.. ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఇసి నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా? నిజాలు మాట్లాడుతుంటే బిజెపి ఎంపిలు జీర్ణించుకోలేకపోతున్నారు" అని రాహుల్‌గాంధీ మండిపడ్డారు.

**ఆ పని చేసేందుకు ఇసికి చట్టబద్ధమైన హక్కు లేదు: కాంగ్రెస్:** ఎన్నికల సంస్కరణల పై చర్చలో ఎంపి మనీశ్ తివారీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎదురుదాడికి దిగింది. ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేసే హక్కు ఎన్నికల సంఘానికి లేదని మనీశ్ తివారీ వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాత వైఖరి, చట్టబద్ధమైన అధికారాలపై మనీశ్ తివారీ ప్రశ్నలు లేవనెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాత వైఖరిని అవలంభిస్తున్నదా..? అనే విషయంలో చాలామంది సభ్యులు ప్రశ్నలు లేవనెత్తుతుండటం దురదృష్టకరమని అన్నారు.

**ఇవిఎంలు వద్దు... బ్యాలెట్ పేపర్లే ప్రవేశపెట్టండి: అఖిలేష్:** ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఎన్నికల సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఇవిఎంలు ట్యాంపరింగ్‌కు గురవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## భారత్ బియ్యం ఎగుమతులపై ప్రత్యేక సుంకాలు!: ట్రంప్ మరోసారి హెచ్చరిక

**వాషింగ్టన్, డిసెంబరు 9:** భారత్‌తో సహా పలు దేశాల నుంచి దిగుమతి అయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధించవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలు కలకలం రేపుతున్నాయి. భారత్ నుంచి దిగుమతి అవుతున్న బియ్యం, కెనడా నుంచి వస్తున్న ఎరువులపై కొత్తగా సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. వైట్‌హౌస్‌లో అమెరికా రైతులకు 12 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, కెనడాలతో వాణిజ్య చర్చల్లో ఆశించిన పురోగతి లేకపోవడంతో ట్రంప్ ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్ బియ్యం దిగుమతుల వల్ల అమెరికాలోని స్థానిక రైతులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో ఒక రైతు మాట్లాడుతూ అమెరికా రిటైల్ మార్కెట్లో రెండు అతిపెద్ద రైస్ బ్రాండ్లు భారత్ కంపెనీలవేనని చెప్పగా, ట్రంప్ వెంటనే స్పందించారు. సరే, ఆ సంగతి మేం చూస్తాం. సుంకాలు విధిస్తే రెండు నిమిషాల్లో సమస్య పరిష్కారమవుతుందని ఆయన అన్నారు. భారత్ కంపెనీలు తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో డంపింగ్ చేయకూడదని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే కెనడా నుంచి వస్తున్న ఎరువులపైనా కఠిన సుంకాలు విధించి స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని ట్రంప్ తెలిపారు. అమెరికా రైతులను దేశానికి వెన్నెముకగా అభివర్ణించిన ఆయన, వారిని ఆదుకునేందుకే 12 బిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులను ఇతర దేశాలపై విధించిన సుంకాల ద్వారా వచ్చిన ఆదాయంతోనే సమకూరుస్తున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా భారత్అమెరికా మధ్య వ్యవసాయ వాణిజ్యం గణనీయంగా పెరిగింది. భారత్ నుంచి బాస్మతి బియ్యం, సుగంధ ద్రవ్యాలు ఎగుమతి అవుతుండగా, అమెరికా నుంచి బాదం, పత్తి వంటివి దిగుమతి అవుతున్నాయి. అయితే సబ్సిడీలు, మార్కెట్ యాక్సెస్ వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వేదికగా వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, ఈ హెచ్చరికల వల్ల భారత బియ్యం ఎగుమతులపై, ముఖ్యంగా బాస్మతిపై పెద్దగా ప్రభావం ఉండదని, అంతిమంగా ఈ భారం అమెరికా వినియోగదారులపైనే పడుతుందని భారత బియ్యం ఎగుమతిదారులు ధీమాతో ఉన్నారు. ట్రంప్ ప్రకటనలో భారత్‌తో పాటు వియత్నాం, థాయ్‌లాండ్ పేర్లను కూడా ప్రస్తావించారని, ఆ దేశాలు కేవలం నాన్‌బాస్మతి బియ్యాన్ని




మాత్రమే అమెరికాకు ఎగుమతి చేస్తాయని ఆల్ ఇండియా రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అజయ్ భల్లోటియా గుర్తుచేశారు. ట్రంప్ ప్రధానంగా నాన్‌బాస్మతి బియ్యం గురించే మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ నుంచి సుమారు 2.74 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతి కాగా, నాన్‌బాస్మతి బియ్యం ఎగుమతులు కేవలం 61 వేల టన్నులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే భారత బియ్యంపై అమెరికాలో 40 శాతం వరకు సుంకం ఉందని, అయినా ఎగుమతులు తగ్గలేదని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ తెలిపింది.

## ఉద్యోగులు, పెన్షనర్లకు 8వ వేతన సంఘం వల్ల ఎంతోమేలు
### పార్లమెంటుకు తెలియజేసిన ఆర్థిక మంత్రి



**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటువల్ల దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి పైగా ఉద్యోగులు, దాదాపు 69 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారని పార్లమెంటుకు తెలియజేసింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 8వ వేతన సంఘం అమలు ఎప్పటి నుంచి ఉంటుంది, దాని విధివిధానాలు, 2026-27 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు వంటి అంశాలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, పే కమిషన్ అమలు తేదీని ప్రభుత్వమే నిర్ణయిస్తుందని తెలిపారు. వేతన సంఘం ఏర్పాటైన నాటి నుంచి 18 నెలల్లోగా తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వేతన సంఘం సిఫార్సులను పరిశీలించి, ఆమోదించిన తర్వాత వాటి అమలుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని పంకజ్ చౌధరి హామీ ఇచ్చారు. ఆమోదించిన సిఫార్సుల అమలుకు ప్రభుత్వం తగినన్ని నిధులను అందుబాటులో ఉంచుతుంది. సిఫార్సుల రూపకల్పనకు సంబంధించిన పద్ధతులు, విధివిధానాలను కమిషనే రూపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని అధికారికంగా ఏర్పాటు చేసినట్లు, దాని విధివిధానాలను కూడా ఖరారు చేసినట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు, ఇతర సేవా నిబంధనలకు సంబంధించిన అన్ని అంశాలను ఈ కమిషన్ పరిశీలించి, సిఫార్సులు చేస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది. ఈ తాజా ప్రకటనతో ఉద్యోగులు, పెన్షనర్లలో నెలకొన్న పలు సందేహాలకు తెరపడినట్లయింది.

## ఇకపై ఇంట్లోనుంచే ఆధార్‌తో అన్నీ!




**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** ఆధార్ కార్డు వినియోగదారులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆధార్ కార్డులోని వివరాలను సవరించుకోవడానికి ఇకపై సేవా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంట్లో నుంచే మార్పులు చేసుకునేందుకు వీలుగా ఒక కొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీతో పనిచేసే ఈ యాప్ ద్వారా కీలకమైన వివరాలను సులభంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ కొత్త యాప్‌లో మొబైల్ నంబర్‌ను మార్చుకునే సదుపాయాన్ని యూఐడీఏఐ లైవ్ చేసింది. వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, ఫేస్ అథెంటికేషన్ ద్వారా తమ గుర్తింపును ధ్రువీకరించుకోవాలి. ఆ తర్వాత రూ. 75 ఫీజు చెల్లించి కొత్త మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ కోసం రిక్వెస్ట్ పంపవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సుమారు 30 రోజుల్లోగా కొత్త నంబర్ ఆధార్‌తో లింక్ అవుతుంది. ప్రభుత్వ పథకాల నుంచి బ్యాంకు సేవల వరకు ఆధార్ కార్డు అత్యంత కీలకమైన గుర్తింపు పత్రంగా మారింది. అందుకే అందులోని పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్ వంటి వివరాలు కచ్చితంగా ఉండటం తప్పనిసరి. యూఐడీఏఐ ఈ కొత్త యాప్‌ను తీసుకొచ్చింది.

## నటుడు విజయ్ సభలో తుపాకీ కలకలం




**పుదుచ్చేరి, డిసెంబరు 9:** పుదుచ్చేరిలో నటుడు విజయ్ పార్టీ ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) బహిరంగ సభ వద్ద కలకలం రేగింది. సభా ప్రాంగణంలోకి తుపాకీతో ప్రవేశించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతడిని పార్టీ శివగంగై జిల్లా కార్యదర్శి ప్రభుకు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న డేవిడ్‌గా గుర్తించారు. ఈ ఘటనతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషాదం తర్వాత విజయ్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ ఇదే కావడంతో పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్స్‌పో గ్రౌండ్‌లో జరుగుతున్న

ఈ సభకు పార్టీ అభ్యర్థన మేరకు కేవలం 5,000 మందిని మాత్రమే అనుమతించినట్లు సీనియర్ ఎస్పీ ఆర్. కలైవానన్ తెలిపారు.

## సంక్షిప్తంగా..

### మద్యం కొనుగోళ్లలో విదేశీయులకు సౌదీ సడలింపులు



**దుబాయి, డిసెంబరు 9:** సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల పరంగా దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి, ఇప్పుడు ప్రీమియం రెసిడెన్సీ హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ నిపుణులను, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోంది.

### ఆస్ట్రేలియాలో మైనర్లకు సోషల్‌మీడియా బ్యాన్



**కాన్‌బెర్రా, డిసెంబరు 9:** దేశంలో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్‌మీడియా వినియోగించకుడా ఆస్ట్రేలియా ప్రభుత్వం విధించిన ఆంక్షలు బుధవారంనుంచి అమలులోకి వచ్చాయి. ఈ సంస్కరణ ద్వారా పిల్లలకు వారి బాల్యం పోకుండా చూడచ్చని, తల్లిదండ్రులకు మరింత భరోసా ఇవ్వవచ్చని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ అన్నారు. 2024 నవంబర్‌లో పార్లమెంట్ ఆమోదించిన చట్టాల ప్రకారం, 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఖాతాలు కలిగి ఉండకుండా నిరోధించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టిక్‌టాక్, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్ సహా మొత్తం 10 ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ చట్టంలోని కీలక అంశం ఏమిటంటే, నిషేధాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా సోషల్ మీడియా సంస్థలదే. ఒకవేళ పిల్లలు నిబంధనలు ఉల్లంఘించినా, వారికి గానీ వారి తల్లిదండ్రులకు గానీ ఎలాంటి శిక్షలు ఉండవు.

### మహారాష్ట్రలో రూ.192 కోట్ల డ్రగ్స్ సీజ్



**ముంబై, డిసెంబరు 9:** మహారాష్ట్రలోని వార్ధాలో మెఫెడ్రిన్ డ్రగ్స్ తయారు చేస్తున్న కేంద్రాన్ని డిఆర్ఐ అధికారులు గుర్తించారు. పక్కా సమాచారంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు డిసెంబర్ 7-8 తేదీలలో 'ఆపరేషన్ హింటర్‌ల్యాండ్ బ్రూ' పేరుతో సోదాలు నిర్వహించినట్లు అధికారులు మంగళవారంనాడొక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రూ.192 కోట్ల విలువైన 128 కిలోల మెఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాంతోపాటు 245 కిలోల రసాయనాలు, ముడిపదార్థం, యంత్రాలు సీజ్ చేశారు. నిర్దిష్ట నిఘా సమాచారంతోనే డిఆర్ఐ అధికారులు వార్ధా నుంచి దాదాపు 60 కి.మీ. దూరంలోని మెఫెడ్రిన్ పరిశ్రమను గుర్తించినట్లు అధికారులు వివరించారు.

### మధ్యప్రదేశ్‌లో కుప్పకూలిన శిక్షణ విమానం



**శివాని(ఎంపి), డిసెంబరు 9:** మధ్యప్రదేశ్ లోని సివనీలో ఓ శిక్షణ విమానం నేల కూలింది. ల్యాండయ్యే క్రమంలో హైటెన్షన్ విద్యుత్ తీగలకు తాకడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పైలట్‌తోపాటు మరొకరికి గాయాలయ్యాయి. విమానం తాకడంతో విద్యుత్ వైర్లు తెగిపడి సుమారు 90 గ్రామాల్లో అంధకారం నెలకొంది. వివరాల్లోకి వెళితే రెడ్‌బర్డ్ ఏవియేషన్ సంస్థకు చెందిన ఓ శిక్షణ విమానం సుక్తరా ఎయిర్ స్ట్రిప్ లో ల్యాండయ్యే క్రమంలో ప్రమాదానికి గురైంది. రన్ వేకు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని ఆమ్గావ్ గ్రామంలో 33కేవీ హైటెన్షన్ తీగలను తాకి నేలకూలింది. ఈ ప్రమాదంలో పైలట్ అజిత్ ఛావ్డాతో పాటు మరొకరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. విమానం పడిపోవడం గమనించిన గ్రామస్థులు, విద్యుత్ సిబ్బంది సాయంతో పైలట్ ను రక్షించారు.



పాత్రికేయ సంఘాల నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

# హైపర్ కమిటీ త్వరలో నియమిస్తాం

## హోం మంత్రి వంగలపూడి అనిత

విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: జర్నలిస్టులపై దాడుల నివారణకు వీలుగా రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పాత్రికేయ సంఘాలకు హామీ ఇచ్చారు. సచివాలయంలో డిసెంబర్ 9వ తేదీ హోం మంత్రిని కలిసిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులుతో పాటుగా ఆ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిమి శ్రీ, ఎంబీనాథన్, ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఆనంద్, చిన్న పత్రికల సంఘం నాయకులు హుస్సేన్ ఖాన్ జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీ, జిల్లా స్థాయిలో దాడుల నివారణ కమిటీలను నియమించాలని అందుకు వీలుగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే కమిటీ నియామకంపై తగిన చర్యలు తీసుకోవాలని ఓఎస్‌డి అనిల్ కుమార్‌కి ఆదేశం ఇచ్చారు.

## సర్వీస్ ఉపాధ్యాయులకు

# టెట్ పరీక్షలేల?

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: డిఎస్‌సి ద్వారా ఎంపికై ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షల ముడిపెట్టడం దారుణమని యుటిఎఫ్ ధ్వజమెత్తింది. శ్రీకాళహస్తి తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కార్యదర్శి విజయశ్రీ సారథ్యంలో ఆందోళనా కార్యక్రమాలను చేపట్టారు. డియస్‌సి ద్వారా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలను నిర్వహించాలనుకోవటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూపిటిషన్ వేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేసారు. సుప్రీం కోర్టు తీర్పు కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష మంది సర్వీసు ఉపాధ్యాయుల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లా కోశాధికారి మోహన్‌బాబు, హేమంబరధర రావు, వెంకటకృష్ణయ్య, సూర్యప్రకాష్, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, దక్షిణామూర్తి, శివకుమార్, దీపిక, మునెయ్య, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

## పొలంబడిపై అవగాహన

తొట్టంబేడు, డిసెంబరు 9 ప్రభాతవార్త: రైతులు ప్రభుత్వం అందిస్తున్న వెసులుబాట్లను సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పిలుపు నిచ్చారు. పొలం బడి కార్యక్రమంలో ఏవో సురేంద్ర రెడ్డి సారథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని దాన్ని ఎలా నివారించాలో అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ కుమార్, అయకట్టు ఛైర్మన్ దావులూరు శేఖర్ నాయుడు, ఈ సురేష్, ఏ రాజగోపాల్, ఎం మనోజ్,, పొల్లమ్మ, ఇలాగనూరు రైతులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఉచిత కంటి వైద్యశిబిరం

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఎగువవీధిలో అంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సారథ్యంలో మంగళవారం తిరుపతిలోని అగర్వాల్ మెడికల్ ఆసుపత్రి సారథ్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి రీజినల్ మేనేజర్ పి.ప్రకాశ్ రత్నబాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ శిబిరంలో 80 మందికి వైద్యపరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమాలు ఎగువవీధి బ్రాంచి మేనేజర్ ఎస్ బాలనరసింహం పర్యవేక్షించారు.

## ఆర్‌టిసికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలోని ఎర్రబస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లును ఓ దాత అందించారు. ప్రయాణీకుల భద్రత దృష్ట్యా శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన తిరపతిలో డిబిఆర్, ఎస్‌కె కార్పొరేట్ ఆసుపత్రిల నిర్వాహకులు ప్రయాణీకుల భద్రత దృష్ట్యా శ్రీకాళహస్తి డిపోలో ఉన్న 108 బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రేవతి మాట్లాడుతూ డిబిఆర్ ఆసుపత్రి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ చక్రవర్తి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో మంగళవారం మాజీ ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే నిరుపేదలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు దామోదర్‌రెడ్డితో పాటు సురేంద్రరెడ్డి, రాహుల్, గోపాల్‌రావు, నవీన్, నాగరాజు, మహేష్, సాయి, సారథి, బాబు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంలో సేవలు మెరుగుపడాలి

- నిరక్ష్య ధోరణి సరికాదు... జవాబుదారీతనం పెరగాలి
- పాడేరు వైద్య కళాశాలకు 100 ఎంబిబియస్ సీట్లు మంజూరు
- పిడుగురాళ్ల, మరో 4 కళాశాలల్లో ప్రవేశాలకు సిద్ధం కావాలి
- వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజా వైద్య రంగంలో సేవలు విస్తృతంగా జరగాలని ఏపీ హెల్త్ మినిస్టర్ సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 18 నెలలు పూర్తయిన సందర్భంగా వైద్యారోగ్య శాఖ పనితీరు, ఫలితాలపై మంత్రి సుదీర్ఘంగా 3గంటల పాటు సమీక్షించారు. 10మంది విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ప్రజారోగ్య రంగంలో గత ఏడాదిన్నర కాలంలో కొంత మేరకు మార్పు తీసుకురాగలిగామని, చేయాల్సింది ఇంకా చాలా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. లక్ష మందికి పైగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బందిలో బాధ్యతతో కూడిన విధుల నిర్వహణ, జవాబుదారీతనాలను పెంచి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని, దీనికి విభాగాధిపతులే బాధ్యత వహించాలని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చర్యలతో ఈ ఏడాదిన్నర కాలంలో సిబ్బంది హాజరు, ఓపీ మరియు ఐపీ సేవలు, రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ మెరుగుపడి, సేవల నాణ్యత పెరగడంతో స్పష్టమైన మార్పును తేగలిగామని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షల మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉందని మంత్రి అన్నారు. ఈ లక్ష్య సాధనకు వివిధ స్థాయిల్లో అధికారులు, వైద్యులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ హితవు పలికారు. కూటమి ప్రభుత్వం సాధించిన మార్పు నేపథ్యంలో ఇటీవలి కాలంలో కొందరు ప్రభుత్వ వైద్యుల నిరక్ష్య ధోరణులపై వచ్చిన వార్తల పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. పాడేరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి (2026-27) పూర్తి స్థాయిలో 100 ఎంబిబియస్ ప్రవేశాలకు ముందస్తుగానే జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) అనుమతించిందని సమీక్ష సందర్భంగా మంత్రి వెల్లడించారు. పిడుగురాళ్లలో కేంద్ర ప్రాయోజిత పథకం (సియస్‌యస్) కింద చేపట్టిన వైద్య కళాశాలల్లో 2026-27లో ఎంబిబియస్ ప్రవేశాలు కల్పించేందుకు తగుచర్యల్ని చేపట్టాలని మంత్రి డిఎంఇని ఆదేశించారు. ఆ మేరకు అవసరమైన సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పనను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం పిపిపి పద్ధతిలో చేపడుతున్న ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల వైద్య కళాశాలల్లో 2026-27లో ఎంబిబియస్ ప్రవేశాలకు అవసరమైన చర్యల్ని ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని మంత్రి డిఎంఇ అధికారులను ఆదేశించారు.



### ప్రతి పనికీ లెక్క ఉండాలి

ఇప్పటి వరకు ఏమి చేశామో, ఇకముందు ఏమి సాధించాలో అన్న అంశాల పట్ల కొలమానం ఉండాలని, ఫలితాలను నిర్దిష్టంగా బేరీజు వేసుకోవాలని, అప్పుడే అనుకున్న మార్పును సాధించగలమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు వివరించారు. నిర్దిష్టంగా కొలవలేని ఏ అంశంలో కూడా మార్పును తేలేమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా స్థాయి అధికారులైన డిఎంహెచ్‌ఓలు, డిసి హెచ్‌యస్‌ల పనితీరును మంత్రి ఆక్షేపించారు. తమ బాధ్యతలు, వాటి నిర్వహణపట్ల అవగాహన లేనట్లు వీరు వ్యవహరిస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌ను మంత్రి ఆదేశించారు. ప్రాథమిక, సెకండరీ, బోధానాసుపత్రుల సూపరింటెండెంట్ల పనితీరు కూడా బాగా మెరుగుపడాలని, వీరి పనితీరును ఆయా విభాగాధిపతులు నిరంతరం సమీక్షించి ప్రణాళికా బద్ధంగా సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలందించాలని మంత్రి స్పష్టం చేశారు. జీజీహెచ్‌ల సూపరింటెండెంట్లు, అడ్మినిస్ట్రేటర్ల మధ్య సమన్వయ లోపం ఉండకూడదన్నారు

### స్క్రబ్ టైఫస్‌పై చర్చ

వివిధ జిల్లాల్లో బయటపడుతున్న స్క్రబ్ టైఫస్ గురించి మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరంగా ఆరా తీశారు. ఈ విషయంలో ఎటువంటి ప్రయత్న లోపం ఉండకూడదని, ఈ సమస్య గురించి ప్రజల్లో నివారణ మరియు చికిత్సా మార్గాల పట్ల సమగ్ర అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి సూచనలు వెల్లడై దాని నిర్ధారణ జరగడానికి సమయం పడుతున్నందున, వ్యాధి సూచనలు కనిపించిన వెంటనే డాక్సీ సైక్లిన్ మందు వాడడం ద్వారా దానిని అరికట్టవచ్చని ఒక అభిప్రాయం సమీక్షలో వ్యక్తమైంది. ఈ విషయానికి సంబంధించి నిపుణులతో సమగ్రంగా చర్చించి తగు ప్రతిపాదనలను ప్రభుత్వ పరిశీలన కోసం అందజేయాలని మంత్రి సూచించారు. అయితే, 12 ఏళ్ల లోపువారికి ఈ మందు వాడరాదని డిఎంఇ తెలిపారు. మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్, ఎపిఎంఎస్‌డిసి ఎండి గిరీషా, డియస్‌హెచ్ చక్రధర్ బాబు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సిఇఓ దినేష్ కుమార్, ఏపిశాక్స్ పిడి నీలకంఠారెడ్డి, డిఎంఇ డాక్టర్ రఘునందన్, డిహెచ్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# 66వేల సంతకాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ఇందుకు నిదర్శనం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 66వేల సంతకాలు సేకరించామని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. ప్రతి పేదవాడు మెడిసిన్ చదవాలని తమ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలకు శ్రీకారం చుడితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పెత్తందారులకు కట్టబెట్టడానికి ప్రయత్నించటం దారుణమన్నారు. కళాశాలలకు చంద్రబాబు బిడ్డల పేర్లు పెట్టుకోమనండి అంతేకాని పెద వారి చదువులకు చరమ గీతం పాడవద్దన్నారు. దేవస్థానం మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, పఠాన్ ఫరీద్‌ఖాన్, షేక్ సిరాజ్‌బాషా, కోగిల సుబ్రమణ్యం, ఉత్తరాజి శరవణ్ కుమార్, కంఠా ఉదయ్ కుమార్ బుల్లెట్ జయశ్యాంరాయల్, సాగిరాబీ, సుమతి, హరినాయుడు, పులి రామచంద్రయ్య, చంద్ర, పసల కృష్ణయ్య, మునికృష్ణారెడ్డి, జుంలేషా, రవిబాబు, అస్లాం, నారాయణ, చెంగల్‌రాయులు, జివికే రెడ్డి, షరీఫ్, సాధిక్ మహాదేవ, సాయి, యుగంధర్, దినేష్, వాసు సురేష్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు






తిరుపతి, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుపతి నుండి మహారాష్ట్ర షిర్డీకి సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమైంది. ఈ రైలును మంగళవారం ఉదయం తిరుపతి రైల్వేస్టేషన్‌లో రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణచక్రవర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, రాష్ట్రపచ్చదనం సుందరీకరణ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, విజయవాడ ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి ఎంవిఆర్ వివేకానందరెడ్డి, తిరుపతి రైల్వే మేనేజన్ సత్యనారాయణ కలసి జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి నుండి షిర్డీకి వెళ్ళే ప్రయాణీకులు, యాత్రికుల సౌలభ్యం కోసం ఈ రైలు నడపడం శుభపరిణా మమన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రత్యక్ష అనుసంధానమైన రైలును నడపడం యాత్రికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కాగా ఈ రైలు ప్రారంభోత్సవంలో కేంద్ర రైల్వే శాఖ సహాయమంత్రి వి,సోమన్న, రాజ్యసభ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు.

# సక్రమమైన వ్యాపారాలు చేసుకోండి

## - షాపింగ్ కాంప్లెక్స్‌లో బోర్డు సభ్యురాలు అనుగోలు రంగశ్రీ



తిరుమల, డిసెంబరు 9 ప్రభాత వార్త ప్రతినిధి: యాత్రికులకు సేవలందించేందుకు టిటిడి ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు నడుపుకుంటున్న వాళ్ళు సక్రమంగా వ్యాపారాలు చేసుకోవాలని బోర్డు సభ్యురాలు అనుగోలు రంగశ్రీ తెలిపారు. మంగళవారం సాయంత్రం షాపింగ్ కాంప్లెక్స్‌లో రెవెన్యూ అధికారులతో కలసి షాపులను తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్స్‌లు, లైసెన్స్‌ల మేరకు వ్యాపారం సాగిస్తున్నారా, హాకర్ లైసెన్స్‌తోనా, సక్రమంగా వ్యాపారాలు ఉన్నాయని తనిఖీ చేశారు.




# ఓబిసి రిజర్వేషన్ల కోసం 15న పార్లమెంటు ముట్టడి

విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త: ఈనెల 15,16 తేదీలలో ఢిల్లీలో జరుగు మహా ధర్నా, పార్లమెంటు ముట్టడి పోరాట కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని, అన్ని ఓబీసీ సంఘాల నాయకులకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలుచట్టసభలలో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించే బిల్లులను ఉభయ పాలకప్రతిపక్ష జాతీయ కూటములు ఈ శీతాకాల సమావేశాలలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా చట్టాలు చేయాలని, ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం "హాలో బిసి... చలో ఢిల్లీ" గోడపత్రికను పలువురు బీసీ నాయకులతో కలసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు పరిమితి అసంబద్ధమైనదని, దాన్ని అధిగమించేందుకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈనెల 15న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నాతో పాటు పార్లమెంటు ముట్టడి కార్యక్రమం, ఆపై 16న ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్ చట్టసవరణ చేసి ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని డిమాండ్ చేస్తూ, విజ్ఞాపన పత్రాలను ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలకు, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతోపాటు పార్లమెంటు సభ్యులందరికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వర రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివరాం బాబాజీ, రాష్ట్ర కార్యదర్శి కోలా అశోక్, రాష్ట్ర నాయకులు మేకా వెంకటేశ్వరరావు, వాకా వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా నాయకులు జన్జనం వరప్రసాద్, ఆలా శివాజీ, ధనుంజయరావు, అడపా శ్రీనివాసరావు, సైదా పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# కరాటేకప్ పోటీల్లో విజయవాణి విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: తిరుపతిలో నిర్వహింన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన విజయవాణి టెక్నోస్కూల్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను విజేతల య్యారు. రాష్ట్ర స్థాయిలో తల్లిదండ్రులు, పాఠశాల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం పేరు ప్రతిష్టలను ఇనుమడింప జేసారని కరస్పాండెంట్ ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆ విద్యార్థులను సత్కరించారు. పాఠశాలలో 3వ తరగతి చదివే హితిక, తొమ్మిదవ తరగతి చదివే ఎం.చంద్రమౌళి అత్యుత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారని వివరించారు. చిన్నారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యయులకు అభినందించారు. చిన్నారులు రాబోవు రోజుల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

# బాడీ బిల్డర్ జావిద్‌బాషాకు ఘనసన్మానం

## జమీయత్ ఉలమ నిర్వహణ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి చెందిన బాడీ బిల్డర్ జావిద్ బాషాను మంగళవారం తిరుపతి జమీయత్ ఉలమ సారథ్యంలో సన్మానం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ముఫ్తి నయిం సాహెబ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జావిద్ ఇటీవల జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతగా బంగారు పతకాన్ని సాధించారు. ఆతని ప్రతిభకు సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో నెల్లూరు జిల్లాకు చెందిన మౌలాన ఇలియాస్ సాహెబ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు లాలు, ముస్లిం నాయకులు మీర్జాన్ సాహెబ్ దివ్య ఖుర్‌ఆన్ హాఫీజ్ రేహాన్ సాహెబ్, మౌలాన అంజద్ సాహెబ్, హాఫీజే ఖుర్ ఆన్ అషరఫ్ అలి ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# వైభవంగా ఏడు గంగమ్మలకు సారె!

## ఇంటింటా పసుపు నీళ్ళు సమర్పణ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం ఐదు గంటలకు అంగరంగ వైభవంగా సారె బహూకరణ నిర్వహించారు. శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఆయన సతీమణి కోలా విశాలాక్షి, ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్ దంపతులు, ఇఓ డి.బాపిరెడ్డి హాజరు కాగా ఏర్పాట్లను ఆలయాధికారులు పర్యవేక్షించారు. ఆలయ ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్స్ పూజలు నిర్వహించారు. ఆలయ పౌరోహితులు అర్థగిరి స్వామి వేద మంత్రాలు పఠిస్తుండగా శాస్త్రోక్తంగా సారె ఊరేగింపు ప్రారంభించారు. శివయ్య గోపురం నుంచి రాజగోపురం ద్వారా తేరువీధిలోకి ప్రవేశించింది. సారె తీసుకెళుతున్న అతిధుల కాళ్ళకు ఇంటింటా భక్తులు పసుపు నీళ్ళను సమర్పించారు. ఓ వైపు భక్తులు మొక్కులు తీర్చుకుంటుండగా భక్తి శ్రద్ధలతో అతిధులు సారెను ఆయా గంగమ్మలను సమర్పించుకుంటూ ముత్యాలమ్మగుడి వీధిలోని ఏడు గంగమ్మలు నిల్చు స్థలంలో సారెను సమర్పించారు. అక్కడ అతిధితులకు కాసరం రమేష్ సారథ్యంలో స్వాగతం పలికారు. సారెకు ముందు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా డిఎస్పీ నరసింహామూర్తి, సిఐ ప్రకాష్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, దండి రాఘవయ్య, పగడాల మురళి, కౌసల్య పాల్గొన్నారు. ఆలయాధికారులు ఇఓ డి.బాపిరెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ తదితరులు పర్యవేక్షించారు.

# డప్పుల మోతతో దద్దరిల్లిన శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ఏడు గంగమ్మల జాతర దేవస్థానం పాలకమండలి, జారత కమిటి నిర్వాహకుల సమన్వయంతో వైభవంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్‌ల పిలుపుతో మంగళవారం మధ్యాహ్నం జాతర పిలుపు అన్నట్లు ఒక్కసారిగా వంద డప్పులు మోగుతుండగా కళాకారులు ఆడుతూ పాడుతూ సాగగా చూడటానికి వేయి కళ్లు చాలవన్నట్లు మారింది. ఊరేగింపును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. పెండ్లి మండపం గంగమ్మ కమిటి నిర్వాహకులు కాసరం రమేష్, బేరివారి మండపం నిర్వాహకులు వజ్రం కిషోర్ సారథ్యంలో మండపాలను విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. కాగా పెండ్లి మండపం వద్ద కాషాయ రంగుల జెండాలతో రిబ్బన్లతో ముస్తాబు చేసారు. నాలుగుమాడ వీధుల్లో విద్యుత్ దీపాల కాంతితో దేదీప్యమానంగా మారింది. కాగా ఊరంతా దేవస్థానం అరటి చెట్లతో ముస్తాబు చేసారు. అలాగే గంగమ్మకు ఇష్టమైన వేపాకు తోరణాలతో ముస్తాబు చేసారు. ఇక జాతర కమిటిల నిర్వాహకులు ఎవరికి వారు ప్రత్యేకతను చాటుకొనుటకు పోటీలు పడ్డారు. దాంతో జాతరకు ప్రత్యేకత సంతరించుకుంది.

# నూతన కౌంటర్లను పరిశీలించిన ఇఓ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నూతనంగా నిర్మిస్తున్న కౌంటర్లను మంగళవారం ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి పరిశీలించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్నిసేవలను ఆన్‌లైన్‌లో పొందు పరచటమే కాకుండా ఆలయం నాలుగు గోడల మధ్య ఎలాంటి కౌంటర్లు ఉండకూడదనే లక్ష్యంతో రూ.1.3కోట్లతో ఆలయ ప్రహారీ గోడల పక్కనే ఒకటవ గోపురం, రెండవ గోపురం మధ్య వివిధ సేవలతో పాటు రాహుకేతుదోష నివారణ టిక్కెట్లును అందించేందుకు 8 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇఓ బాపిరెడ్డి మాట్లాడుతూ భక్తులు నిరీక్షించకుండా సత్వర దర్శనం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త కౌంటర్లలో రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లుతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనం, అంతరాలయ దర్శనం టిక్కెట్లు జారీ చేయబడుతుందని ఇఓ తెలిపారు.

# వందరోజుల ప్రణాళికను అమలు చేయాలి!

తొట్టంబేడు, డిసెంబరు 9 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో నూరు శాతం ఫలితాల సాధనకు వంద రోజుల ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని ఎంఎఓ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు పిలుపు నిచ్చారు. సమగ్ర శిక్ష తిరుపతి జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సారథ్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందరోజుల ప్రణాళిక కార్యక్రమం పాఠశాలలో అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని నూరు రోజుల ప్రణాళికను క్రమశిక్షణతో పాటిస్తే వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తారనటంలో ఎలాంటి సందేహం లేదన్నారు. మండల విద్యాశాఖాధికారి బాలయ్య, సమగ్ర శిక్ష ఎపిఓ డాక్టర్ సుధాకర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి అనితకు దుర్గమ్మ ప్రసాదం అందిస్తున్న దృశ్యం

# భవానీ దీక్షల ఏర్పాట్లు పరిశీలించిన హోంమంత్రి

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 9 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుండి 15 వరకు జరగబోయే శ్రీ భవానీ దీక్షల విరమణలకోసం జరుగుతున్న ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం పరిశీలించారు. లడ్డూ ప్రసాదం పోటును, అన్నదాన కేంద్రం, హోమగుండాలు, కేశఖండనశాల తదితర ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూంలో అదికారులతో సమీక్ష, సమావేశం నిర్వహించి పలు ఆదేశాలిచ్చారు. ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి, అన్ని శాఖల అధికారులతో సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ పలు సూచనలందించి భవానీ దీక్షల విరమణలకు సమన్వయంతో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసి దీక్షల విరమణలు విజయవంతం చేయాలన్నారు.

### ఆర్‌జెసి పరిశీలన

శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల విరమణల కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఆర్‌జెసి వెంద్ర త్రినాథ రావ్‌కు మంగళవారం పరిశీలించారు. లడ్డూ ప్రసాదం పోటును, అన్నదాన కేంద్రం, హోమగుండాలు, కేశఖండన శాల తదితర ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనకు ఇఓ, ఛైర్మన్‌లు ఏర్పాట్ల వివరాలు తెలిపారు.

# వాడపల్లి వెంకన్న ఆలయ ట్రస్ట్‌బోర్డు నియామకం

విజయవాడ (గన్నవరం), డిసెంబరు 9 ప్రభాతవార్త: కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి 17మంది పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమించింది. ముదునూరి వెంకటరాజు, చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి, కాసా ఛాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరావు, సారెల్ల సరిత, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యన్నారాయణ, తమ్మన సాయిప్రసాద్, ఎల్లమిల్లి చంద్రకుమారి, కొండపల్లి రామచంద్రరావు, శిష్టా సూర్యకుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మీ, గోసాల అప్పలనరసలను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరు రెండేళ్ళపాటు పదవిలో ఉంటారని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా పాలకమండలి సభ్యులు 17మందిలో తొమ్మిది మంది మహిళలకు చోటు కల్పించారు.

# వైఫల్యాలతో.. ఆయన వెళ్తున్నారు

- భక్తుల సౌకర్యాల కల్పనలో విఫలం
- ప్రధానాలయంలో ఎస్ పిఎఫ్ వివాదాస్పద ధోరణి
- స్పెషల్ ఆఫీసర్స్ వల్లే కార్తీకం గట్టు

అన్నవరం, డిసెంబర్ 9,(ప్రభాత వార్త). ఆయన రెవెన్యూ శాఖకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి. దేవాదాయ శాఖపై ఎటువంటి అవగాహన లేదు. ఎందుకు వేసారో.. ఎలా వేసారో...? ప్రముఖ ఆలయాలలో తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత స్థానం కలిగిన అన్నవరం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా వీర్ల సుబ్బారావు ని గత ఏడాది డిసెంబర్ నెలలో నియమించారు. నాటి నుండీ అన్నవరం దేవస్థానం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈఓకు సిబ్బందితో కూడా సఖ్యత లేదు. పరిపాలనలో పట్టు లేదు. ఆలయం వ్యవహారాలలో అవగాహన లేమి. అభివృద్ధి శూన్యం. భక్తులకు దర్శనం సంత ప్తినిస్తే రేటింగ్ అదే పెరుగుతుంది సుదూర ప్రాంతాలనుండి సంతృప్తికరమైన దర్శనాన్ని ఎక్కువగా ఊహించుకుని వచ్చే భక్తులకు ఇక్కడ ఆదియాసే ఎదురవుతుంది. సత్యదేవుని దర్శనం కొరకు గంటల తరబడి క్యూలైన్లలో వేచి, వేచి చూస్తే తీరా ప్రధానాలయం చేరుకుంటే కొన్ని క్షణాలపాటే స్వామి దర్శనం. దీనికి తోడు ప్రధానాలయం లోపలికి ప్రవేశించి ఎస్ పి ఎఫ్ పోలీసులు (స్పెషల్ ప్రొటెక్షన్



ఫోర్స్) ఆదవారి ఒంటిమీద చెయ్యి వేసి ముందుకు జరగమంటూ నెట్టేస్తున్నారు. దీనిపై అనేకమార్లు ఈఓకు ఫిర్యాదులు వెళ్ళినా పట్టించుకోలేదని, ఆలయంలో సంత ప్తికరమైన దర్శనం జరగడం లేదని భక్తులు తెలియజేస్తున్నారు. రాష్ట్రం లోని ప్రముఖ దేవాలయాలలో ఎస్ పి ఎఫ్ సిబ్బంది ప్రధానాలయాల గడప బయట గస్తీకే పరిమితమవుతారు. ఇక్కడ మాత్రమే 'అతి' చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. రద్దీ కొంచెం ఎక్కువైతే చాలు స్వామి వారి పాదభాగమైన యంత్రాలయ దర్శనం నిలిపివేస్తున్నారు. విషయ? పంచాయతనమైన ఈ దర్శనానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ కూడా భక్తులకు అసంత ప్తే ఎదురౌతుంది. ఎంతో ప్రయాసపడి వచ్చిన భక్తులకు కనీసం సరైన దర్శనభాగ్యం అధికారులు కల్పించలేక పోతున్నారని భక్తుల అభిప్రాయం.ఐవీఆర్ఎస్ రేటింగ్ కూడా ప్రధానంగా దీనివల్లే తగ్గుతుందంటున్నారు. వ్రత కథ పార్ట్ కట్ లో భక్తుల రద్దీ ఎక్కువైతే సత్యదేవుని వ్రతాల నిర్వహణ కూడా తూతూమంత్రమే. 5 అధ్యాయాలు కలిగిన వ్రతకథ వ్రత పురోహితులు కుదించి చెప్పడం, వ్రతం చివర అధ్యాయానికి ఒకటి చొప్పున ఐదు కొబ్బరికాయలు కొట్టించాలి. దానికి విరుద్ధంగా వ్రతం ముగించాక, బయట కొట్టుకోమని వ్రత పురోహితులు చెప్పడం, దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. రేటింగ్ స్థాయి దీనిపై ప్రభావం చూపుతోంది. స్వామివారికి జరిగే వైదిక కార్యక్రమాలలో సైతం ఇఓ కుటుంబం జోక్యం చేసుకోవడంతో ఆచార వ్యవహారాలలో "అత్యుత్సాహం"చూపుతుందంటున్నారు కొందరు అర్చకులు.ఆలయపాలనలో సైతం ఇతరుల జోక్యం అధికమవుతుందన్న విమర్శలున్నాయి.

**ప్రత్యేక అధికారుల వల్లే కార్తీకం గట్టు**

కార్తీకమాసం గట్టెక్కడానికి ప్రధాన కారణం దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ముందుచూపుతో నియమించిన ప్రత్యేక అధికారుల ఘనతనే చెప్పాలి. ప్రత్యేక అధికారులుగా నిషా?తులైన వాడపల్లి ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు, తలుపులమ్మ తల్లి ఆలయ ఈఓ విశ్వనాధరాజుతోపాటు , ఆర్జేసీ వేండ్ర త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబులను నియమించడంతో వీరంతా రేయింబవళ్ళు కష్టించి, సత్యదేవుని తెప్పోత్సవంతో పాటు గిరిప్రదక్షిణ, కార్తీకమాసం ఏర్పాట్లు విజయవంతంగా చేపట్టి కార్తీకాన్ని గట్టెక్కించారు. సత్రం గదులు సామాన్యులకు 'అందని ద్రాక్షగా' మారాయి. రద్దీ సమయాలలో భక్తులు దేవస్థానం సత్రం గదులభోగం పొట్టు పడలేక వేలాది రూపాయలు పోసి ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయిస్తున్నారు. కొట్లాది రూపాయలు విరాళాలు కలిగిన స్వామి వారి నిత్యాన్నదాన విభాగంలో కూడా ఆహారపదార్థాలలో రుచి, శుచి కొరవడుతుందనే చెప్పాలి. ఆలయ పరిసర ప్రాంతాలతోపాటు,సత్రం గదులలో శానిటేషన్ అధ్వాన్నంగా ఉంటుందని సత్రం గదులలో దిండ్లు, బెడ్ షీట్స్ అపరిశుభ్రంగా ఉంటున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇఓగా వీర్ల సుబ్బారావు బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలో దేవస్థానంలో ఎటువంటి అభివృద్ధి జరుగకపోవడంతో పాటు దేవాలయాలలో భక్తులకు అందే సౌకర్యాలపై అభిప్రాయ సేకరణకు నిర్వహించే ఐవీఆర్ సర్వేలో సైతం చిన్న దేవస్థానాలు ముందంజలో ఉండగా అన్నవరం దేవస్థానం మాత్రం 6వ స్థానానికి పడిపోవడంతో వీర్ల సుబ్బారావు బదిలీ అనివార్యమైంది.

## ఎట్టకేలకు వాడపల్లి దేవస్థానంనకు ట్రస్ట్ బోర్డు నియామకం...

### 15 మంది సభ్యులతో ఉత్తర్వులు జారీ



ఆత్రేయపురం, డిసెంబర్, 09,(ప్రభాత వార్త ) ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానం కార్యవర్గ సభ్యులుగా 15 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ) చైర్మన్ గా, కార్యవర్గ సభ్యులుగా చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి, కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెద్మాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరెళ్ళ సరిత, ఏఱ్ఱగుంట విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి, కొండపల్లి రామచంద్రరావు, శిష్లా సూర్య కుటుంబరావు, దళిపర్తి శ్రీలక్ష్మి, గోసాల అప్పలనరస, ఎక్స్ అఫీసియో సభ్యులు వాడపల్లి సుందర శేషవతారం నియమితులయ్యారు.ఉన్నారు. వీరు రెండు సంవత్సరాలు పదవిలో ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## మహిళ రైతు సంఘాల లీడర్ల శిక్షణ



ప్రత్తిపాడు, డిసెంబర్ 9, (ప్రభాతవార్త). స్థానిక మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళా రైతు సంఘాల లీడర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డిపిఎం రాయ్, డిపిఎం భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఎఫ్ పి ఓ బోర్డు ఆఫ్ డైరెక్టర్ ల ఎంపిక సమావేశాన్ని నిర్వహించారు. బోర్డు డైరెక్టర్ లు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఈ కార్యక్రమంలో ఏపిఎం గిడిజాల శ్రీనివాస్, సిసి లు, ఎం యస్ ఓ బీ లు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసంతో సాధించాలి



యు.కొత్తపల్లి, డిసెంబర్ 9 (ప్రభాతవార్త): వికలత్వం జయించడానికి ఆత్మ విశ్వాసంతో సాధించాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఉప్పాడ ఎంపీపీ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా కేకును కోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ హెలెన్ కెల్లర్, స్టీఫెన్ హాకింగ్, థామస్ అల్వా ఎడిసన్ లాంటి ఎందరో మహనుభావులు దివ్యాంగులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా అందించే సౌకర్యాలు, ఉపకరణాలు, భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక విద్య ను తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి – 2 పైడిరాజు, ఉమ్మిడి జాన్, గంటా విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు



నిడదవోలు, డిసెంబర్ 9(ప్రభాతవార్త):జిల్లాలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్ హెచ్చరించారు. మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిజ్రాలు ఫంక్షన్ హాల్స్ వద్దకు వెళ్లి అధిక డబ్బును డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రానున్న పండుగల సీజన్లో కోడిపందాలు పేకాట గుంజాయిక్రయం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా నిర్వహించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలాగే ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు హెల్మెట్ లేకుండా లైసెన్స్ లేకుండా మద్యం త్రాగి ద్విచక్ర వాహనాలు నడిపినా మైనర్లు వాహనాలు నడిపినా వారి పైన వారి తల్లిదండ్రుల పైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ సిఐలు ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో కుల వివక్షత లేదు : విద్యాశాఖ అధికారి వేణుగోపాల్



యు.కొత్తపల్లి, డిసెంబర్ 9 (ప్రభాతవార్త): పాఠశాలలో కుల వివక్షత లేదని, ఇద్దరు 8వ తరగతి విద్యార్థుల మధ్య నవంబర్ 28న జరిగిన చిన్న ఘర్షణ దురదృష్టకర సంఘటనగా మారిందని మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఎండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల విద్యార్థుల మధ్య కుల వ్యవస్థ చూపుతున్నారని పాఠశాల వద్ద ఈ నెల 1న కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించిన ఘటనపై మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దారు చిన్నారావు, ఎస్సై వెంకటేష్ లు పాఠశాలలో ఎస్ఎంసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ కుల వివక్ష ఆరోపణలపై పాఠశాలలో నిర్వహించిన విచారణలో వివక్ష లేదని తేలిందన్నారు. అయినా ఘటనకు సంబంధించి ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులను ఇప్పటికే బదిలీ చేయడం కూడా జరిగిందన్నారు. ఘర్షణ పడిన ఒక వర్గం విద్యార్థులు మండలంలో ఇంటికి పంపించి తల్లిదండ్రులు తీసుకు రావలసిందిగా ప్రధానోపాధ్యాయుడు కోరడంతో, విద్యార్థులు చెప్పిన విధానంలో తల్లిదండ్రులు మనోభావాలు దెబ్బతినడంతో సమస్య పెద్దదిగా మారిందన్నారు. జరిగిన ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేయడంతో ఘర్షణ వాతావరణం రాకుండా ఉపాధ్యాయులను బదిలీ చేసిన స్థానంలో నూతన ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. పిల్లల మధ్య జరిగిన వివాదాన్ని పరిష్కరించే క్రమంలో జరిగిన ఈ సంఘటనలో కుల వివక్ష లేదని తమ విచారణలో స్పష్టమైందని తెలియజేసారు.

## దొంగ నోట్లు హల్ చల్...?



రామచంద్రపురం,డిసెంబర్ 9(ప్రభాతవార్త): పట్టణంలో రూ.500 నకిలీ నోట్లు జోరుగా చలామణి అవుతున్నట్లు తెలుస్తుంది. సోమవారం స్థానిక రాజగోపాల్ సెంటర్ లో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు ఒక వ్యక్తి పెట్రోల్ కొట్టించుకోవడానికి కారులో వచ్చాడు. రూ.2,500 లు పెట్రోల్ కొట్టించుకుని డబ్బులు చెల్లించగా అందులో రూ.వెయ్యి నకిలీ నోట్లు గా సిబ్బంది గుర్తించారు. వెంటనే అతన్ని ప్రశ్నిస్తున్న సమయంలో అతను ఇచ్చిన నకిలీ నోట్లు వెనక్కి తీసుకొని ఒరిజినల్ నోట్లు ఇచ్చి వెంటనే కార్ వేసుకొని వేగంగా అక్కడనుండి వేగంగా వెళ్లిపోయినట్లు బంక్ సిబ్బంది తెలిపారు. కొంతకాలంగా నకిలీ నోట్లు వస్తూనే ఉన్నాయని పెట్రోల్ బంక్ సిబ్బంది తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని బంక్ సిబ్బంది కోరుతున్నారు. స్థానిక వ్యాపారులు, ప్రజలు కూడా నకిలీ నోట్లపై అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

## 11న మాదిగల ఆత్మీయ కలయిక : వదంతులు నమ్మవద్దు....

ఎంఎల్సీ బొమ్మి ఇజ్రాయెల్.



అమలాపురం,డిసెంబర్9,(ప్రభాతవార్త) ఈనెల11వ తేది అమలాపురం కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరగబోవు మాదిగల ఆత్మీయ కలయిక యధావిధిగా జరుగుతుందని కార్యక్రమం వాయిదా పడిందని వచ్చే తప్పుడు సమాచారంలను నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ తెలియజేశారు. మాదిగల పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని పార్టీల మాదిగల నాయకులతో ఈ సమావేశం జరుగుతుందని ఈ కార్యక్రమానికి మాదిగ సోదరులు సోదరీమణులు, అక్క చెల్లెలు, ఆడపడుచులు అందరు తరలిరావాలన్నారు. ఈనెల 11వ తేదీ అమలాపురం కొంకాపల్లి శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ కలయికకు పార్టీలకు అతీతంగా, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి భారీ ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసి మాదిగల ఐక్యతకు నిరూపించుకొని ఉద్యోగ రాజకీయంగా,సామాజికంగా మాదిగ జాతి ఎదుగుదలకు అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రవీంద్ర , మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబు, మెరుగుపల్లి మోహన్ రావు, ఆకుమర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



సీతానగరం, డిసెంబర్ 09, (ప్రభాతవార్త): మండలంలోని చినకొండేపూడి ఎంపీపీ మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కోసం సొసైటీ చైర్మన్ కాండ్రు శేఖర్ రూ.5 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని మంగళవారం అందజేశారు. అదేవిధంగా రిటైర్డ్ పీఎస్‌హెచ్ఎం బి. భాస్కరరావు పాఠశాలకు ఒక మైక్రోఫోన్‌ను విరాళంగా ఇచ్చారు. కాండ్రు శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వామి నాయక్, , వడ్డమాని యేసురాజు, కోటారి త్రిమూర్తుల రాజు, కాండ్రు బుల్లియ్య, మండపాటి జగపతి రాజు, పాఠశాల హెచ్ఎం మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు అందిస్తున్న పోషకాహార భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రౌతులపూడి, డిసెంబర్ 9( ప్రభాతవార్త): ప్రతి నెల 9వ తేదీన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ లో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పోస్ట్రాహార భోజనాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు. దాతల సహాయంతో అందిస్తున్న ఈ భోజన సౌకర్యాన్ని ఈ నెల నుండి కత్తిపూడిలో ఉన్న శ్రీ రాజా వత్సవాయి బుచ్చి సీతయమ్మ మహారాణి బహదూర్ వారి ధర్మ సత్రం అందించడం జరుగుతుందన్నారు. అప్పట్లో బాటసారులకు అన్నదానం కోసం భూములను ధారాదత్తం చేసిన మహాదేయురాలు బుచ్చి సీతయమ్మ మహారాణి అన్నారు. అన్నపూర్ణ దేవిగా పేరుగాంచిన ఆమె ఆశయాన్ని నెరవేరుస్తూ శంకవరం పిఠాపురం హెచ్సిపిరో, రౌతులపూడి సిహెచ్సిపి హాస్పటల్లో గర్భిణీ స్త్రీలకు అన్నదాన సౌకర్యం కల్పించాలని నిర్ణయించామన్నారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. వైద్యసేవల పై ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు పొందాలని గర్భిణీ స్త్రీలకు సూచించారు. సురక్షిత ప్రసవం పొంది ఆరోగ్యంగా ఉండాలని ఆమె ఆకాంక్ష వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎండీఓ జి. శివరామ ప్రసాద్, తహసీల్దార్ ఎస్ వి నరేష్, హాస్పటల్ ప్రధాన వైద్యాధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, వైద్యులు సౌజని, సౌమ్య, అజయ్,ఉమాదేవి, సత్రం ఈవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గర్భిణులకు పోషక విలువలు గల ఆహారం స్వీకరించాలి : ఎమ్మెల్యే సత్యప్రభ



శంకవరం, డిసెంబర్ 09 (ప్రభాతవార్త) : గర్భిణులు పోషక విలువలు గల ఆహారం స్వీకరించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా 9వ తేదీన గర్భిణీ స్త్రీలకు రాజా వత్సవాయి బుచ్చి సీతయమ్మ సత్రం ద్వారా భోజన సదుపాయం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గర్భిణులస్త్రీల ఆరోగ్య భద్రత, సుఖ ప్రసవం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో వైద్య బృందం ద్వారా వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు, హై రిస్క్ కేసుల గుర్తింపు, అవసరమైన వైద్య సలహాలు ఈ సందర్భంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మహిళల భద్రత, ఆరోగ్యం, ప్రసవానంతర సంరక్షణ మా ప్రభుత్వ ముఖ్య లక్ష్యం అన్నారు. గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్య శాఖ వారి సూచనలు పాటిస్తూ ఆరోగ్యం ఉండాలని సూచించారు. ముందుగా ఆస్పత్రులలో గర్భిణులు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ , ఆత్మ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం బద్ది రామారావు,టీడీపి సీనియర్ నేత పర్వత సురేష్ డాక్టర్ రాజీవ్ వైద్య సిబ్బంది,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి సుభాష్ ఆర్థిక సాయం



అమలాపురం,డిసెంబర్9, ప్రభాతవార్త అంగవైకల్యంతో పాటు మానసిక స్థితి సక్రమంగా లేని ఒక బాలికకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా ద ృక్పథంతో రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం రంగాపురం గ్రామంకు చెందిన యనమదల పార్వతి కుమార్తె యనమదల సబిత గౌరీ (12) అంగవైకల్యంతో పాటు, మానసిక స్థితి సక్రమంగా లేదు.ఆ బాలిక ఆరోగ్య పరిస్థితి,కుటుంబ ఆర్థిక పరిస్థితిని మంత్రి సుభాష్ దృష్టికి స్థానిక నాయకులు తీసుకు వచ్చారు.ఆ బాలిక దయనీయ స్థితిని చూసి చలించిన మంత్రి సుభాష్ తక్షణ సహాయంగా రూ. 15 వేలు చెక్కును అందించారు. అలాగే సబిత గౌరీ కు మెరుగైన వైద్యం అందేలా సహకరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బాలిక సమస్య పట్ల వెంటనే స్పందించి సహాయం చేసిన మంత్రి సుభాష్ మానవత్వానికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన పూర్వ విద్యార్థులు



కాకినాడ రూరల్, డిసెంబర్ 9(ప్రభాతవార్త)నీ ఇంద్రపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ వారు రూపొందించిన స్టడీ మెటీరియల్ ను పాఠశాల పూర్వ విద్యార్థులు అందించారు. మంగళవారం పాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పి. గిరిధర్ గోపాల్ అధ్యక్షత వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మేడిశెట్టి రామ్మోహన్, చింతపల్లి ఉదయభాస్కర్ , అనకాపల్లి గణపతి రావు, బొంతు లీలా కృష్ణ, పలివెల వీరబాబు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు . విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా, ఉపాధ్యాయుల సలహా మేరకు అధ్యయనం చేస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొండపల్లి భాను, కాకి అయ్యారావు, జేజాల శ్రీనివాస్ , యల్లబోయిన వీరభద్రం లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి లో మహిళా సమస్యలపై అవగాహన



గండేపల్లి డిసెంబర్ 9(ప్రభాతవార్త): గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో మహిళలపై డిజిటల్ హింస, రోజువారీ జీవితంలో డిజిటల్ హింస జరిగినప్పుడు సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై అవగాహన సెషన్ నిర్వహించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవిశంకర్ వివిధ యాప్‌ల డిజిటల్ ట్రాకింగ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని బాలికలకు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్వతంత్ర ఆసుపత్రి లాపరోస్కోపిక్ సర్జన్,జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోత్స్న డిజిటల్ హింస ఎలా జరుగుతుంది, ఇది సంభవించినప్పుడు సమస్యను ఎలా ఎదుర్కోవాలి,మహిళలు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న డిజిటల్ హింసను నివారించడానికి తీసుకోవలసిన నివారణ చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సమన్వయకర్త బి. రేణుక సాయి శ్రీ, డాక్టర్ ఎన్.దివ్య,డాక్టర్ పి వినీల ఇతర మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

## అంగ రంగ వైభవంగా మల్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం.





ఆత్రేయపురం, డిసెంబర్, 09,(ప్రభాత వార్త ) : గ్రామ దేవత శ్రీ మల్లమ్మ అమ్మవారి 11వ వార్షిక మహోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి.ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి భాస్కర్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం లక్ష చామంతి పువ్వులతో పూజ, ప్రత్యేక హోమాలు ఘనంగా జరిపారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. పరిసర ప్రాంతాలనుండి వేలాది గా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం..




ఆత్రేయపురం,డిసెంబర్, 09,(ప్రభాత వార్త ) విద్యాశాఖ అధికారులు 1%2 వర ప్రసాదరావు, ఏ. సత్యనారాయణ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి డా.సలీం బాషా,మండల అభివృద్ధి అధికారి బి.కె.ఎస్.ఎస్.వి రామన్, సమగ్ర శిక్ష, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ రాంబాబు,వాడపల్లి దేవస్థాన పాలక మండలి చైర్మన్ ముదునూరి వెంకట రాజు (గబ్బర్ సింగ్) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు విభిన్న ప్రతిభ కలిగి ఉంటారని, వారిలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహించాలన్నారు. దివ్యాంగులకు పోస్టికాహారం, వ్యక్తిగత పరిశు భ్రత ఉండేటట్లు తల్లిదండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్యంలో మందబుద్ధి కలిగిన వారు జీవితంలో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగిన దృష్టాంతాలను వివరించారు. తల్లిదండ్రులు ప్రేమతో, ఓర్పుతో బిడ్డలను పెంచే విధానం అదుతేమని తమ బిడ్డలు ఎందులోనూ తీసిపోరని ఆశావహ దృక్పథంతో ఉండడం సమాజానికి ఇస్తున్న మంచి సంకేతం అని అన్నారు. ఐ.ఈ.ఆర్. జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణ విభిన్న ప్రతిభావంతుల అవసరాల నిమిత్తం ప్రభుత్వం నుండి అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ.ఆర్.టి.లు అరుణ, జానకి, ఉపాధ్యాయులు ఎస్.వి.వి.ఎస్.ఎస్. ప్రసాద్, సురేష్, ఆఫీసు సిబ్బంది రాంబాబు, ప్రశాంతి, సి.ఆర్.ఎం.టి లు రాజేంద్ర, ఆళ్వారావు, సుధాకర్, జాన్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణంపై ధర్మవరం పంచాయతీ వద్ద గ్రామస్తులు హిందూ సంఘాలు ఆందోళన..

**ఇళ్ల మధ్యలో చర్చి నిర్మాణం నిలుపుదల చేయాలని డిమాండ్..**

ప్రత్తిపాడు, డిసెంబర్ 09, (ప్రభాత వార్త) : ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఇళ్ల మధ్యన చర్చి నిర్మాణం చేపడుతుండడంపై కాలనీవాసులు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి పక్కన హైస్కూల్ కి వెళ్లే దారిలో జగనన్న కాలనీ వద్ద చేపట్టిన చర్చ్ నిర్మాణ పనులను



నిలిపివేయాలని మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు.జగనన్న కాలనీలో స్థలం కొనుగోలు చేసిన రాజమండ్రి కి చెందిన పాస్టర్ చర్చి నిర్మాణ పనులను చేస్తున్నట్లు హిందూ సంఘం సభ్యులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. కాలనీ వాసులతో కలిసి హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ కర్రి ధర్మరాజు, మండల అధ్యక్షుడు రెడ్డి శేఖర్, హిందూ సంఘ సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన దిగారు. పంచాయతీ అనుమతి లేకుండా చర్చి నిర్మాణం ఎలా జరుగుతుందని కార్యదర్శిని ప్రశ్నించారు. కార్యదర్శి పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన హిందూ సంఘాలు, కాలనీవాసులు పంచాయతీ అధికారులను కార్యాలయంలో పెట్టి తలుపులు వేశారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సచివాలయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందివ్వడంతో సంఘటన స్థలానికి ఎస్సై లక్ష్మీకాంతం చేరుకుని ఆందోళనకారులను వారించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు,



అధికారులకు వీడియో తీస్తున్న వ్యక్తి నుండి ఎస్సై ఫోన్ లాక్కోవడంతో గందరగోళం నెలకొంది. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావుకు సమాచారం చేరడంతో ఆయన ఇరు వర్గాల మధ్య సర్దుబాటు చేశారు. అనుమతి లేకుండా చర్చి నిర్మాణం చేపడు తుంటే చర్యలు తీసుకుంటామని అధికారులు ఆందోళనకారులకు తెలిపారు.

# గోదావరి డెల్టాకు పూర్వవైభవం

## జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు

సచివాలయం, డిసెంబరు 9 ప్రభాతవార్త: గోదావరి డెల్టా ముంపు సమస్యల పరిష్కరించడంతోపాటు, ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, దీనికోసం డెల్టా ప్రాంతంలో లైడార్ సర్వే కోసం రూ.13.4కోట్లు మంజూరు చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో గోదావరి డెల్టా ఆధునీకరణ పనులపై సంబంధిత ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ డిసెంబర్‌కు గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య,లాకులు,గేట్ల మరమ్మత్తులకు సమగ్ర డిపిఆర్ తయారు చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. గత ప్రభుత్వంలో నిధులు ఉన్నా కూడా కాల్వలు, డ్రైన్లలో మట్టి తీయకపోగా, లాకులు షట్టర్లకు కనీసం గ్రీజు పెట్టడానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. ఇప్పటికే ధవళేశ్వరం బ్యారేజికి కొత్త గేట్లను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.150 కోట్లు మంజూరు చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, గోదావరి డెల్టా సిస్టమ్ సిఈ, ఎస్ఈ, ఈఈలు, ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.




# మున్సిపల్ కార్మికుల జీతాల బకాయిలు త్వరలో చెల్లింపు

విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల జీతాల బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ మంత్రి పి నారాయణ హామీ ఇచ్చారు. అమరావతిలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో మంత్రిని, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమా మహేశ్వరరావు కలిసి ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత 3 నుంచి 4 నెలలుగా మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గూడూరు, బేతంచర్ల, నాయుడు పేట మున్సిపాల్టీల్లో 4 నెలలుగా, ధర్మవరంలో 3 నెలలుగా జీతాల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా వైఎస్ఆర్ కడప, హిందూపురం, పుట్టపర్తి, తాడేపల్లిగూడెం, తణుకు, సూళ్లూరుపేట మున్సిపాల్టీల్లో నవంబరు నెల జీతాలు నేటికీ చెల్లించలేదని మంత్రికి వివరించారు. జులై సమ్మె కాలం జీతం చెల్లింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిల్లలకు ఉద్యోగాలు, రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, సంక్షేమ పథకాలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలన్నింటి పరిష్కరిస్తామని, వారి ప్రయోజనాలను పరిరక్షిస్తామని మంత్రి నారాయణ హామీనిచ్చారు.

# వెబ్‌సైట్‌లో లైబ్రరీ, సమాచార సైన్స్ పరీక్ష హాల్ టిక్కెట్లు

విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: గంథాలయ, సమాచార సైన్స్ (సిఎల్ఎస్‌సి) పరీక్ష హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. అభ్యర్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 20 వరకు జరగనున్న ఈ పరీక్ష గుంటూరు, కడప కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తామని వెల్లడించారు.

# 11న విజయవాడలో బిసి మహా సదస్సు

## భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్

విజయవాడ, డిసెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజకీయ భవిష్యత్తును, బీసీల తలరాతను మార్చే చారిత్రాత్మక ఏపీ బీసీ మహా సదస్సు చర్చకు సర్వం సిద్ధమైందని భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ప్రకటించారు. డిసెంబర్ 11న విజయవాడలో జరగనున్న ఈ సదస్సు, బీసీల హక్కుల సాధనలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యాలను, లక్ష్యాలను వివరిస్తూ ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మహా సదస్సు ఏ ఒక్క పార్టీకో, ఏ ఒక్క వర్గానికో సంబంధించింది కాదని, ఇది యావత్ ఆంధ్రప్రదేశ్‌లోని బీసీలందరిదీ అని రామచంద్ర యాదవ్ స్పష్టం చేశారు. అందుకే, రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులకు, బీసీల పట్ల చిత్తశుద్ధి ఉన్న నాయకులకు, బీసీ సంఘాలు, కుల సంఘాల నాయకులకు, మేధావులకు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు రాజకీయాలకు అతీతంగా ఆహ్వానించామని ఆయన తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# స్క్రబ్ టైఫస్‌పై అధ్యయనానికి వైద్యనిపుణులతో టాస్క్‌ఫోర్స్

- అపరిశుభ్రతే అసలు జబ్బు... ప్రజల్లో చైతన్యం పెంచాలి
- ప్రభుత్వ చర్యలతో 48 శాతం తగ్గిన అంటువ్యాధులు
- డెంగ్యూ 56 శాతం, మలేరియా 11 శాతం, చికున్ గున్యా 46 శాతం తగ్గుదల
- సీజనల్ వ్యాధులను పూర్తిగా కట్టడి చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: స్క్రబ్ టైఫస్‌పై అధ్యయనం చేసేందుకు, భవిష్యత్‌లో దీన్ని పూర్తిగా నివారించేందుకు జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ తీవ్రత, దాని బారిన పడినవారికి అందుతోన్న వైద్య సాయంపై సమీక్ష చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,592 మంది స్క్రబ్ టైఫస్ బారిన పడ్డారని సీఎంకు అధికారులు వివరించారు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ వ్యాధి కారణంగానే ప్రాణాలు పోతున్నట్లు ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని చెప్పారు. చనిపోయిన 9 కేసుల్లోనూ కాజ్ ఆఫ్ డెత్‌పై పరిశీలన జరిపామని... స్క్రబ్ టైఫస్ వల్లనే చనిపోయారని ఎక్కడా నిర్ధారణ కాలేదని అధికారులు వివరించారు. ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆ 9 మంది చనిపోయినట్లు అధికారులు సీఎంకు తెలియజేశారు. ప్రజలు స్క్రబ్ టైఫస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని... వ్యాధి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో స్క్రబ్ టైఫస్ ప్రభావం ఉందని... ఈ వ్యాధికి సంబంధించిన కేసుల్లో ఏపీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. తమిళనాడు, ఒడిస్సాలలో 7 వేలు చొప్పున కేసులు ఉన్నాయని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్‌ను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ టాస్క్ ఫోర్స్ క్షేత్రస్థాయిలో పర్యటన ద్వారా ఇచ్చే నివేదికను అమలు చేయడంతో వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### 48శాతం తగ్గిన సీజనల్ వ్యాధులు

సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది కాలంగా తీసుకున్న ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులు 48 శాతం మేర తగ్గినట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో 5,555 డెంగ్యూ కేసులు రాగా... ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 2,452 కేసులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ మేరకు డెంగ్యూ కేసులు 56 శాతం తగ్గాయని తెలిపారు. గత ఏడాది 7,871 మంది మలేరియా బారినపడగా... ఈ ఏడాది 7,010కి మలేరియా సోకిందన్నారు. మలేరియా కేసుల్లో 11 శాతం తగ్గుదల కనిపించదని వివరించారు. చికున్ గున్యా గత ఏడాది 266 కేసులు రాగా... ఈ ఏడాది 142 వచ్చాయని, చికున్ గున్యా కేసులు 46.5 శాతం తగ్గినట్లు అధికారులు వివరించారు. జపనీస్ ఎన్సెఫాలిటిస్ కేసులు 11 నుంచి 2కు తగ్గినట్లు తెలిపారు. పరిశుభ్రత పెంపు, సీజనల్ వ్యాధులపై నిరంతర ప్రచారం, విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ముందు జాగ్రత్తలు కారణంగా సీజనల్ వ్యాధులు 48 శాతం మేరకు తగ్గినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

### అపరిశుభ్రతే అసలు జబ్బు.... ప్రజల్లో చైతన్యం పెంచాలి

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులను సున్నా స్థాయికి తీసుకురావాలన్నారు. అంతా కలిసి పనిచేస్తే ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చని సీఎం తెలిపారు. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశుభ్రతే అని, దీన్ని మార్చగలిగితే అనేక వ్యాధులను దూరం చేయవచ్చని సీఎం అన్నారు. అనేక వ్యాధులకు కారణమైన అపరిశుభ్రతను దూరం చేయాలని, ప్రజల్లో నిరంతరం చైతన్యం నింపాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల నివారణకు మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ గిరీశా పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటలో రూ.84 కోట్ల నిధులతో మంచినీటి పైపులైన్ల విస్తరణ

## - ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట, డిసెంబరు 9 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణంలో రూ.84 కోట్ల నిధులతో మంచినీటి పైపులైన్ల విస్తరణ పనులకు శ్రీకారం చుడుతూ అమృత్ 2.0 అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్)తో చేపడుతున్న ప్రాజెక్టు అమలుకు శ్రీకారం చుడుతూ సోమవారం ఇంజనీరింగ్ అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కూటమి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హెడ్ వాటర్‌వర్క్స్‌లో సమీక్షించారు. పట్టణ ప్రజలకు భవిష్యత్తులో కూడా ఎలాంటి మంచినీటి ఎద్దడి లేకుండా శుద్ధమైన కృష్ణా జలాల సరఫరాను మరింత మెరుగుపర్చేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పనులు వచ్చే సంవత్సరం జనవరి రెండో వారం సంక్రాంతి పండుగ నుండి యుద్ధప్రాతిపదికన మొదలవుతాయని చెప్పారు. దాదాపు 60 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసివున్న పాత పైపులైన్లను మార్చాల్సిన మార్గాలు, కొత్త రిజర్వాయర్ల ధనంబోడు కాలనీ, చెరువుబజార్, శాంతి నగర్, గురుకులపాఠశాల ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. రాబోవు 50 సంవత్సరాల వరకు పట్టణవాసులకు సరిపడ మంచినీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలనే లక్ష్యంతో ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామన్నారు. ఈ క్రమంలో మంచినీటి పంపింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన 100 హెచ్‌పి సామర్థ్యం కలిగిన మూడుకొత్త మోటార్లను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు కొత్త రిజర్వాయర్లు, కొత్త పైపులైన్లు, ఆధునాతన మోటార్లతో వేసవిలో కూడా నీటి సమస్యలు తలెత్తకుండా సరఫరా కొనసాగించే పరిస్థితులను తీసుకువస్తున్నామన్నారు. యుఐడిఎఫ్ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా, పారదర్శకతతో నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పనులు జరిగేప్పుడు రోడ్లు తవ్వాల్సి ఉంటుందని ఈ అసౌకర్యాన్ని భరించాల్సి ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈప్రాజెక్టు ద్వారా 95 కిలోమీటర్ల పైపులైన్లు, కొత్తగా 6,000 మంచినీటి కుళాయిలు మంజూరు చేస్తామన్నారు. 2058వ సంవత్సరం వరకు పెరిగే జనాభాను కూడా దృష్టిలోపెట్టుకుని పైపులైన్లు విస్తరిస్తున్నామన్నారు. నేడు 6 మిలియన్ లీటర్ల నీటి ప్రతిరోజూ సరఫరా చేస్తున్నామని ఈప్రాజెక్టు ద్వారా 12 మిలియన్ లీటర్లకు సామర్థ్యం పెంచుతున్నామని, ఈ పనులను 7 సంవత్సరాలపాటు మేఘా సంస్థ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని వివరించారు. కాగా కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు, ఇఇ వెంకటేశ్వం రెడ్డి, డిఇఇ ఉలిసి శివకోటేశ్వరరావు, ఏఇ హనుమంత రావు, మున్సిపల్ అధికార యంత్రాంగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు

# వినూత్న కార్యక్రమాలు

## - ఎపిహెచ్‌డిసి ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

విజయవాడ, డిసెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి: హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు, సాధికారత సాధించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని ఏపీ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ (ఎపిహెచ్‌డిసి) ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. ఈ క్రమంలో వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ హస్తకళా వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ గాంధీనగర్ లేపాక్షి ఎంపోరియంలో జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల పదిన వైఎస్ఆర్ కడప జిల్లా ఒనిపెంటలో గురుశిష్య హస్త్‌శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ (జిఎస్‌హెచ్‌పిపి) ద్వారా 30 మంది హస్తకళాకారులకు ఇత్తడి, కంచులోహపు వస్తువుల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 12న పల్నాడు జిల్లా దుర్గిలో 30 మంది కళాకారులకు డిజైన్ వర్క్‌షాప్, 13న తిరుపతి జిల్లా మాధవమాల, శ్రీకాళహస్తిలో కలప చెక్క కళాకారులకు, 14న అనకాపల్లి జిల్లా కెడిపేటలో 50 మంది కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు రాజమహేంద్రవరంలో 40 మంది కళాకారులతో ఏడు రోజుల గాంధీ శిల్ప్ బజార్, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 50 మంది శిలా శిల్పకళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ విసి అండ్ ఎమ్‌డి ఎం.విశ్వ, లేపాక్షి ఒఎస్‌డి ఐవి లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం.సురేష్ పాల్గొన్నారు.




# కలువాయిలో రిలే నిరాహారదీక్షలు

కలువాయి (నెల్లూరు), డిసెంబరు 9 ప్రభాతవార్త: ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఉండే కలువాయి మండలాన్ని గూడూరు డివిజన్ తిరుపతి జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వ గెజిట్ విడుదల చేసినప్పటి నుండి కలువాయి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈక్రమంలో మంగళవారం నుండి రిలే నిరాహారదీక్షను ప్రారంభించారు. వ్యాపారస్తులు, ఉద్యోగ సంఘాల నాయకులు రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొని సేవ్ కలువాయి అంటు నినాదాలు చేశారు.

### సిఎం దృష్టికి తీసుకొని వెళ్తా : కురుగొండ్ల


కలువాయి సేవ్ నినాదంతో జరుగుతున్న ఆందోళనలను వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకొని వెళ్ళేందుకు మంగళవారం తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు చల్లా రఘురామిరెడ్డి ఆద్వర్యంలో టిడిపినాయకులు జెఏసి నాయకులు గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా శాసనసభ్యులను కలిసి ప్రభుత్వం నుండి విడుదలైన గెజిట్ ప్రజలకు అసౌకర్యంగా ఇబ్బంది కరంగా ఉండడంతో ఇందుకు వ్యతిరేకంగా మండలంలో చేస్తున్న నిరసనలను ప్రజా వ్యతిరేక సంతకాలను, వినతి పత్రాలను కురుగొండ్లకు అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళతానని న్యాయం చేకూరే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు అధికార పార్టీ నాయకులు తెలిపారు.

# వికసిత్ భారత్‌కు 'వందేమాతరం' మార్గదర్శనం

## బెంగాల్ ఎన్నికలతో అనుసంధానం సరికాదు

## జాతీయ స్ఫూర్తిని పెంపొందించే అమరగీతం

## రాజ్యసభలో కేంద్రహోంమంత్రి అమిత్‌షా



న్యూఢిల్లీ, డిసెంబరు 9: వందే మాతరం భారతీయుల దేశభక్తి భావనకు ప్రతీక అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జాతీయ సంస్కృతి, జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించే అమర సృజన అని వందేమాతరం గీతాన్ని అభివర్ణించారు. రాజ్యసభలో వందేమాతరంపై చర్చను ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి అమిత్ సా 'బానిసత్వ కాలంలో అనేక దేవాలయాలు, విశ్వవిద్యాలయాలు, కళా కేంనరదాలు, మన వ్యవసాయ వ్యవస్థలు, మన విద్యా వ్యవస్థలు, అనేక గ్రంథాలయాలు ధ్వంసమయ్యాయి. కూల్చివేయ బడ్డాయి. ఈ భౌతిక సంస్థలు నాశనమైనప్ప టికీ మన సంస్కృతి, దాని స్ఫూర్తిని ఈ దేశ ప్రజల హృదయాల నుండి తొలగించలేకపోయాయి. ఆ స్ఫూర్తిని తిరిగి మేల్కొల్పడం, దానిని పునర్వ్యవస్థీకరించడం, బలోపేతం చేయడం అవసరం' అని అమిత్ షా అభిప్రా యపడ్డారు. వందే మాతరంపై ప్రత్యేక చర్చను బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలతో అనుసంధానం చేయడం తప్పని మండిపడ్డారు. బంకిం చంద్ర చట్టోపాధ్యాయ బెం గాల్‌కు చెందినవారు అయినా, వందే మాతరం ప్రభావం ఒక్క రాష్ట్రానికే పరిమితం కాలేదని చెప్పారు. మొత్తం దేశాన్ని, విదేశాల్లోని స్వాతంత్ర్య సమరయోధులను కూడా ప్రేరేపించిందని పేర్కొన్నారు. "ఈ రోజు కూడా సరిహద్దుల్లో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసే సైనికుల చివరి మాట వందే మాతరమే" అని అమిత్ షా అన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవం పెంపొందేలా యువతకు, రాబోయే తరాలకు దీని చరిత్రను, భావజాలాన్ని అవగాహన చేయడం కీలకమని తెలిపారు. వందే మాతరం స్ఫూర్తి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గదర్శకం అవుతుందని అన్నారు.

ప్రతిపక్ష విమర్శలకు సమాధానం: ఈ చర్చను బెంగాల్ ఎన్నికలతో అనుసంధానిస్తున్న ప్రతిపక్షాలపై స్పందిస్తూ, "ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారు తమ ఆలోచనను మరోసారి పునరాలోచించాలి. దేశభక్తిని రాజకీయ కళ్లజోడుతో చూడకూడదు" అని షా తీవ్రంగా విమర్శించారు. వందే మాతరం గీతం స్ఫూర్తి గతంలో అందించిన శక్తి భవిష్యత్తులో కూడా భారత అభివృద్ధికి దారితీస్తుందని అన్నారు.

షా వర్సెస్ ఖర్గే: వందేమాతరంపై ప్రత్యేక చర్చలో వందే మాతరం గీతం ప్రాముఖ్యాన్ని హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా వివరిస్తూ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ గీతం 150ఏళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని జరిగిన చర్చపై కొన్ని పార్టీలు వ్యక్తం చేసిన అనుమానాలకు సమాధానాలిచ్చారు. అప్పట్లో వందేమాతరం పాడిన వారిని ఇందిరా గాంధీ జైలులో పెట్టారని అమిత్ షా ఆరోపించారు. దీనిపై ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. '1921లో మహాత్మా గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించగా, వేలాది మంది కాంగ్రెస్ స్వాతంత్ర్య సమర వీరులు వందే మాతరం నినాదాలు చేస్తూ జైళ్లకు వెళ్లారు. కానీ అప్పటి మీ సిద్ధాంత పూర్వీకులు ఎక్కడ ఉన్నారు? వారు బ్రిటిషర్లతో కలిసి పనిచేశారు. మీ చరిత్ర అదే' అనిఖర్గే విమర్శించారు. ప్రధాని మోడీ తరచూ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని, అమిత్ షా కూడా అదే ధోరణిని అనుసరిస్తున్నారని ఆయన అన్నారు.



# కాకుటూరు వద్ద రోడ్డు ప్రమాదం

వలేటివారిపాలెం (నెల్లూరు), డిసెంబరు 9 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం కాకుటూరు హెరిటేజ్ సమీపాన నేషనల్ హైవే 167బి వద్ద మంగళవారం రెండు కార్లు ఢీకొన్నాయి. తీవ్ర ప్రమాదం తృటిలో తప్పిపోయింది. రెండు కార్లు తిరగబడ్డాయి. అయినా కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బ్రతికి బయటపడ్డారు. క్షతగాత్రులు కందుకూరు, ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. కందుకూరు నుంచి వలేటివారిపాలెం హైస్కూలు హెచ్‌ఎం కమలకుమార్, ఉపాధ్యాయులు ఐజాక్, బ్రహ్మయ్య, కుమార్, రామారావులు కారులో వలేటివారిపాలెం వైపు వెళ్తున్నారు. అదే సమయాన నూకవరం నుంచి కందుకూరువైపుకు వెళ్తున్న మరో కారుతో ప్రమాదం జరిగింది. దీంతో రెండు కార్లు తలకిందులయ్యాయి. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయులందరికి స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను కందుకూరు ఏరియా వైద్యశాలలో చేర్పించారు. డాక్టర్ కళ్యాణ్ వైద్యసేవలు అందించారు. అయినా మెరుగైన వైద్యం కావాలని క్షతగాత్రులను పలువురు ప్రైవేటు వైద్యశాలలకి తరలించారు. గుడ్లూరు సీఐ మంగారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారుల అభివృద్ధికి రూ.2,123 కోట్లు విడుదల

గన్నవరం, డిసెంబరు 9 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి మొదటి విడతలో ప్రభుత్వం రూ.2,123కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో మొత్తం 1,299 రహదారుల అభివృద్ధికి ఈనిధులు వెచ్చించనున్నారు. 4,007కిలోమీటర్ల మేర రహదారుల మరమత్తులు, కొత్తరోడ్ల నిర్మాణాలకు సంబందించి నిధులు విడుదల చేసారు.

## మల్లేపల్లి సర్పంచ్ గా దొమ్మా శ్రీను ప్రమాణస్వీకారం



**గండేపల్లి డిసెంబర్ 9 (ప్రభాతవార్త)** గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ సర్పంచ్ దొమ్మా శ్రీను ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గత నెల 17వ తేదీన గుండెపోటుతో మృతి చెందటంతో ఉపసర్పంచ్ గా ఉన్న దొమ్మా శ్రీను సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ పురోహితులు చింతా అరుణ్ కుమార్ శర్మ వేద ఆశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్ పోతుల మోహనరావు,తెలగరెడ్డి భద్రరావు,ప్రకాష్,దార్లంక నూకరాజు,వెలిది సుబ్రహ్మణ్యం, కాటేపల్లి భద్రరావు,కొత్త శివయ్య, గ్రంధి నాగబాబు,కొల్లి మల్లేపల్లి సర్పంచ్గా దమ్మ శ్రీను ప్రమాణస్వీకారం గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ సర్పంచ్ శ్రీను ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గత నెల 17వ తేదీన గుండెపోటుతో మృతి చెందటంతో ఉప సర్పంచ్ గా ఉన్న దొమ్మా శ్రీను సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ పురోహితులు చింత అరుణ్ కుమార్ శర్మ వేద ఆశీర్వచనం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్ పోతుల మోహన్రావు,సెక్రటరీ బిక్కన బాలవీరేంద్ర చౌదరి, బలిరెడ్డి గంగరాజు,రావిపాటి వెంకట్రావు,తెలగరెడ్డి భద్ర రావు ప్రకాష్ దార్లంక నూకరాజు,వెలిది సుబ్రహ్మణ్యం కాటేపల్లి భద్రరావు,కొత్త శివయ్య, రామకుర్తి నరసింహం,గ్రంధి నాగబాబు,కొల్లి త్రిమూర్తులు,గణేష్ తదితర గ్రామస్తులు,కూటమి నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు మనోధైర్యంతో ముందడుగు వేయాలి



**గండేపల్లి డిసెంబర్ 9 (ప్రభాతవార్త):** విద్యార్థులు మనోధైర్యంతో ముందడుగు వేయాలని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన రావు అన్నారు.విద్యార్థులు పరీక్షల కోసం జీవితాల్ని ఫణంగా పెట్టొద్దని ఆయన పిలుపునిచ్చారు. మల్లేపల్లి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు.వంటశాలలో భోజనాలు తయారు చేసే తీరును ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పనిచేస్తున్నారని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ వద్ద ఎడ్యుకేషనల్ హబ్ తీసుకువచ్చేందుకు ఆయన కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో తెలగ రెడ్డి భద్రరావు,తెలగ రెడ్డి ప్రకాష్, త్రిమూర్తులు,కాటేపల్లి భద్రం, బాబులు,నూకరాజు,దుర్గారావు, చింతపల్లి భద్రరావు,ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి రామ్మోహన్ నాయుడు చేస్తున్న కృషి అభినందనీయం



**రావులపాలెం, డిసెంబరు 09 (ప్రభాతవార్త) :** కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును టార్గెట్ చేస్తూ వైసీపీ దిగజారుడు రాజకీయాలకి పాల్పడుతోందని కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు దుయ్యబట్టారు. మంగళవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రిగా రామ్మోహన్ నాయుడు పనితీరును కేంద్రంలో ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నారని తెలిపారు.వైసీపీ వారు మాత్రం కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని, పరువు పోయింది అని మాట్లాడటం వారి వక్ర బుద్ధికి నిదర్శనమని అన్నారు. పరిస్థితి చక్కబెట్టడానికి గత నాలుగు రోజులుగా కేంద్రమంత్రి శ్రమ పడుతున్న తీరు పలువురు ప్రశంసలు అందుకుంటుందని అన్నారు. ప్రయాణికులకు 610 కోట్లు రిఫండ్ గా చెల్లించడం, ఇతర విమాన సర్వీసులు పెంచడం దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇండిగో విమాన సంస్థపై కేంద్రం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో గుత్తుల పట్టాభిరామారావు, ముత్యాల బాబ్జి, కాసా విజయ సాగర్, పల్లి యేసు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ఎస్టియు ఆర్థిక కార్యదర్శిగా హేమంత్ శివకుమార్..



**అంబాజీపేట,డిసెంబర్ 09, (ప్రభాతవార్త) :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్టియు ఆర్థిక కార్యదర్శిగా కుడుపూడి హేమంత్ శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర కన్వీనర్ బోనం గంగాధర్ తెలిపారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన జిల్లా ఎన్నికల్లో హేమంత్ శివకుమార్ ఎన్నికయ్యారని తెలిపారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హేమంత్ శివకుమార్ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఎన్నిక కావడంతో ఎస్ టి యు అంబాజీపేట మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కుంపట్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎండిఎన్ఎం.షరీఫ్, గంగలకుర్రు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నిట్టల దుర్గాప్రసాద్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## మూడు శాఖల అధికారులతో పంట నష్టంపై సర్వే.



**మామిడికుదురు.డిసెంబర్ 09(ప్రభాతవార్త)** ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల తాము తీవ్రంగా నష్ట పోయామంటూ పాశర్లపూడి, పాశర్లపూడి లంక గ్రామాలకు చెందిన రైతులు ఇటీవల డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ వి.మహేష్ కుమార్ కు పిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో రెవెన్యూ,ఉద్యానవన,వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు.వాటిలిటీ మీడియం డ్రైన్ కు ఇరు వైపుల ఉన్న దెబ్బతిన్న కొబ్బరి,మాగాణి పొలాలను సర్వే చేస్తున్నారు.ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల సుమారు 400 ఎకరాల్లో వరి,కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయని రైతులు పిర్యాదు చేశాయన్నారు. దీనిపై అమలాపురం ఆర్డీఓ కె.మాధవి తోపాటు పలువురు అధికారులు భూములు పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.దీనిపై స్పష్టత కోసం మూడు శాఖల ఉద్యోగులతో సంయుక్తంగా సర్వేకు ఆదేశించారు.ఈ సర్వేను సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు స్థానికులు పరిశీలించారు.

## ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ గా కళ్యాణ్ బాబు.



**మామిడికుదురు.డిసెంబర్ 09 (ప్రభాతవార్త) :** డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్టీయూ కౌన్సిలర్ గా కారుపల్లి కళ్యాణ్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా మంగళవారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో కళ్యాణ్ బాబును ఘనంగా సన్మానించారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ మొదటి స్థానంలో ఉంటుందని,సమస్యల పరిష్కారానికి తమ మొదటి అజెండా అని కళ్యాణ్ బాబు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు చిక్కం రవికుమార్,ప్రధాన కార్యదర్శి నేల వెంకటేశ్వరరావు,నాయకులు మట్టా నాగరాజు, కొమ్ముల వీర్రాఘవులు, శిరినీడి శ్రీరామ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఆటల పోటీలు విజయవంతం చేయాలి



**కొత్తపేట, డిసెంబర్ 9, (ప్రభాతవార్త)** మంగళవారం కొత్తపేట గర్ల్స్ హై స్కూల్ లో ఉపాధ్యాయుల గేమ్స్ షెడ్యూల్ లో భాగంగా కొత్తపేట డివిజన్ లెవెల్ లో క్రికెట్ మేల్ టీచర్స్, త్రోబాల్ ఫిమేల్ టీచర్స్ నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి ఎమ్ జి హరిప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ (ఉమెన్) ఏ ఎస్ రమాదేవి పర్యవేక్షణలో నిర్వహించినారు ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి సలీమ్ భాషా డివైఇఓ A రామకృష్ణ మూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు డివిజన్ పరిధిలో గల 7 మండలాల మండల విద్యాశాఖ అధికారులు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని భోజనాలు పిక్చర్ (గ్రౌండ్ ప్రిపరేషన్స్ కమిటీ ఏర్పాట్లు) చేసి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని దానికి ఏర్పాట్లు చేయాలని తెలియచేశారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 300 మందికి పుస్తకాలు పంపిణీ



**అన్నవరం, డిసెంబర్ 9,(ప్రభాత వార్త).** అన్నవరం సత్యదేవ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 300మంది విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేసారు. అనకాపల్లి లయన్స్ క్లబ్ గిన్నిపాకులు మూర్తి సహకారంతో సత్యదేవ జూనియర్ కళాశాల, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, ఆదర్శపాఠశాల స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దొండాకర గిరి, సత్యదేవ లయన్స్ క్లబ్ సెక్రటరీ పొన్నాడ సూరిబాబు, జూనియర్ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ అరుణకుమారి,సినీక్స్ లెక్చరర్ సుంకర వరప్రసాద్,జిల్లా పరిషత్ స్కూల్ హెచ్ఎం పార్వతి, ఉమాదేవి, బలరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుండా బైక్ పై రోడ్డుమీదకొస్తే కఠిన చర్యలు



**రావులపాలెం, డిసెంబరు 09 (ప్రభాతవార్త) :** రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వల్ల మరణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నందున ఇకపై హెల్మెట్ ఎవరు వాడకపోయినా కఠిన చర్యలు తప్పవని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. ఆలమూరు కొత్తూరు సెంటర్లో మంగళవారం ఆయన స్థానిక ఎస్సై జి.నరేష్ తో కలిసి హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మరణిస్తున్నారని అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అందువల్ల ఇకపై ఈ హెల్మెట్ వినియోగం పై గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా హెల్మెట్ వాడకపోతే కఠినమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. దీనిపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు.అందువల్ల కొత్తపేట డిఎస్పి సుంకర మురళీ మోహన్ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మేము నెమ్మదిగా వెళతాము ప్రమాదాలు ఉండవనుకోవడం తప్పని ఎదుటివారి వల్ల కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు ఈ హెల్మెట్ ను ఖచ్చితంగా వాడాలన్నారు. మనం వాడే సెల్ ఫోన్ భద్రతకే ఖరీదైన రక్షణ గార్డులు ఏర్పాటు చేస్తామని అలాంటిది ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నందున తలకు ఖచ్చితంగా హెల్మెట్ వినియోగించాలని సిఐ విద్యాసాగర్ సూచించారు.

## ఎమ్మెల్యే సత్యానందరావుకు కృతజ్ఞతాభివందనాలు



**కొత్తపేట, డిసెంబర్ 9,(ప్రభాతవార్త)** తననుకోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుని నియామకానికి సిఫారసు చేసిన కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కొత్తపేటకు చెందిన తమ్మన సాయి ప్రసాద్ తెలిపారు. నిస్వార్ధ ప్రజా సేవలు అందిస్తున్న మా ప్రియతమ నాయకులు సత్యానందరావుకు రుణపడి ఉంటానన్నారు ఆయన నేతృత్వంలో శ్రీ వెంకటేశ్వరుని సన్నిధిలో నా శక్తి మేరకు సేవలు అందిస్తానని సాయి ప్రసాద్ తెలిపారు

## పొలంబడి కార్యక్రమం క్షేత్ర దినోత్సవం



**పిఠాపురం డిసెంబర్ 9 (ప్రభాతవార్త) :** పిఠాపురం మండలం విరవ గ్రామంలో ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమం క్షేత్ర దినోత్సవం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి అని విజయకుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక వ్యవసాయం తగ్గించి సహజ మరియు సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించి అంతర్జాతీయ మార్కెట్ ని కూడా అందిపుచ్చుకోవచ్చని తెలియజేశారు. త్వరలో విరవగ్రామాన్ని పూర్తిగా రసాయన రహిత లేదా సేంద్రియ వ్యవసాయ గ్రామంగా సేంద్రియ తీర్చిదిద్దాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ నాయకులు పొలంబడి మీద వేసిన దృశ్య రూపము రైతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆదర్శ రైతులను తమనబోయి నాగేశ్వరరావు. అచ్యుత రామయ్య. కృష?. మొదలగు వారిని సత్కరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పిఠాపురం స్వాతి మండల వ్యవసాయ అధికారి గంగాధర్ గ్రామ వ్యవసాయ సహాయకులు ఎక్స్ ఎంపీపీ కురుమళ్ళ రాంబాబు. గ్రామ సర్పంచ్. వైస్ ప్రెసిడెంట్. ఎంపీటీసీలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నవరం దేవస్థానం నూతన ఈఓగా వేండ్ర త్రినాధరావు



**అన్నవరం, డిసెంబర్ 9,(ప్రభాత వార్త).** కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఈఓగా ఆర్జేసీ వేండ్ర త్రినాధరావుని నియమిస్తూ ఈమేరకు మంగళవారం రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం హరి జవహర్ లాల్ ఉత్తర్వులు జారీ చేసారు. త్రినాధరావు ఆర్జేసీతో పాటుగా అన్నవరం దేవస్థానం ఇన్చార్జ్ (ఎఫ్ ఎసి) ఈఓగా కొనసాగుతారు. ఇప్పటి వరకూ ఇఓగా చేసిన వీర్ల సుబ్బారావు మరో ఆరు నెలలపాటు కొనసాగుటకు విశ్వప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు.వేండ్ర త్రినాధరావుకు ఇంతకుముందు అన్నవరం ఈఓగా సమర్ధవంతంగా చేసిన అనుభవముండటం వలన ఆయనను ప్రభుత్వం నియమించింది.

## మెగా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట,డిసెంబరు 9, (ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తమిళనాడులోని రాయ వేలూరుకు చెందిన సిఎంసి అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎబ్బీ సైమన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెట్టి సైమన్ లు అన్నారు. అంబాజీపేటలోని లీజర్ మెమోరియల్ (స్త్రీల) ఆసుపత్రి వ్యవస్థాపకురాలు డాక్టర్ ఐరీన్ లీజర్ 99వ జయంతి సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 1967లో అంబాజీపేటలో డాక్టర్ ఐరీన్ లీజర్ స్త్రీల ఆసుపత్రి నెలకొల్పి 30 ఏళ్లకు పైబడి పేదలకు వైద్య సేవలు అందించడంతో అమ్మల ఆసుపత్రిగా ప్రసిద్ధి చెందిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యంను అందిస్తున్న లీజర్ మెమోరియల్ ఆసుపత్రి వైద్యులను అభినందించారు. ఈ వైద్య శిబిరంలో 10 వైద్య విభాగాలకు సంబంధించి 10 మంది అనుభవజ్ఞులైన వైద్యులచే 214 మంది రోగులకు 650 సంప్రదింపు సేవలు అందించినట్లు ఆసుపత్రి వైద్యులు వినీత్, సీఈవో హెవార్డ్ రాజ్ లు తెలిపారు. ఈ శిబిరంలో 10 మందికి రూ.100లకే స్కానింగ్,25 మందికి రూ.50లకే ఎక్సరే తీసామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో 22 మంది వైద్యులతో పాటు రంగరాయ మెడికల్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, కొర్లపాటి గోపి,మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ,నాగాబత్తుల వెంకట సుబ్బారావు,గుత్తుల రామకృష్ణ, మట్టపర్తి రమేష్,యర్రంశెట్టి నాగేంద్ర, మేడిది శ్రీను, ఏఎంసీ కార్యదర్శి ఐ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలికాలంలో గుండె సంబంధిత వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

### -మెడికవర్ గుండె వ్యాధి నిపుణులు




**కాకినాడ రూరల్, డిసెంబర్ 09 (ప్రభాతవార్త):** శీతాకాలంలో చలి ప్రభావం ఎక్కువగా ఉండటం చేత గుండె సంబంధిత వ్యాధులపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని మేడి కవర్ గుండె సంబంధిత వ్యాధి నిపుణులు మాతా శ్రీనివాస్, ప్రణవ్ పల్లెంపాటి , నరేష్ కూరాకుల పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా తగ్గినప్పుడు రక్తనాళాలు సంకోచించడంతో రక్తపోటు పెరగడం, గుండెపై ఒత్తిడి ఎక్కువవడం వంటివి హార్ట్ అటాక్లు వచ్చే అవకాశాలను రెట్టింపు చేస్తాయని, వయో వృద్ధులు, డయాబెటిస్, హైబీపీ, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, ధూమపానం చేసే వారు చలిలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. తెల్లవారు జామున ఎక్కువ చలి ఉన్న సమయంలో బయట నడక, కఠినమైన వ్యాయామాలు తగ్గించుకోవాలని, శరీరం వేడిని నిలుపుకునేలా వెచ్చని దుస్తులు ధరించాలని తెలిపారు. అలాగే నీరు తక్కువగా తాగడం కూడా బ్లడ్ థిక్నెస్ పెంచి ప్రమాదాన్ని పెంచుతుందని వారు వివరించారు. ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఎడమ చేయి లేదా దవడ వైపు నొప్పి వ్యాపించడం, గట్టిగా చెమటలు పడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. కార్డియాలజీ విభాగ నిపుణులు నరేష్ కూరాకుల మాట్లాడుతూ గుండెపోటు రాకుండా ఉండాలంటే మనం తీసుకునే ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు,ఆలివ్ ఆయిల్, అవకాడో, బాదం, పిస్తా వంటి మంచి కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. అత్యవసర హార్ట్ కేర్ సర్వీసులు, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, రోటా, సిఅర్టిడి, వంటి అత్యాధునిక చికిత్సలు మెడికవర్ హాస్పిటల్స్లో 24/7 అందుబాటులో ఉన్నాయని, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

## దాడి ఘటనపై కేసు నమోదు

**సీతానగరం, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** మండలంలోని రఘుదేవపురం గ్రామంలో ఓ మహిళపై జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7న రఘుదేవపురం గ్రామానికి చెందిన చేరుకూరి ఇందిరాపై అదే గ్రామానికి చెందిన తన్నీరు రజిని, తన్నీరు రాజా, తన్నీరు జయమ్మ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన ఇందిరా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు తన్నీరు రజిని, తన్నీరు రాజా, తన్నీరు జయమ్మపై కేసు నమోదు చేశామని ఎస్సై డి. రామ్ కుమార్ తెలిపారు.

## పదోన్నతి పై కొత్త పంచాయితీ కార్యదర్శులు

**కె.గంగవరం, డిసెంబర్ 9,(ప్రభాతవార్త):** గంగవరం మండలంలోని 5 గ్రామాలకు గ్రేడ్ 2 గా ఉన్న పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 1 గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ ద్వారా వెలువడిన ఉత్తర్వుల్లో బ్రహ్మపురి గ్రామ కార్యదర్శి గా నారాయణరెడ్డి, కూళ్ల పంచాయతీ కార్యదర్శి గా గౌరీ శంకర్రావు, తామరపల్లి పంచాయతీ కార్యదర్శి గా శ్రీనివాసరావు, కోటిపల్లి పంచాయతీ కార్యదర్శి గా వెంకటరమణ, కోట పంచాయతీ కార్యదర్శి గా భాస్కరరావు లు నియమింపబడినట్లుగా ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి.

## సోనియా జన్మదినోత్సవం



**అమలాపురం,డిసెంబర్9,ప్రభాతవార్త** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అయితా బత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి అందుకే పంచారు.కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చి ప్రధానమంత్రి అవ్వడానికి కాంగ్రెస్ పార్టీ నుంచి సంపూర? మెజారిటీ ఉన్నప్పటికీ ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకోకుండా తన కుమారుడు రాహుల్ గాంధీకి కుడా ప్రధాన మంత్రి బాధ్యతలు అప్పగించని నిజాయితీ గల నేత సోనియా గాంధీ అని పలువురు వక్తలు అభివరి?ంచారు.నీతి నిజాయితీతో ఆర్థిక రంగంలో అనుభవం ఉన్న మన్మోహన్ సింగ్ ని రెండు పర్యాయాలు ప్రధానమంత్రి చేయడం ద్వారా తన చిత్తశుద్ధి ని చాటారన్నారు. దేశం కోసం,దేశ రక్షణ కోసం దేశ అభివృద్ధి కోసం,దేశంలో పేద ప్రజల సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన ఏకైక కుటుంబం గాంధీ కుటుంబం అని వక్తలు కొనియాడారు.మహిళలకు రాజకీయ రంగంలో కూడా ప్రాధాన్యత కల్పించాలని స్థానిక సంస్థల్లో మహిళలకు 50% కల్పించిన ఘనత సోనియా గాంధీ దే అని పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ రవీంద్ర, ముషణి రామకృషా?రావు,కుడిపూడి శ్రీనివాస్,మెహబూబా షకీల, పేరి శర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శి వస్కా బాబు,సుగ్గు ప్రసాద్, అరిగెల శ్రీరామమూర్తి,అయితా బత్తుల కుమార్ సింగ్ మొదలగు వారు పాల్గొన్నారు.


## వాడపల్లి ఆలయం వద్ద పినపోతు

## గజేంద్రుడు విగ్రహం ఏర్పాటు చేస్తాం.



**రావులపాలెం, డిసెంబరు 09 (ప్రభాతవార్త) :** వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో మంగళవారం అగ్నికుల క్షత్రియ సమావేశం జరిగింది. వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడి చరిత్ర శాశ్వతంగా ఉండేలా చేస్తామన్నారు. ఒక వారం రోజుల్లో స్థలాన్ని ఏర్పాటు చేసి అగ్నికుల క్షత్రియులు ఏదైతే కోరుకున్నారో ఆ విధంగా, వారు సంతృప్తి వ్యక్తం చేసే విధంగా విగ్రహం ఏర్పాటు జరుగుతుందన్నారు. కీ. శే పినపోతు గజేంద్రుడు నిర్మించిన ఆలయం తిరుమల తరువాత తిరుమల అభివృద్ధి చెందుతుందన్నారు.సమాజమే దేవాలయం పేద ప్రజలే దేవుళ్ళు అనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అన్నారు. అగ్నికుల క్షత్రియులు అంటే ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి బలమన్నారు. గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ పైప్ లైన్ వల్ల ఉప్పు నీరు వచ్చి మత్స్యకారులు వేట లేక ఉపాధి కోల్పోతున్నారని అంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు తో కల్సి మీటింగ్ పెట్టి పరిహారం కోరడం జరిగిందన్నారు. బొబ్బర్లంక వరకూ ఉన్న మత్స్యకారులకు సైతం పరిహారం ఇవ్వాలని పోరాడుతున్నామని ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తెచ్చి మిగిలినవారికి ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్, చిలువూరి సతీష్ రాజు, కొప్పిశెట్టి ప్రసాద్, తోట స్వామి అగ్నికుల క్షత్రియ సంఘాల పెద్దలుక్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదిత్యలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలు



**గండేపల్లి డిసెంబర్ 9 (ప్రభాతవార్త)** సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్(పురుషుల) ఛాంపియన్ షిప్ పోటీలు జె,ఎన్.టి.యు.కె, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల రాజీవ్ గాంధీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఈ టోర్నమెంట్ డిసెంబర్ 10 నుండి 14 వరకూ జరుగుతుందన్నారు.దక్షిణ భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి మొత్తం138 జట్లు ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్లో పాల్గొంటున్నాయి.పూల్ వ్యవస్థ ఇలా ఉంది:పూల్ ఎ,బి-జె.ఎన్.టి.యు.కె నిర్వహణలో,పూల్ సి-ఆర్.ఐ.ఎం.ఎస్ కాకినాడ నిర్వహణలో,పూల్ డి-ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ నిర్వహణలో జరగనున్నాయి. ఇప్పటి వరకూ పూల్-డి కు చెందిన 20 జట్లు ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద రిపోర్ట్ అయ్యాయి. మొత్తం 34 జట్లు రిపోర్ట్ అవ్వాల్సి ఉంది.ఈ సంవత్సరం పోటీలు నాకౌట్-కవ్-లీగ్ ఫార్మాట్ లో నిర్వహించబడుతున్నాయి.

## కాకినాడ జిల్లా కోసం

## సంతకాల సేకరణ,పోస్ట్ కార్డు


### రెవెన్యూ డివిజన్ కనుమరుగు అవ్వనుందా..? - నాయకులకు కానరాని ప్రజా సమస్య

### కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం - ఆగని ఉద్యమ పోరాటం



**రామచంద్రపురం,డిసెంబర్ 9(ప్రభాతవార్త):** ద్రాక్షారామ స్థానిక బోస్ బొమ్మ సెంటర్ వద్ద రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష జేఏసీ మంగళవారం సంతకాల సేకరణ,పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నిర్వహించింది.నియోజకవర్గ ప్రజల న్యాయబద్ధమైన,దీర్ఘకాలిక డిమాండ్ను కూటమి ప్రభుత్వం బహిరంగంగా నిర్లక్ష్యం చేస్తోందని జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు,కో-కన్వీనర్ బత్తుల సిద్ధూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల ఆశలను ఆవిరి చేసిన గత ఎమ్మెల్యేలు,మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇక నేటి మంత్రి,ఎమ్మెల్యే సహా అధికార కుర్చీల కోసం ప్రజల ప్రయోజనాలను బలిచేస్తున్నారని వారు తీవ్రంగా మండిపడ్డారు.గత ఐదు నెలలుగా అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన నిరంతర ఉద్యమాలు,52 గ్రామ పంచాయతీలు,రెండు మండల ప్రజా పరిషత్ మరియు రామచంద్రపురం మున్సిపాలిటీ చేసిన ఏకగ్రీవ తీర్మానాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అవమానకరమని జేఏసీ నాయకులు విమర్శించారు.ప్రత్యేకంగా,అధికారంలో ఉన్న మంత్రి వాసంశెట్టి సుభాష్ కాకినాడ జిల్లా విషయంపై సుముఖత చూపకపోవడం దురదృష్టకరమని,ఇది ప్రజలంతా ఆలోచించవలసిన విషయం అని పేర్కొన్నారు.రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపకపోవడం వల్ల రామచంద్రపురం,కే.గంగవరం మండలాలు దిక్కులేనివిగా మిగిలిపోతాయని జేఏసీ హెచ్చరించింది.రామచంద్రపురం ఆర్డీవో పరిధిలో ఈ రెండు మండలాలే ఉండటం వల్ల రెవెన్యూ డివిజన్ నిర్వహణ క్లిష్టమవుతుందని,క్రమంగా రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అదృశ్యం అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేసింది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రామచంద్రపురం, కాకినాడ జిల్లా విలీనం ప్రకటించాలని జేఏసీ డిమాండ్ చేసింది. అలా చేయకపోతే రాబోయే మున్సిపల్ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనతా తీర్పు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుందని నాయకులు హెచ్చరించారు.రెవిన్యూ డివిజన్ కోసం పోరాటం చేయడం కన్నా,నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలన్న డిమాండ్ సరైంది కాక సమగ్ర ప్రయోజనకరమని జేఏసీ నేతలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలిపితే,జిల్లా కేంద్రమైన కాకినాడ ప్రజలకు మరింత చేరువవడమే కాక, రామచంద్రపురం డివిజన్ కూడా స్థిరంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలంతా కాకినాడ జిల్లా కావాలని ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్య లో ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు ముప్పనపల్లి గణేష్,ఆళ్ల సుబ్రహ్మణ్యం, ఆళ్ళ బుజ్జి, నల్లా బుచ్చిరాజు,వీరు బండి, దుళ్ళ కొండ, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు ఆకుల కొండ, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కొత్తపల్లి రామారావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మోర్త దొరబాబు, పీ.డీ.ఎస్.యు నాయకులు కరుపోతు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు...

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం..



**ఆత్రేయపురం,డిసెంబర్, 09,(ప్రభాత వార్త )** విద్యాశాఖ అధికారులు 1&2 వర ప్రసాదరావు, ఏ. సత్యనారాయణ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిదులుగా జిల్లా విద్యాశాఖాధికారి డా.సలీం బాషా,మండల అభివృద్ధి అధికారి బి.కె.ఎస్.ఎస్.వి రామన్, సమగ్ర శిక్ష, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ రాంబాబు,వాడపల్లి దేవస్థాన పాలక మండలి ఛైర్మన్ ముదునూరి వెంకట రాజు (గబ్బర్ సింగ్) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు విభిన్న ప్రతిభ కలిగి ఉంటారని, వారిలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహించాలన్నారు. దివ్యాంగులకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత ఉండేటట్లు తల్లిదండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్యంలో మందబుద్ధి కలిగిన వారు జీవితంలో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగిన దృష్టాంతాలను వివరించారు. తల్లిదండ్రులు ప్రేమతో, ఓర్పుతో బిడ్డలను పెంచే విధానం అదుతేమని తమ బిడ్డలు ఎందులోనూ తీసిపోరని ఆశావహ దృక్పథంతో ఉండడం సమాజానికి ఇస్తున్న మంచి సంకేతం అని అన్నారు. ఐ.ఈ.ఆర్. జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణ విభిన్న ప్రతిభావంతుల అవసరాల నిమిత్తం ప్రభుత్వం నుండి అనేక సంక్షేమ కార్యక్రమాల జరుగుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ.ఆర్.టీ.లు అరుణ, జానకి, ఉపాధ్యాయులు ఎస్.వి.వి.ఎన్.ఎస్. ప్రసాద్, సురేష్, ఆఫీసు సిబ్బంది రాంబాబు, ప్రశాంతి, సి.ఆర్.ఎంటీలు రాజేంద్ర, ఆత్మారావు, సుధాకర్, జాన్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

ఆట

## ఫిడే సర్క్యూట్‌లో.. అగ్రస్థానంలో ప్రజ్ఞా




**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఫిడే సర్క్యూట్ 2025లో విజేతగా ప్రకటించబడ్డాడు. తద్వారా వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఏకైక భారతీయుడిగా అర్హత సాధించాడు. ఈ సంవత్సరం భారత్ నుండి అత్యంత విజయవంతమైన పురుష ఆటగాడిగా చెన్నైకి చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ నిలిచాడు. టాటా స్టీల్ మాస్టర్స్, సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ రొమేనియా, ఉజ్‌చెస్ కప్ మాస్టర్స్, లండన్ చెస్ క్లాసిక్ ఓపెన్‌లలో టైటిళ్లను గెలుచుకున్నాడని తెలియజేస్తూ, క్రీడల ప్రపంచ పాలక సంస్థ ఫిడే ప్రకటించింది. మరియు స్టెపాన్ అవగ్యాన్ మెమోరియల్ మరియు 12వ సింక్‌ఫీల్డ్ కప్‌లో రెండవ స్థానంలో నిలిచాడు. కాగా ఫిడే సర్క్యూట్ 2025లో, ప్రజ్ఞ 115.17 స్కోరుతో ముగించగా, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరి 81.18 స్కోరుతో రెండవ స్థానంలో, నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్ 71.61 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచాడు. ఫాబియానో కరునా 65.55 స్కోరుతో, మాథియాస్ బ్లూబామ్ 83.94 స్కోరుతో ఐదవ స్థానంలో నిలిచారు. ఇదే సమయంలో ముగ్గురు భారతీయ మహిళలు దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి, ఆర్. వైశాలి వచ్చే ఏడాది మహిళా అభ్యర్థులకు అర్హత సాధించారు

## అర్జున్ చేతిలో కార్ల్‌సెన్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో ఎరిగైసి అర్జున్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించి, రౌండ్‌రాబిన్ దశలో మూడో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికాలోని గ్రూట్‌బోస్ ప్రైవేట్ నేచర్ రిజర్వ్‌లో జరుగుతున్న ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ రౌండ్‌రాబిన్ దశలో అర్జున్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించాడు. ఫిడే ప్రపంచ కప్ విజేత జావోఖిర్ సిందరోవ్, లెవాన్ అరోనియన్ వరుసగా 5.5 మరియు 5 పాయింట్లతో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఏడు రౌండ్ల తర్వాత అర్జున్ 4.5 పాయింట్లను సాధించాడు. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన ముగ్గురు ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్స్‌లో తమ ప్రత్యర్థులను ఎంచుకునే అవకాశం లభిస్తుంది. మొదటి ఎంపిక సిందరోవ్‌కు ఉంటుంది. భారత గ్రాండ్‌మాస్టర్ నాకౌట్‌లలో విన్సెంట్ కీమర్‌తో తలపడనుండగా, కార్ల్‌సెన్ ఫాబియానో కరువానాతో తలపడనున్నాడు. ఏడాది పొడవునా సాగే ఈ పర్యటనలో ఇది ఐదవ ఈవెంట్. గతంలో జర్మనీ, ఫ్రాన్స్, యుఎస్‌లలో ఈ పోటీలు జరిగాయి. ఫైనల్స్‌లో విజేత 2025 ఫ్రీస్టైల్ చెస్ ఛాంపియన్‌గా నిలిచిపోతారు.




## ప్రపంచ కప్ ఫైనల్స్.. రెండు స్వర్ణాలు సహా ఆరు పతకాలు

### ముగిసిన భారత్ ప్రచారం

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత జోరావర్ సింగ్ సంధు పురుషుల ట్రాప్ ఫైనల్‌లో మొదటి 10 లక్ష్యాలలో ఏడు హిట్‌లతో ఏడవ స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్, ప్రపంచ కప్-2025 ఫైనల్స్‌లో రెండు బంగారు పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలతో తమ రెండవ అత్యుత్తమ ప్రచారాన్ని ముగించింది. దోహాలోని లుసైల్ షూటింగ్ కాంప్లెక్స్‌లో జరిగిన నాలుగు



వ్యక్తిగత షాట్‌గన్ ఫైనల్స్‌కు హాజరైన ముగింపు షాట్‌గన్ డేలో జోరావర్ 30షాట్‌ల ఫైనల్‌లో, అతను తన పేలవ ప్రదర్శనతో నిష్క్రమించాడు. ఈ పోటీలో మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత్ సిమ్రాన్‌ప్రీత్ కౌర్ బ్రార్ అద్భుతమైన స్వర్ణం సాధించడం, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో సురుచి ఫోగట్ పోడియం చేరుకోవడం ఉన్నాయి. ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ తొలిసారిగా డబుల్ పోడియం ఫినిషింగ్‌ను నమోదు చేసింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, పురుషుల 25 మీటర్ల రాపిడ్‌ఫైర్ పిస్టల్‌లో అనిష్ భన్వాలా ఇతర రజత విజేతలు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ సామ్రాట్ రాణా ఏకైక కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. సీజన్ ముగింపు పోటీల ప్రారంభ పోటీ రోజున దోహాలోని లుసైల్ షూటింగ్ కాంప్లెక్స్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మహిళల ఈవెంట్‌లో వరుసగా స్వర్ణం, రజతం గెలుచుకున్న భారత అరంగేట్ర క్రీడాకారులు సురుచి ఫోగట్, సైన్యమ్ అతిపెద్ద సంచలనం సృష్టించారు.

## డబ్ల్యూటిటి ఫైనల్స్.. చైనీస్ జంటతో మనుష్, దియా డ్రా

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటి ఫైనల్స్ 2025, గ్రూప్ ఎలోని చైనీస్ జంటలతో జరిగిన కఠినమైన పోరులో భారత్ మ్యాచ్ డ్రా గా ముగిసింది. ఫైనల్స్‌లో భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా-దియా చిటాలే ఇద్దరు చైనీస్, హాంకాంగ్ జోడీలతో తలపడ్డారు. ఈ ఈవెంట్‌కు అర్హత సాధించిన ఏకైక భారతీయులు వీరే. చైనాకు చెందిన అనుభవజ్ఞులు మాన్ కుయ్/లిన్ షిడాంగ్-వాంగ్ చుకిన్/సన్ యింగ్షా ఒకే గ్రూప్‌లో ఉన్నారు. 2025 టేబుల్ టెన్నిస్ సీజన్ ముగింపునకు సంబంధించి ఈ నెల 10 నుండి 14 వరకు హాంకాంగ్‌లో టైటిల్




కోసం పోటీ జరగనుంది. ఇందులో టాప్ 8 జతల మధ్య గట్టి పోటీ ఉంటుంది. డబ్ల్యూటిటి కంటెండర్ ట్యూనిస్‌లో రెండు ఫైనల్స్, ఒక టైటిల్‌తో మనుష్-దియా విజయం తర్వాత, భారత్ ఫైనల్స్‌లో ప్రాతినిధ్యం వహించడం ఇదే మొదటిసారి. ఇప్పుడు గ్రూప్ ఎ లో టాప్ సీడ్ కువాన్/లిన్‌తో సహా మూడు ఉన్నత ర్యాంక్ జంటలతో భారత్ ద్వయం పోటీ పడనుంది. సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే టాప్2లో స్థానం సంపాదించాల్సి ఉంది.




## భారత్, సౌతాఫ్రికా టి-20ల్లో.. అత్యధిక సిక్సర్ల హీరోస్

### టాప్ 5లో సూర్య, సంజు, తిలక్

**న్యూఢిల్లీ:** భారతదేశం మరియు దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ ప్రారంభమైంది. ఈ రెండు దేశాల మధ్య గత టీ20 మ్యాచ్‌ల్లో టీమిండియాదే ఆధిపత్యంగా ఉంది. ఈ రెండు దేశాలు ఇప్పటివరకు మొత్తం 31 మ్యాచ్‌లు జరిగాయి. అయితే భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లలో అత్యధిక సిక్సర్లు బాదిన ఐదుగురు ఆటగాళ్లు ఉన్నారు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ డేవిడ్ మిల్లర్ 2011 నుండి 2024 మధ్య 25 టి20 మ్యాచ్‌లు ఆడి, 34.93 సగటుతో 524 పరుగులు చేశాడు. ఈ కాలంలో, ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ 35 సిక్సర్లు మరియు 29 ఫోర్లు కొట్టాడు. టీ20 ఫార్మాట్‌లో భారతదేశంపై మిల్లర్ ఒక సెంచరీ మరియు రెండు అర్థ సెంచరీలు సాధించాడు. అలాగే 2018 నుండి 2024 మధ్య, దక్షిణాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ 14 టీ20 మ్యాచ్‌ల్లో 25 సిక్సర్లు కొట్టాడు, మూడు అర్థ సెంచరీలతో సహా 26.30 సగటుతో 342 పరుగులు చేశాడు. ఇక టీమిండియా విధ్వంసక బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ 2022 మరియు 2024 మధ్య దక్షిణాఫ్రికాతో 11 టీ20 మ్యాచ్‌లు ఆడి, 41.33 సగటుతో 372 పరుగులు చేశాడు. ఈ కాలంలో సూర్య 24 సిక్సర్లు బాదాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ ఈ జట్టుపై ఒక సెంచరీ మరియు నాలుగు హాఫ్ సెంచరీలు చేశాడు. భారత ఆటగాడు తిలక్ వర్మ దక్షిణాఫ్రికాతో ఇప్పటివరకు ఆరు టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 21 సిక్సర్లు బాదాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ ఈ ఆరు మ్యాచ్‌ల్లో 77.25 సగటుతో 309 పరుగులు చేశాడు, అందులో 120 నాటౌట్‌గా నిలిచాడు. తిలక్ వర్మ ఈ జట్టుపై రెండు సెంచరీలు చేశాడు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ సంజు సామ్సన్ ఇప్పటివరకు దక్షిణాఫ్రికాతో నాలుగు టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 72 సగటుతో 216 పరుగులు చేశాడు. ఈ కాలంలో అతను 19 సిక్సర్లు మరియు 13 ఫోర్లు కొట్టాడు. దక్షిణాఫ్రికాపై సంజు రెండు సెంచరీలు చేశాడు.

## నష్టాలను వీడని సెన్సెక్స్, నిఫ్టీ




**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు పతనమయ్యాయి. దీనికితోడు, భారత బియ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త సుంకాలు విధించవచ్చనే వార్తలు సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్‌ఇ సెన్సెక్స్ 436.41 పాయింట్లు నష్టపోయి 84,666.28 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 120.90 పాయింట్లు క్షీణించి 25,839.65 వద్ద ముగిసింది. ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, టిసిఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి హెవీవెయిట్ షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి. అయితే, ఎటర్నల్, టైటాన్, అదానీ పోర్ట్స్, బిఇఎల్, ఎస్బీఐ వంటి షేర్లు లాభాల్లో ముగిసి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 0.32 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.14 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ, ఆటో, ఫార్మా సహా చాలా రంగాల సూచీలు దాదాపు 1 శాతం మేర నష్టపోయాయి. అంతర్జాతీయ వాణిజ్య ఆందోళనలు, లాభాల స్వీకరణ మార్కెట్లపై ఒత్తిడి పెంచుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. సమీప భవిష్యత్తులో సెంట్రల్ బ్యాంకుల నిర్ణయాలు, కరెన్సీ కదలికలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి 23 పైసలు బలపడి 89.88 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మారెనకట్‌లో బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్ ఒక్కింటికి 62.71 డాలర్లవద్ద కొనసాగుతుంటే ఔన్స్ బంగారం ధరలు 4206 డాలర్లవద్ద కొనసాగుతోంది.

## నెట్‌ఫ్లిక్స్ డీల్‌లో ట్రంప్ లిటిగేషన్!




**వాషింగ్టన్, డిసెంబరు 9:** నెట్‌ఫ్లిక్స్ వార్నర్‌బ్రదర్స్ మధ్య జరిగిన భారీ డీల్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నజర్ పడింది. ఆయన కుటుంబం ఆసక్తిచూపిస్తోంది. ట్రంప్ సర్కారుతో బంధం ఉన్న పారామౌంట్ స్కైడాన్స్ వార్నర్‌బ్రదర్స్ కోసం 108.4 బిలియన్ డాలర్ల బిడ్ వేసింది. ఈ బిడ్‌వెనుక ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ ఉన్నట్లు తెలుస్తోంది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ టివి, సినిమా స్టూడియోలు, స్ట్రీమింగ్ విభాగం కొనుగోలుచేసేందుకు నెట్‌ఫ్లిక్స్, కామ్‌కాస్ట్ కార్పొరేషన్, పారమౌంట్ సంస్థలు పోటీపడ్డాయి. ఈ బిడ్డింగ్ పోటీలో నెట్‌ఫ్లిక్స్‌వైపే డిస్కవరీ మొగ్గుచూపింది. 72 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6.48 లక్షలకోట్లతో వార్నర్‌సంస్థ కొనుగోలుకు డీల్ నడిచింది. అయితే ఈ డీల్ పరిశీలించాలని ట్రంప్‌చేస్తున్న ప్రకటనలు ఇపుడు సందిగ్ధంలో పడేశాయి. అలాగే పారామౌంట్‌కూడా ఈ డీల్‌పై ప్రశ్నలు సంధిస్తోంది. ఒక్కో షేరుకు 30 డాలర్లను చెల్లించేందుకు సిద్ధం అయింది. తాము ప్రతిపాదించిన బిడ్ నగదులో ఇస్తామని తెలిపింది. ఈ ఒప్పందంకింద వార్నర్‌బ్రదర్స్ ఇతర వ్యాపారాలుకూడా వస్తాయి. ఈ బిడ్ వెనుక కుష్నర్ నేతృత్వంలోని అఫినిటీ పార్టనర్స్ ఉందని రెగ్యులేటర్ ఫైలింగ్‌లో పారమౌంట్ వెల్లడించినట్లు అమెరికా ఆంగ్లపత్రికలు ఘోషిస్తున్నాయి. నెట్‌ఫ్లిక్స్ ఒప్పందం ప్రకారం ఒక్కోషేరుకు 28 డాలర్లు అందించాలన్నది డీల్‌లో ఉంది.




## అనిల్ తనయుడు అన్మోల్ అంబానీపై సిబిఐ కేసునమోదు

**ముంబయి,డిసెంబరు 9:** బ్యాంకులను మోసం చేసిన కేసులో ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్న ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. ఆయన కుమారుడు జై అన్మోల్ అంబానీపై కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ తాజాగా క్రిమినల్ కేసునమోదు చేసింది. రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్)తో ముడిపడిఉన్న బ్యాంకింగ్ మోసం కేసులో ఈ మేరకు చర్యలు చేపట్టింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మోసం, నేరపూరిత కుట్ర కారణంగా బ్యాంకుకు రూ.228.06 కోట్ల నష్టం వాటిల్లినట్లు సిబిఐ ఆరోపించింది. ఈ కేసులో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ సిఇఒ, డైరెక్టర్ రవీంద్ర సుధాల్కర్ సహా పలువురి పేర్లు కూడా ఉన్నాయి. యెస్ బ్యాంక్ రిలయన్స్ గ్రూప్ కేసుకు సంబంధించిన చార్జిషీట్‌లో రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ నిప్పాన్ సంస్థల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో జై అంబానీ పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు సిబిఐపేర్కొంది. గతంలో బ్యాంకు మోసాల కేసుల్లో అనిల్ అంబానీపై సిబిఐ,ఇడిలు దర్యాప్తు చేసినప్పటికీ కుమారుడు జై అంబానీపై కేసు నమోదు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇపుడు రిలయన్స్ హోంఫైనాన్స్ రూ.450 కోట్లు రుణం తీసుకుందని, తిరిగి చెల్లింపులో విఫలం అయిందని సిబిఐ వెల్లడించింది. ఈ గ్రాంట్ థోర్న్‌టన్ ఆడిట్‌సంస్థ నిర్వహించిన ఫోరెన్సిక్ పరిశీలనలో నిధులు మళ్లించారని తేలింది. 2016 ఏప్రిల్‌నుంచి 2019 జూన్ 30వరకూ మధ్యజరిగిన లావాదేవీలనుజల్లెడ పట్టడంతో రుణంగా తీసుకునన మొత్తాన్ని ఇతర అవసరాలకు వినియోగించినట్లు గుర్తించింది. ఈ వ్యవహారంపై యూనియన్ బ్యాంకు ఫిర్యాదుచేయడంతో సిబిఐ కేసునమోదుచేసింది.

## తనకు క్రెడిట్ ఇవ్వలేదనే భారత్‌పై ట్రంప్ అక్కసు!

### ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



**న్యూఢిల్లీ, డిసెంబరు 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీ మొత్తంలో సుంకాలు విధించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని ట్రంప్ చెప్పినప్పటికీ అసలు కారణం మాత్రం ఇది కాదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లు కేవలం ఒకసాకు మాత్రమేనని, వ్యక్తిగత వైరమే అసలు కారణమని ఆయన చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం ఎంతగా పాకులాడారో అందరికీ తెలిసిందేనని ఆయన గుర్తుచేశారు. శాంతి బహుమతి పొందడానికి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను తానే ఆపానంటూ ట్రంప్ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే భారత్, పాక్ మధ్య అణు యుద్ధాన్ని నిలువరించినట్లు ట్రంప్ చెప్పుకున్నారు. ఇరు దేశాలనూ టారిఫ్‌లతో బెదిరించి కాల్పుల విరమణకు అంగీకరించేలా చేశానని ప్రచారంచేసుకున్నారు. ఈప్రచారానికి పాక్ వంతపాడగా భారత్‌మాత్రం ఎప్పటికప్పుడు ఖండించింది. పాకిస్థాన్ సైన్యం ప్రాధేయపడడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ప్రధాని మోడీ పలు సందర్భాల్లో స్పష్టంచేశారు. ఈవిషయంలో అమెరికాసహా మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు క్రెడిట్ ఇవ్వలేదనే ఆగ్రహంతో భారత్‌పై ట్రంప్ కక్ష పెంచుకున్నారని, ఆ కోపంతోనే భారీగా టారీఫ్ లు విధించారని రఘురామ్ రాజన్ ఆరోపించారు. ఈ విషయంలో ట్రంప్ ప్రచారానికి వంత పాడడం ద్వారా పాక్ ప్రయోజనం పొందిందనిచెప్పారు. పాకిస్థాన్‌పై 19శాతం టారీఫ్‌లు విధించిన ట్రంప్.. భారత్‌పై మాత్రం 50 శాతం సుంకాలు వడ్డించడానికి ఇదే కారణమని చెప్పారు. రష్యా చమురు కొనుగోళ్లు అమెరికాకు ఎప్పుడూ ప్రధాన సమస్య కాదని రఘురామ్ రాజన్ చెప్పారు.



## భారతీయ కుటుంబాల్లో 35వేల టన్నుల పసిడి నిల్వలు!

### మోర్గాన్ స్టాన్లీ నివేదిక

**ముంబయి, డిసెంబరు 9:** ధరలు ఆకాశాన్నంటుతున్నా భారతీయులకు బంగారంపై మోజు ఏమాత్రం తగ్గడం లేదు. దేశంలోని కుటుంబాల వద్ద ఉన్న పసిడి నిల్వలపై ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ నివేదిక విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ నాటికి భారతీయ కుటుంబాల దగ్గర ఏకంగా 34,600 టన్నుల బంగారంఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. నగలు, కడ్డీలు, నాణేల రూపంలో ఉన్న ఈ పసిడి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.342 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ఇది మన దేశ జిడిపిలో 88.8 శాతానికి సమానం కావడం గమనార్హం. గతంతో పోలిస్తే బంగారం కొనుగోళ్లలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు కేవలం ఆభరణాల రూపంలోనే పసిడిని కొనుగోలు చేసేవారు. కానీ, గడిచిన యేడాది కాలంలో బంగారం 60 శాతానికి పైగా లాభాలు అందించడంతో చాలామంది దీనిని ఒక పెట్టుబడి సాధనంగా చూస్తున్నారు. ఈ ట్రెండ్‌ను గమనించిన మ్యూచువల్ ఫండ్ సంస్థలు కూడా గోల్డ్ ఇటిఎఫ్‌లు, మల్టీ అసెట్ ఫండ్స్ వంటి పథకాలతో ముందుకొస్తున్నాయి. అయితే, పెట్టుబడి ఉద్దేశంతో బంగారం కొనాలనుకునే వారు ఆభరణాలకు దూరంగా ఉండడమే మంచిదని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ ఒక నివేదికలో సూచించింది.

## అభివృద్ధికోసం బయటి శక్తులను ప్రతిఘటించాల్సిందే

### - గౌతమ్ అదానీ



**ధన్‌బాద్, డిసెంబరు 9:** భారత్ తన అభివృద్ధి మార్గాన్ని తానే నిర్దేశించుకోవాలని, బయటి శక్తుల నుంచి వచ్చే ఒత్తిళ్లను గట్టిగా ప్రతిఘటించాలని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఆర్థిక, వనరుల సార్వభౌమత్వం కోసం చేసే పోరాటాన్ని ఆయన రెండో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించారు. మంగళవారం ఐఐఎం(మైన్స్) ధన్‌బాద్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 21వ శతా బ్దంలో ఒక దేశ సార్వభౌమత్వం దాని సహజ వనరులు, ఇంధన వ్యవస్థలపై ఆధారపడి ఉంటుందని అదానీ స్పష్టం చేశారు. మన కాళ్ల కింద ఉన్న వనరులను, మన ఎదుగుదలకు ఇంధనమైన శక్తిని మనం నియంత్రించాలని ఆయన పిలుపునిచ్చారు. చారిత్రకంగా కర్బన ఉద్గారాలకు కారణమైన దేశాలే ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాధాన్యతలను నిర్దేశించే ప్రయత్నం చేస్తున్నాయని, దీన్నే కథన వలసవాదం అని ఆయన విమర్శించారు.

మన అభివృద్ధి ప్రయాణాన్ని మనం నియంత్రించక పోతే, మన ఆకాంక్షలను అణచివేస్తారని హెచ్చరించారు. ప్రపంచ గణాంకాలను ఉటంకిస్తూ, భారత్ నిర్దేశిత గడువు కంటే ముందే 50 శాతం శిలాజయేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించిందని, అయినా తలసరి ఉద్గారాల్లో ప్రపంచంలోనే అత్యంత తక్కువ స్థాయిలో ఉందని గుర్తుచేశారు. తలసరి కొలమానాలు, చారిత్రక బాధ్యతలను పరిగణనలోకి తీసుకోకుండా భారత్ పనితీరును తక్కువ చేసే ప్రయత్నాలు పక్షపాతంతో కూడిన అంతర్జాతీయ ఇఎస్‌జి ఫ్రేమ్‌వర్క్‌లను ప్రతిబింబిస్తాయని అన్నారు. మైనింగ్‌ను పాత ఆర్థిక వ్యవస్థ అని కొందరు అనొచ్చని, కానీ అది లేకుండా కొత్త ఆర్థిక వ్యవస్థ లేదని అదానీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐటీ ధన్‌బాద్ విద్యార్థుల కోసం రెండు కీలక కార్యక్రమాలను ప్రకటించారు. ఏటా 50 మందికి ప్రీప్లేస్‌మెంట్ అవకాశాలతో కూడిన పెయిడ్ ఇంటర్న్‌షిప్‌లు, టెక్స్‌మిన్‌తో కలిసి మెటావర్స్ ల్యాబ్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి అత్యాధునిక సౌకర్యాలతో అదానీ 3ఎస్ మైనింగ్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భయపడకుండా కలలు కనాలని, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.